14 . 11. 2025

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

శుక్రవారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 165 , పేజీలు : 12 వెల:రూ.5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper



## ప్రభుత్వ పథకాలను పొందేందుకు లబ్ధిదారులు మధ్య దళారులను నమ్మొద్దు

- ఎమ్మెల్యే పాయల్ శంకర్

**ఆదిలాబాద్ వెలుతురు నవంబర్ 13:**
ప్రభుత్వ పథకాలను పొందెందుకు లబ్ధిదారుల మధ్య దళారులను నమ్మొద్దని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు గురువారం జిల్లా పరిషత్ సమావేశం మందిరంలో కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు లబ్ధిదారులకు చెక్కులను అందిస్తూ వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు అదిలాబాద్

## బాలల దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు

**హైదరాబాద్ వెలుతురు నవంబర్ 13:**
స్వాతంత్ర్య సమరయోధుడు, దేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతి (నవంబర్ 14) సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆ మహనీయుడిని స్మరించుకున్నారు. నెహ్రూ జయంతిని పురస్కరించుకుని నిర్వహించే జాతీయ బాలల దినోత్సవం ఘనంగా జరుపుకోవాలని బాల బాలికలందరికీ ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. బాలలను జాతి సంపదగా భావించి వారి మెరుగైన భవిత వ్యానికి కృషి చేయాలన్న నెహ్రూ ఆకాంక్షల మేరకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. నేటి బాలలే రేపటి పౌరులన్న నెహ్రూ స్ఫూర్తితో ప్రజా ప్రభుత్వం పాఠశాల విద్యా రంగంలో మెరుగైన మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. చదువుతోనే బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి సాధ్యమని విద్యా రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు.



## పెట్టుబడులకు గమ్యస్థానంగా

# హైదరాబాద్

- అధికారంలో ఎవరున్నా వన్నె తగ్గని హైదరాబాద్ బ్రాండ్
- అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఫ్యూచర్ సిటీ నిర్మాణం
- ఆఫ్‌షోర్ క్యాంపస్‌లు ఏర్పాటుకు హైదరాబాద్ అనుకూలం
- హైదరాబాద్‌లో రోడ్లకు ప్రముఖ కంపెనీల పేర్లు
- ఢిల్లీ అమెరికన్- ఇండియా సదస్సులో సిఎం రేవంత్ రెడ్డి

### ఇక్కడ పెట్టుబడులకు భద్రతకు ప్రభుత్వం హామీ

### వేగవంతమైన వృద్ధి రేటుతో ఉన్న రాష్ట్రం తెలంగాణ



*హైదరాబాద్ ప్రపంచవ్యాప్త పెట్టుబడిదారులకు ఉత్తమ గమ్యస్థానమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు, పరిశ్రమలకు అనువైన వాతావరణం, భద్రతకు ఎటువంటి ఢోకా లేకుండా భౌగోళికంగా కేంద్ర స్థానంలో హైదరాబాద్ ఉందన్నారు. భారతదేశంలో పెట్టుబడులకు హైదరాబాద్ ముఖ ద్వారమని సీఎం తెలిపారు. జీసీసీలకు గ్యమస్థానంగా ఉన్న హైదరాబాద్‌లో పెట్టుబడులకు ముందుకు రావాలని సీఎం పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. దేశంలోనే పెద్ద సంఖ్యలో యువత, వేగవంతమైన వృద్ధి రేటుతో ఉన్న రాష్ట్రం తెలంగాణ అని ముఖ్యమంత్రి అన్నారు. ఢిల్లిలో గురువారం జరిగిన అమెరికా సంయుక్త రాష్ట్రాలు-భారతదేశం వ్యూహాత్మక భాగస్వామ్య సదస్సులో ముఖ్యమంత్రి ప్రసంగించారు.*

**న్యూఢిల్లీ,నవంబర్13 (వెలుతురు):**
తెలంగాణలో గత 35 ఏళ్లుగా కాంగ్రెస్‌తో పాటు అనేక పార్టీలు ప్రభుత్వాలకు సారథ్యం వహించినా పెట్టుబడులకు, పెట్టుబడిదారులకు అంద రూ మద్దతుగా నిలిచారని ముఖ్యమంత్రి వివరించారు. మహిళా సాధికారిత, నాణ్యమైన విద్య, యువతకు నైపుణ్య శిక్షణ, పట్టణాభివృద్ధితో పాటు మెరుగైన వసతులు, అత్యున్నత జీవన ప్రమాణాలతో కూడిన అంతర్జాతీయ స్థాయి నగరంగా హైదరాబాద్‌ను నిలపడమే తన ప్రథమ ప్రాధాన్యత అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. గత 23 నెలల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముఖ్యమంత్రి వివరించారు. అద్భుతమైన మౌలిక వసతులతో 30 వేల ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో భారత్ ఫ్యూచర్ సిటీ భారత దేశంలోనే నూతన నగరంగా మారుతుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మూసీ నదీ పునరుజ్జీవనం పూర్తయితే లండన్, టోక్యో, దుబాయి, సియోల్ రివర్‌ఫ్రంట్‌ల మాదిరే హైదరాబాద్ నైట్ ఎకానమీ కొత్త దశలోకి ప్రవేశిస్తుందని సీఎం అన్నారు. డ్రై పోర్ట్, మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్, రేడియల్ రోడ్లు, ట్రిపుల్ ఆర్ మధ్య మాన్యుఫ్యాక్చరింగ్ జోన్ వంటి కీలక ఇన్‌ఫ్రా ప్రాజెక్టుల పురోగతిని వివరించిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చైనా 1 మోడల్‌కు గ్లోబల్ సమాధానం తెలంగాణ అవుతుందని అన్నారు. హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్, ఆక్స్‌ఫర్డ్ వంటి ఐవీ లీగ్ విశ్వవిద్యాలయాలు హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ క్యాంపస్‌లు ఏర్పాటు చేస్తే తక్కువ



## కనీస సౌకర్యాల్లేవ్ ఇష్టమొచ్చినట్లు రేట్లు పెంచేస్తారా?

- భక్తుల ఇబ్బందులను పట్టించుకోరా?
- ఆర్జిత సేవా రుసుంను పెంచడంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం
- తక్షణమే రేట్లు తగ్గించి సౌకర్యాల కల్పనపై ద్రుష్టి సారించాలని సూచన

## సుప్రీం ఆదేశాలను పాటించని స్పీకర్

### ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసులో పూర్తికాని విచారణ

### మరోమారు సుప్రీంలో కేసు వేసిన బిఆర్ఎస్

### సోమవారం విచారణ చేపడతామన్న సుప్రీం

**న్యూఢిల్లీ,నవంబర్13( వెలుతురు):**
తెలంగాణ రాజకీయాల్లో మరోమారు ఉత్కంఠత మొదలయ్యింది. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ విచారణలో స్పీకర్ కోర్టు ధిక్కరణకు పాల్డ్డారని బిఆర్ఎస్ సుప్రీంలో కేసు దాఖలు చేసింది. అయితే అంతకు ముందే ఎమ్మెల్యేల ఫిరాయింపు విచారణపై స్పీకర్ సుప్రీంను గడువు కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. ఈ క్రమంలో పార్టీ మారిన ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసుతో పాటు అన్నింటిపై

## హైదరాబాద్‌లో హై అలర్ట్

### సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ముమ్మర తనిఖీలు

### పర్యాటక ప్రాంతాలు, షాపింగ్ మాల్స్‌లోనూ సోదాలు



**హైదరాబాద్, నవంబర్13( వెలుతురు):**
భాగ్యనగరంలో హైఅలర్ట్ కొనసాగుతోంది. దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన బాంబు పేలుళ్ల నేపథ్యంలో మెట్రో నగరాల్లో హై అలర్ట్ కొనసాగుతోంది. బస్టాండ్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లు , శంషాబాద్ ఎయిర్ పోర్టులలో విస్తృత తనిఖీలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో రైల్వే పోలీసులు తనిఖీలు చేపట్టారు. రైల్వే స్టేషన్‌లో బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో అధికారులు తనిఖీలు నిర్వహించారు. మతపరమైన ప్రాంతాలు, పర్యాటక

## మంత్రి కొండా సురేఖ క్షమాపణలు

### పరువునష్టం కేసు ఉపసంహరించుకున్న నాగార్జున



**హైదరాబాద్,నవంబర్13( వెలుతురు):**
తెలంగాణ మంత్రి కొండా సురేఖపై వేసిన పరువు నష్టం దావా కేసును ప్రముఖ సినీ హీరో నాగార్జున వెనక్కి తీసుకున్నారు. తమ కుటుంబంపై సురేఖ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ వేసిన పరువు నష్టం దావా కేసును ఉపసంహరించుకున్నట్లు నాగార్జున వెల్లడించారు. గతంలో నాగచైతన్య-సమంత విడాకులపై మంత్రి కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేశారు.

## ఎర్రకోట ఘటన వెనక నిప్పులాంటి నిజాలు

### 32 కార్లతో వరుస పేలుళ్ల కోసంరెడీ అయిన ముష్కరులు

### డిసెంబర్ 6న దాడులకు పాల్పడాలన్న భారీ స్కెచ్

### దర్యాప్తులో వెల్లడవుతున్న కుట్ర కోణాలు



**న్యూఢిల్లీ, నవంబర్13 (వెలుతురు):**
దేశ రాజధాని ఢిల్లీ నగరంలోని ఎర్రకోట వద్ద జరిగిన కారు పేలుడు ఘటన దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ పేలుడు కేవలం ఒక చిన్న సంఘటన కాదని, దీని వెనుక దేశ వ్యాప్తంగా భారీ ఉగ్ర దాడులకు ప్రణాళిక వేసినట్లు భద్రతా ఏజెన్సీలు గుర్తించాయి. ఈ కుట్రలో వైట్‌కాలర్ ఉగ్రవాదులు పాల్గొన్నట్లు దర్యాప్తు సంస్థలు పేర్కొన్నాయి. భారీ ఉగ్రదాడి చేసేందుకు.. పేలుడు పదార్థాలు నింపిన 32 కార్లను సిద్ధం

## ఆర్టీసీలో రెవెన్యూ పెంచుకోవడానికి అవకాశాలు అన్వేషించాలి..



*నగరంలో పెరుగుతున్న కొత్త కాలనిలకు అనుగుణంగా బస్సురూట్ లు పెంచేలా స్టడీ చేయండి.*

*కారుణ్య నియామకాల కింద నియమించబడిన కండక్టర్ ల ప్రొవిజన్ పిరియడ్ 3 సంవత్సరాల నుండి 2 సంవత్సరాలకు తగ్గించేలా పరిశీలించండి*

*నష్టాల్లో ఉన్న ఆర్టీసీ డిపో లపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు, లాభాల్లోకి వచ్చేలా ఆయా డిపోలకు ప్రత్యేక కార్యాచరణ*

*అరంఘార్ లో అధునాతన బస్సు టెర్మినల్ నిర్మాణం కోసం ఆర్టీసీ, పోలీస్ శాఖల భూ బదలాయింపు పై చర్చించాలి.*

*నగరంలో కొత్త బస్సు డిపో లకు స్థల పరిశీలన చేసి జిల్లా కలెక్టర్ తో ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలి*

*బస్సు ప్రమాదాలు తగ్గించడానికి డ్రైవర్ మానిటరింగ్ సిస్టం అమలు*

*ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా ఫోర్త్ సిటీ లో బస్ టెర్మినల్ ఏర్పాటు, బస్సు సౌకర్యాల పై అధ్యయనం చేయాలి*

*త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ కండక్టర్ లు ,డ్రైవర్లు ఇతర ఉద్యోగులతో జూమ్ సమావేశం నిర్వహిస్తా*

*ఆర్టీసీ ఉన్నతాధికారుల సమీక్షా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్*

## సిఐఐ సదస్సుకు విశాఖ ముస్తాబు

### 14,15 తేదీల్లో రెండ్రోజులు పాటు సదస్సు

### తైవాన్ కంపెనీలతో రెండు కీలక ఒప్పందాలు

### ఎక్స్ వేదికగా సిఎం చంద్రబాబు వెల్లడి




**విశాఖపట్నం,నవంబర్ 13( వెలుతురు):**
విశాఖలో రెండురోజుల పాటు జరిగే సీఐఐ భాగస్వామ్య సదస్సు కోసం సముద్రతీర నగరం విశాఖపట్టణం అందంగా ముస్తాబయ్యింది. 14,15 తేదీల్లో సిఐఐ సదస్సు జరుగనుండగా... ఇందు కోసం ప్రభుత్వ యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ సదస్సును రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ముఖ్యమంత్రి

## రెన్యూ పవర్ రూ. 82 వేల కోట్లు పెట్టుబడులు

### సిఎం చంద్రబాబు సమక్షంలో ఒప్పందం



**విశాఖపట్నం,నవంబర్ 13( వెలుతురు):**
భాగస్వామ్య సదస్సు కంటే ముందుగానే రాష్ట్ర ప్రభుత్వం భారీ ఎత్తున ఎంఓయూలు కుదుర్చుకుంటోంది. గత ప్రభుత్వంలో రాష్ట్రం నుంచి వెళ్లిపోయిన పరిశ్రమలు తిరిగి ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు సంసిద్ధత వ్యక్తం చేస్తున్నాయి.

## ఇళ్ల పథకంలో క్రెడిట్ చోరీ స్కీమ్

- 18 నెలల కాలంలో ఒక్క గజం కేటాయింపు ఏదీ
- ఎక్స్ వేదికగా వైకాపా నేత జగన్ విమర్శలు



## ప్రభుత్వ పథకాలను పొందెందుకు లబ్ధిదారులు మధ్య దళారులను నమ్మొద్దు

నియోజకవర్గంలో అదిలాబాద్ అర్బన్ 109 అదిలాబాద్ రూరల్ 79 మావల 68 సత్నాల 12 మొత్తం 268 చెక్కులను పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో డిసిసి చైర్మన్ అడ్డి భోజరెడ్డి రెడ్డి ఆర్డీవో స్రవంతి .అధికారులు బిజెపి నాయకులు పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ లబ్ధిదారులకు ప్రభుత్వ ఫలాలు పొందేందుకు ఈ మధ్య దళారికి డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు ఆడపిల్లల పెళ్లిళ్లు ఎంత కష్టంగా ఉంటాయో తనకు తెలుసు అని అన్నారు ప్రభుత్వాలు కూడా ఆడపిల్లల పెళ్లిళ్ల కోసం ఆర్థిక సాయం అందిస్తున్నాయన్నారు ప్రభుత్వాలు ఏవైనా పార్టీలు ఏవైనా నాయకులు ఎవరైనా అంతిమంగా వారి లక్ష్యం ప్రజల సంక్షేమం అని తెలియజేశారు ప్రజలు ప్రభుత్వ పథకాల్లో భాగ్యస్వాములై వాటిని సద్వియోగం చేసుకోవాలని అన్నారు

## కనీస సౌకర్యాల్లేవ్ ఇష్టమొచ్చినట్లు రేట్లు పెంచేస్తారా?

**కరీంనగర్ వెలుతురు నవంబర్ 13:**

కొండగట్టు దేవస్థానంలో ఆర్జిత సేవా రుసుంను భారీగా పెంచడంపట్ల కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొండగట్టు ఆలయంలో కనీస సౌకర్యాల్లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారని, సౌకర్యాల మీద దృష్టి సారించాల్సిన అధికారులు... వాటిని విస్మరించడమే కాకుండా ఆర్జిత సేవా రుసుం పేరుతో అడ్డగోలుగా ధరలు పెంచడమేంటని ప్రశ్నించారు. గురువారం రోజున ఉదయం కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ దేవాదాయ శాఖ అధికారులతో ఫోన్ మాట్లాడుతూ కొండగట్టులో ఆర్జిత సేవా రుసుం పెంపుపై అసహనం వ్యక్తం చేశారు. "కొండగట్టు అంజన్న ఆలయంలో భక్తులకు కనీస సౌకర్యాల్లేవు. తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ టైంలో కనీస సౌకర్యాలపై దృష్టి సారించకుండా అడ్డగోలుగా ఆర్జిత సేవా రుసుంను పెంచడమేంటి?"అని ప్రశ్నించారు. తక్షణమే ఆర్జిత సేవా రుసుంను తగ్గించాలని సూచించారు. అట్లాగే కొండగట్టు దేవస్థానంలో కనీస సౌకర్యాల కల్పనపై దృష్టి పెట్టి భక్తులకు ఇబ్బందులను తొలగించాలని కోరారు.

## సుప్రీం ఆదేశాలను పాటించని స్పీకర్

సోమవారం విచారణ జరుపుతామని సుప్రీంకోర్టు తెలిపింది. ఈ కేసు రాష్ట్ర రాజకీయ భవిష్యత్తును, శాసనసభ పటిష్ఠతను ప్రభావితం చేయనుంది అనడంలో సందేహం లేదు. గతంలో ఒక పార్టీ నుంచి గెలిచి, మరో పార్టీలో చేరిన ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీంకోర్టు ఎలాంటి తీర్పు ఇస్తుందనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రస్తావన కూడా ఉండడం, ఈ విచారణకు మరింత ప్రాధాన్యత తీసుకొచ్చింది. సోమవారం విచారణ రానున్న ఈ కేసులో.. ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీంకోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే దానిపై రాజకీయ వర్గాల్లో భారీ ఉత్కంఠ నెలకొంది. ఈ తీర్పు.. భవిష్యత్తులో రాజకీయ నాయకులు పార్టీలు మారే విధానాన్ని, ఫిరాయింపులకు పాల్పడే ధోరణిని పూర్తిగా మార్చేసే అవకాశం ఉంది. కేసు ప్రాధాన్యత నేపథ్యంలో సుప్రీంకోర్టు ఇవ్వబోయే తుది తీర్పు.. ఫిరాయింపులను ప్రోత్సహించే పార్టీలకు, ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలకు ఒక కఠినమైన హెచ్చరికగా మారుతుందో లేదో వేచి చూడాలి.

## హైదరాబాద్‌లో హై అలర్ట్

ప్రాంతాలు, షాపింగ్ మాల్స్‌లోనూ సోదాలు జరుగుతున్నాయి. అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సిటీ పోలీసులు ఆదేశాలు జారీ చేశారు. హోటల్స్‌పై పోలీసుల నిఘా పెంచారు. ఇక.. దేశంలో ఎక్కడ, ఏ ప్రాంతంలో పేలుళ్లు జరిగినా వాటి మూలాలు హైదరాబాద్‌లో ఉండటం తీవ్ర కలకలం రేపుతున్న విషయం. ఎన్ఐఏ, వివిధ రాష్ట్రాలకు చెందిన పోలీసులు రాష్ట్రంలో తనిఖీలు చేయగా.. అనుమానిత వ్యక్తులు పట్టుబడటం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల రాజేంద్రనగర్‌లో ఉగ్రవాద ఆరోపణలతో డాక్టర్ అహ్మద్ మొహియుద్దీన్ సయ్యద్‌ను గుజరాత్ ఏటీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. గత అర్ధరాత్రి సయ్యద్ ఇంట్లో సోదాలు జరిపిన గుజరాత్ పోలీసులు.. పలు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఇలా.. రెండు రోజుల క్రితం ఢిల్లీలో భారీ పేలుడు ఘటన దేశాన్ని ఉలిక్కిపడేలా చేసింది. ఎర్రకోట మెట్రోస్టేషన్ సిగ్నల్ వద్ద నిలిచిన ఓ కారులో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో పలువురు ప్రాణాలు కోల్పోగా.. అనేక మంది తీవ్రంగా గాయపడ్డారు. ఢిల్లీ బ్లాస్ట్‌తో దేశవ్యాప్తంగా మెట్రో నగరాల్లో హైఅలర్ట్ కొనసాగుతోంది.

## ఎర్రకోట ఘటన వెనక నిప్పులాంటి నిజాలు

చేసేందుకు అనుమానిత ఉగ్రవాదులు ప్లాన్ చేసినట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు వెల్లడించాయి. డిసెంబర్ 6న దాడులకు పాల్పడాలని ఉగ్రవాదులు భావించారని విచారణలో తేలింది. అందుకోసమే ఈ 32 కార్లను కూడా సిద్ధం చేసుకున్నారని దర్యాప్తులో తేలింది. ఈ 32 కార్లతో ఢిల్లీతో సహా దేశంలోని పలు నగరాల్లో ఏకకాలంలో దాడుల కోసం ఉపయోగించాలని అనుమానిత ఉగ్రవాదులు భావించినట్లు అధికారులు గుర్తించారు. నిందితులు దాడుల కోసం ఐ20, ఎకోస్పోర్ట్ వంటి కార్లను ఎంపిక చేసుకుని.. వాటిని పేలుడు పదార్థాలను నింపేందుకు వీలుగా మార్పులు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. సీరియల్ పేలుళ్లకు పాల్పడాలన్నదే వారి ప్రధాన ఉద్దేశమని భద్రతా ఏజెన్సీల దర్యాప్తులో తేలింది. ఈ కేసులో ఇప్పటి వరకు నాలుగు కార్లను గుర్తించారు. ఇవన్నీ పాత కార్లుగా తేలాయి. దాడుల కోసం పాత కార్లను ఉపయోగించేందుకు కొనుగోలు చేసినట్లు అధికారులు గుర్తించారు. ఇప్పటికే బ్రెజ్జా, స్విఫ్ట్, ఎకోస్పోర్ట్ వంటి కార్లను పోలీసులు గుర్తించారు. బ్రెజ్జా కారు హర్యానాలోని ఫరీదాబాద్(ఉజీసాతిజిజిజిఇ)లోని అల్-ఫలాహ్ స్కూల్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ సెంటర్ క్యాంపస్‌లో కనుగొనబడింది. అలానే ఎకోస్పోర్ట్ కారు బుధవారం రాత్రి హర్యానాలోని ఫరీదాబాద్‌లో కనుగొనబడింది. మరోవైపు ఈ 32 కార్ల ద్వారా నాలుగు వేర్వేరు లోకేషన్లలో దాడులకు వినియోగించాలని మొత్తం ఎనిమిది మంది అనుమానిత ఉగ్రవాదులు ప్రణాళిక వేసినట్లు ఇంటెలిజెన్స్ అధికారులు వెల్లడించారు. ఈ దాడుల కోసం అవసరం అయ్యే పేలుడు పదార్థాల కొనుగోలుకు వైట్‌కాలర్ డాక్టర్లు నిధులు సమకూర్చారని పేర్కొన్నారు. నిందితులు సుమారు రూ. 26 లక్షల నిధిని సేకరించినట్లు సమాచారం. ఈ నిధులను పోగు చేసిన అనుమానితుల్లో డాక్టర్ ముజమ్మిల్ గన్నై, డాక్టర్ అదీల్ అహ్మద్ రాథర్, డాక్టర్ షహీన్ సయ్యిద్, డాక్టర్ ఉమర్ నబీ ఉన్నారని అధికారులు గుర్తించారు. ఈ నిధులను ఉగ్ర కార్యకలాపాలను నిర్వహించేందుకు ప్రధానంగా డాక్టర్ ఉమర్ నబీ ఉపయోగించినట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. ఉన్నత విద్యావంతులు, వైట్‌కాలర్ ఉద్యోగులు ఉగ్ర కుట్రలో భాగం కావడాన్ని కేంద్ర ప్రభుత్వం, దర్యాప్తు సంస్థలు తీవ్రంగా పరిగణిస్తున్నాయి.

## మంత్రి కొండా సురేఖ క్షమాపణలు

2 అక్టోబర్ 2024న హైదరాబాద్ మీడియాతో మాట్లాడిన మంత్రి సురేఖ.. నాగచైతన్య-సమంత విడాకులకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కారణమంటూ సంచలన కామెంట్స్ చేశారు. తెలంగాణ రాజకీయాల్లో ఈ కామెంట్స్ తీవ్ర దుమారం రేపాయి. మంత్రి వ్యాఖ్యలపై సీరియస్ అయిన నటుడు నాగార్జున పరువు నష్టం దావా కేసు వేశారు. క్రిమినల్ చర్యలు తీసుకోవాలని పిటిషన్ వేశారు. కేసుపై నాంపల్లి స్పెషల్ కోర్టు గురువారం విచారణ చేపట్టింది. అయితే, కొండా సురేఖ బహిరంగ క్షమాపణ చెప్పడంతో కేసును విత్ డ్రా చేసుకున్నారు నాగార్జున. కాగా, ఇప్పటికే సోషల్ మీడియా వేదికగా అక్కినేని కుటుంబానికి రెండోసారి క్షమాపణ చెప్పారు మంత్రి కొండా సురేఖ.ఈ క్రమంలో మంత్రి కొండా సురేఖపై వేసిన క్రిమినల్ దావాను ప్రముఖ నటుడు నాగార్జున ఉపసంహరించుకున్నారు. నాగార్జున కుటుంబంపై తాను గతంలో చేసిన వ్యాఖ్యలపై చింతిస్తున్నానని మంత్రి కొండా సురేఖ ఎక్స్‌లో పోస్టు చేశారు. నాగార్జున, ఆయన కుటుంబాన్ని బాధ పెట్టాలనే ఉద్దేశంతో నేను ఆ వ్యాఖ్యలు చేయలేదు. వారిని ఇబ్బందిపెట్టాలని కాని, వారి పరువు-ప్రతిష్టలకు భంగం కలిగించాలన్నది కాని నా ఉద్దేశం కాదు. నాగార్జున కుటుంబంపై నేను చేసిన వ్యాఖ్యల్లో ఏదైనా పొరపాటు ఉంటే అందుకు చింతిస్తున్నా. నా వ్యాఖ్యలు ఉపసంహరించుకుంటున్నానని పేర్కొన్నారు. ఈ క్రమంలో మంత్రిపై దాఖలు చేసిన పరువునష్టం కేసును ఉప సంహరించుకుంటున్నట్లు నాగార్జున తెలిపారు.

# ఆర్టీసీలో రెవెన్యూ పెంచుకోవడానికి అవకాశాలు అన్వేషించాలి..

**హైదరాబాద్ వెలుతురు నవంబర్ 13:**

మహా లక్ష్మీ పథకం వచ్చిన తర్వాత సంక్షోభంలో ఉన్న ఆర్టీసీ క్రమక్రమంగా లాభాల బాటలోకి వస్తున్నప్పటికీ ప్రభుత్వం నుండి నెల వారిగా వస్తున్న మహాలక్ష్మి టికెట్ ఆదాయమే కాకుండా అదనపు ఆదాయంపై దృష్టి సాధించాలని సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఆర్టీసీ లో ఇప్పటి వరకు మహిళలకు 237 కోట్ల జీరో టికెట్ ఉపయోగించుకున్నారు. 7980 కోట్ల రూపాయలు ఆర్టీసీ కి ప్రభుత్వం చెల్లించింది. టికెట్ ఆదాయంతో పాటు టికెట్ యేతర ఆదాయంపై దృష్టి సారించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఆర్టీసీ బస్సులు ,బస్ స్టేషన్ లలో %c% టీమ్ మిషన్ ల ద్వారా వచ్చే టికెట్ పై అడ్వర్టైజ్మెంట్స్ ద్వారా ఆదాయాన్ని మరింత పెంచాలని సూచించారు. ప్రస్తుతం నష్టాల్లో కొనసాగుతున్న తాండూరు ,వికారాబాద్ , బీహెచ్ఈఎల్ , మియాపూర్ , కుషాయిగూడ , దిల్ సుఖ్ నగర్ , హకీంపేట్ , రాణిగంజ్ , మిథాని తో పలు పలు డిపో లు నష్టాల బారిన ఉండడానికి గల కారణాలు , స్థానిక పరిస్థితులు ఆయా డిపోలు లాభాల బాట పట్టడానికి తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేయడానికి ప్రత్యేక కమిటీ వేయాలని ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి నీ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ప్రయాణికులకు అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచుకునేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశ చారు. నగరంలో ఇప్పటికే 500 వరకు ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నందున పీఎం ఈ -డ్రైవ్ కింద హైదరాబాద్ కి కేటాయించిన 2 వేల బస్సులు విడతల వారిగా రానుండడంతో అందుకు సంబంధించిన చార్జింగ్ స్టేషన్లు మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. నగరంలో పెరుగుతున్న కొత్త కాలని లకు ,నగరానికి సంబంధించిన వారు ఉదాహరణగా కొల్లూరు వద్ద డబల్ బెడ్ రూం ల వద్ద నివసిస్తున్న వేలాది మందికి రవాణా సౌకర్యాలు కల్పించడానికి డిమాండ్ కు అనుగుణంగా కొత్త రూట్ లలో బస్సులు నడిపించేలా స్థానిక డీఎం ఇతర ఆర్టీసీ అధికారులతో ఆయా ప్రాంతాల్లో పర్యటించి ఒక నివేదిక ను రూపొందించి బస్సులు నడిపేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సంవత్సరంలో ఇప్పటి వరకు 578 బస్సులు కొత్తగా రాష్ట్రంలో రోడ్డెక్కాయి. త్వరలో మరిన్ని కొత్త బస్సులు రానుండడంతో వాటిని ప్రయాణికుల ట్రాఫిక్ ఎక్కువగా ప్రాంతాల్లో నడిపించాలని సూచించారు. ఇప్పటికే ఆర్టీసీ లో 1000 ఆర్టీసీ డ్రైవర్లు ,743 శ్రామిక్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు ఆధ్వర్యంలో జరుగుతున్న ఇంటర్వ్యూ దశలో ఉండడంతో నియామకాలు వేగంగా పారదర్శకంగా జరిగేలా పూర్తి చేయాలని తెలిపారు. వచ్చే డిసెంబర్ చివరిలోపు 84 ట్రాఫిక్ సూపర్వైజర్ ట్రైనీ ,114 సూపర్ వైజర్ ట్రైనీ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల కానుంది. ఈ నియామక ప్రక్రియ టీజీపీఎస్సీ లేదా పోలీస్ బోర్డు ద్వారా నియమించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కారుణ్య నియామకాల కింద చేరిన ఆర్టీసీ కండక్టర్లకు ఉన్న మూడు సంవత్సరాల ప్రొవిజన్ రెండు సంవత్సరాలకు తగ్గించేలా పరిశీలించాలని అధికారులకు సూచించారు. మేడారం జాతర సమీపిస్తుండటంతో ములుగు బస్ స్టేషన్ నిర్మాణం వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. డిసెంబర్ లోపు స్లాబ్ పనులు పూర్తి చేయాలని జాతర సమీపిస్తుండటంతో భక్తులకు ఇబ్బందులు లేకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ములుగు జిల్లా ఏటూరు నాగారం , పెద్దపల్లి జిల్లా బస్సు డిపో పనుల పురోగతి పై అడిగి తెలుసుకున్నారు. హుస్నాబాద్ లో వచ్చే లోపు మంథని బస్ స్టేషన్ ఆధునీకరణ పూర్తి కావాలని ఆదేశించారు. మధిర బస్ స్టేషన్ నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలని తెలిపారు. హుజూర్ నగర్ ,కోదాడ బస్ స్టేషన్ ల శంకుస్థాపన వారం రోజుల్లో పూర్తి చేస్తామని తెలిపారు. మిర్యాలగూడ బస్ గ్రేడేషన్ పనులు ప్రారంభించాలని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ఫోర్త్ సిటీ లో బస్ టెర్మినల్ నిర్మాణం , బస్ సౌకర్యాలపై ఆర్టీసీ ఉన్నతాధికారులు అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. నగరంలో పెరుగుతున్న జనాభా కి అనుగుణంగా కొత్త డిపో లకు అవసరమైన స్థల పరిశీలన చేసి జిల్లా కలెక్టర్ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వానికి అందించాలని తెలిపారు. నగరంలో నలువైపుల బస్ స్టేషన్ లు ఉండేలా జెబిఎస్ మాదిరి ఆరాంఘర్ లో అధునాతన బస్సు టెర్మినల్ నిర్మించడానికి ఆర్టీసీ , పోలీస్ శాఖ కి సంబంధించిన భూ బదలాయింపు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ఉప్పల్ లో కూడా నిర్మించడానికి అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. రవాణా శాఖ సీజ్ చేసిన వాహనాలు బస్సు డిపో లో చాలా కాలంగా పేరుకుపోవడంతో వారికి సమయం ఇచ్చి యాక్షన్ వేయాలని సూచించారు. ఆర్టీసీ లో ప్రమాదాలను తగ్గించడానికి తొలి దశలో లహరి, రాజధాని , గరుడ బస్సుల్లో అమలవుతున్న డ్రైవర్ మానిటరింగ్ సిస్టం ను పని తీరును అడిగి తెలుసుకున్నారు. దీని ద్వారా డ్రైవర్ నిద్ర ఉపక్రమించే సూచనలు కానీ , మొబైల్ వాడుతున్నప్పుడు మానిటరింగ్ చేస్తూ అప్రమత్తం చేస్తుంది. ఇక ఆర్టీసీ హైర్ బస్సు డ్రైవర్ లకు నిరంతరం శిక్షణ ప్రతి బస్సు కి ఇద్దరు డ్రైవర్లు తప్పనిసరి నిర్ణయాన్ని కఠినతరం చేయాలని పేర్కొన్నారు. డ్రైవర్లకు నిరంతరం మెడికల్ టెస్ట్ నిర్వహించాలని సూచించారు. ప్రమాదాలు తగ్గించడానికి డ్రైవర్లకు నిరంతర శిక్షణ అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా త్వరలోనే ఆర్టీసీ ఉద్యోగులతో జూమ్ సమావేశం నిర్వహిస్తానని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.ఇది విజయవంతం అయితే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని బస్సుల్లో అమలు చేసేలా కార్యాచరణ తీసుకోవాలని ఆదేశించారు. తార్నాక హాస్పిటల్ లో రోగుల బంధువుల కోసం ఏర్పాటు చేస్తున్న డార్మిటరీ రూం ను త్వరతగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆర్టీసీ ఫంక్షన్ హాల్ లు వస్తున్న ఆదాయం ఖర్చుల వివరాలపై ఆరా తీశారు. దీని ద్వారా మరింత ఆదాయం పెంచుకోవాలని సూచించారు. ఆర్టీసీ మహిళా సంఘాలు ద్వారా 600 బస్సులు అద్దె ప్రాతిపదికన నడిపించాలని సెర్ప్ తో ఒప్పందం చేసుకుంది. ఇప్పటి వరకు 150 బస్సులు మహిళా సంఘాలు ఆర్టీసీ తో సంయుక్తంగా నడుస్తున్నాయి. మిగిలిన 450 బస్సులు కూడా మహిళా సంఘాల ద్వారా తీసుకోవాలని ఆదేశించారు. గత ఏడాది మేడారం జాతర కోసం 3490 బస్సులు నడపగా 16.83 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీ లో ప్రయాణించారు. ఈసారి జాతర కు 20 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీ లో ప్రయాణిస్తారని అంచనా వేస్తూ 3800 బస్సులు నడపడానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నారు. సమీక్షా సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రెటరీ వికాస్ రాజ్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి ఇతర ఆర్టీసీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పెట్టుబడులకు గమ్యస్థానంగా హైదరాబాద్

ఖర్చు, సులభమైన వీసా విధానాలతో దక్షిణాది దేశాల విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రపంచ స్థాయి విద్యా సంస్థలను ఆహ్వానించారు. భారతదేశంలో రోడ్లకు ఎక్కువగా నేతల పేర్లు ఉంటాయని హైదరాబాదులో ఆ ట్రెండ్ ను మార్చాలని తాము అనుకుంటున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ముఖ్యమైన రోడ్లకు గూగుల్, మెటా, టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి కంపెనీ పేర్లను పెడతామని సీఎం అన్నారు. హైదరాబాద్‌లో రోడ్లకు నేతల పేర్లు పెట్టే ట్రెండ్ మార్చి.. ప్రముఖ కంపెనీల పేర్లు పెట్టాలని భావిస్తున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్, ఆక్స్‌ఫర్డ్ వంటి విశ్వవిద్యాలయాలు తెలంగాణలో క్యాంపస్‌లు ఏర్పాటు చేయాలని సీఎం ఆహ్వానించారు. అత్యున్నత జీవన ప్రమాణాలతో కూడిన అంతర్జాతీయ స్థాయి నగరంగా హైదరాబాద్‌ను నిలపడమే తన మొదటి ప్రాధాన్యత అని వివరించారు. భారత్ ఫ్యూచర్ సిటీ దేశంలోనే నూతన నగరంగా మారనుందన్నారు. మూసీ నదీ పునరుజ్జీవనం పూర్తయితే హైదరాబాద్ నైట్ ఎకానమీ కొత్త దశలోకి ప్రవేశిస్తుందని పేర్కొన్నారు. మహిళా సాధికారత, నాణ్యమైన విద్య, యువతకు నైపుణ్య శిక్షణ, పట్టణాభివృద్ధితో పాటు మెరుగైన వసతులు, అత్యున్నత జీవన ప్రమాణాలతో కూడిన అంతర్జాతీయ స్థాయి నగరంగా హైదరాబాద్‌ను నిలపడమే తన ప్రథమ ప్రాధాన్యత అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. గత 23 నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సీఎం వివరించారు. అద్భుతమైన మౌలిక వసతులతో 30 వేల ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో భారత్ ఫ్యూచర్ సిటీ దేశంలోనే నూతన నగరంగా మారుతుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. సదస్సు ప్రారంభంలో తెలంగాణరైజింగ్ 2047 విజన్ ను ప్రదర్శించారు. తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యం ఢిల్లీలో వార్షిక సమావేశంలో విశేష ఆదరణ పొందింది. గ్లోబల్ ఇన్వెస్టర్లకు పెట్టుబడుల అవకాశాలు వివరించిన సీఎం ప్రసంగం, అంతర్జాతీయ వ్యాపార వర్గాలను ఆకట్టుకుంది. రేవంత్ రెడ్డి విజన్ బోల్డ్, క్లియర్, అచీవబుల్ అని సిస్కో మాజీ సీఈఓ, టెక్ దిగ్గజం జాన్ ఛాంబర్స్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ విజన్ పారదర్శకంగా, సాహసోపేతంగా, సాధించగలిగేలా ఉంది. ఆయన చెప్పిన ప్రాజెక్టులు, వాటి సామాజిక ప్రభావం ఎంతో ప్రేరణాత్మకంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానం మేరకు మా సభ్యులలో అత్యధికులం డిసెంబర్ 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే గ్లోబల్ సమ్మిట్‌కు హాజరవుతాం అనిదా. ముఖేష్ అఘి అన్నారు. తెలంగాణ విజన్‌ను దగ్గరగా తెలుసుకోవాలని మేమంతా ఆసక్తిగా ఉన్నాం. . డిసెంబరు 8,9 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు కానున్నట్లు అమెరికా-భారత్ వ్యూహాత్మక ఫోరం అధ్యక్షుడు ముఖేష్ అఘి తెలిపారు.

## ఇళ్ల పథకంలో క్రెడిట్ చోరీ స్కీమ్

**అమరావతి ,నవంబర్13( వెలుతురు):**

ఏపీ సీఎం చంద్రబాబు కథ, స్క్రీన్, ప్లే, దర్శకత్వంలో విజయవంతంగా నడుస్తున్న 'క్రెడిట్ చోరీ స్కీం' చాలా బాగుందని వైఎస్ జగన్ విమర్శలు గుప్పించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా పోస్టు చేశారు. పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వడానికి ఈ 18 నెలల కాలంలో ఒక్క గజం స్థలం కూడా సేకరించలేదని, ఒక్క సెంటు స్థలం కూడా ఎవరికీ ఇవ్వలేదని మండిపడ్డారు. ఇళ్ల కోసం ఒక్కపైసా కూడా ఖర్చు చేయలేదని, ఒక్కరికి ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనే నిర్మాణంలో ఉన్న ఇళ్లను చూపిస్తూ 'ఇళ్లన్నీ మేమే కట్టేశాం' అంటూ పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్న 'క్రెడిట్ చోరీ స్కీం' హేయంగా ఉందని పేర్కొన్నారు. తాము ప్రారంభించామని చెప్తుకుంటున్న 3,00,092 ఇళ్లలో ఒక్క ఇంటిపట్టా కూడా చంద్రబాబు ప్రభుత్వం ఇవ్వలేదని, ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయించ లేదని తెలిపారు. ఆ 3,00,092 ఇళ్లలో 1,40,010 ఇళ్లు తమ హయాంలోనే పూర్తయ్యే దశలో ఉన్నవేనని జగన్ పేర్కొన్నారు. మరో 87,380 ఇళ్లు ఫ్లాట్ లెవల్ వరకూ గత ప్రభుత్వ హయాంలోనే కట్టించినవేనని తెలిపారు. ఇవికాక అక్టోబరు 12, 2023న ఒకేసారి 7,43,396 ఇళ్లలో ఒకేరోజు గృహప్రవేశాలతో గత ప్రభుత్వం చరిత్ర సృష్టించిందని, ఇన్ని వాస్తవాలు కళ్ళముందే ఉన్నా? అసలు వైయస్సార్‌సీపీ ప్రభుత్వం ఏమీ చేయనట్టుగా, అన్నీ ఈ ప్రభుత్వమే చేసినట్టుగా పచ్చి అబద్ధాలను ప్రచారం చేస్తున్న చంద్రబాబు క్రెడిట్ చోరీ స్కీం చాలా హేయమని జగన్ ఆగ్రహించారు.మా హయాంలో 71.8 వేల ఎకరాల్లో 31.19 లక్షల ఇళ్ల పట్టాలను అక్కచెల్లెమ్మలకు ఇచ్చి, వారి పేరుమీదే రిజిస్ట్రేషన్ చేయించాం. 21.75 లక్షల ఇళ్లను శాంక్షన్ చేయించాం?కోవిడ్‌లాంటి మహమ్మారి ద్వారా తలెత్తిన సంక్షోభాన్ని ఎదుర్కొంటూ 9 లక్షలకుపైగా ఇళ్లను మా హయాంలోనే పూర్తిచేసినా, అన్నీ మీరే చేశారన్నట్టుగా మీరు చెప్పడమే కాకుండా, మీ ఎల్లోమీడియా ద్వారా ప్రచారం చేయించుకుని, ఆ క్రెడిట్ కొట్టేయాలనుకుంటున్న మీ స్కీం చాలా హేయం అంటూ విమర్శలు గుప్పించారు.

## సిఐఐ సదస్సుకు విశాఖ ముస్తాబు

చంద్రబాబు నాయుడు ఇప్పటికే విశాఖకు చేరుకుని పలు కంపెనీల ప్రతినిధులతో చర్చలు జరుపుతున్నారు. సిఐఐ సదస్సుకు ముందే వివిధ కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలను కుదుర్చుకుంటోంది. ఈ ఒప్పందాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించారు. విశాఖపట్నం సిఐఐ పార్టనర్ షిప్ కన్నా ముందే సమ్మిట్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తైవాన్ కంపెనీలతో రెండు కీలక అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోనుందని సీఎం తెలిపారు. ఈ ఒప్పందాల ద్వారా రాష్ట్ర పారిశ్రామికవృద్ధి మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 400 కోట్ల రూపాయలతో కుప్పంలో 470 ఎకరాల్లో పరిశ్రమ ఏర్పాటు చేస్తుందని.. దీని వలన 50 వేలమందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు రానున్నాయని తెలిపారు. మిజోలి ఇండియా జెవి, మిజోలి యూఎస్ఏ, క్రియేటివ్ సెన్సోర్ (తైవాన్), సినెస్ట్ టెక్నాలజీలు 23 జీడబ్ల్యూహెచ్ క్రుకర్ (ఫ్ర సింగిల్ క్రిస్టల్ క్యాథోడ్ యాక్టివ్ మెటీరియల్స్, సాలిడ్ స్టేట్ ఎలక్ట్రోలైట్ మ్యానిఫ్యాక్చరింగ్ ఫెసిలిటిని ఓర్వకల్లు, కర్నూలులో రూ.18 వేల కోట్లతో ఏర్పాటు చేయనుంది. వీటివల్ల 2 వేల ప్రత్యక్ష ఉద్యోగాలు రానున్నాయన్నారు. ఈ అవగాహన ఒప్పందాలు స్వర్ణాంధ్ర విజన్ 2047 సాధించడంలో కీలక భూమిక పోషిస్తాయని... వికసిత్ భారత్ వైపు నడిపిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ట్వీట్ చేశారు. తైవాన్ కంపెనీలు పెట్టుబడులకు ఏపీ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని సీఎం చంద్రబాబు అన్నారు. పెట్టుబడులు, పరిశ్రమలకు అత్యంత అనుకూలంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతున్నట్టు తెలిపారు. పెట్టుబడుల సదస్సులో భాగంగా విశాఖకు వచ్చిన తైవాన్ బృందం సీఎంతో భేటీ అయింది. తైపీ ఎకనామిక్ అండ్ కల్చర్ సెంటర్ ప్రతినిధి, రాయబారి ముమిన్ చెన్ నేతృత్వంలోని బృందం చంద్రబాబును కలిసింది. వివిధ రంగాల్లో వచ్చే ప్రాజెక్టులకు అనుకూలంగా ఏపీలో పారిశ్రామిక కారిడార్లను తీర్చిదిద్దుతున్నామని తైవాన్ బృందానికి సీఎం తెలిపారు. నైపుణ్యం ఉన్న మానవ వనరులు, ప్రపంచస్థాయి ప్రమాణాలతో మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. తైవాన్ కంపెనీలు ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్లు, గ్రీన్ ఎనర్జీ, ఎలక్ట్రిక్ వాహనాల తయారీ, ఈవీ బ్యాటరీ తదితర రంగాల్లో ఏపీతో కలిసి పని చేయాలని సీఎం తైవాన్ కంపెనీలను ఆహ్వానించారు. ఇండో-తైవాన్ ఇండస్ట్రియల్ పార్కును కుప్పంలో ఏర్పాటు చేసేందుకు ఆసక్తిగా ఉన్నట్టు తైవాన్ ప్రతినిధి బృందం తెలిపింది. అలీఖయన్స్ గ్రూప్ రూ.400 కోట్ల వ్యయంతో ఈ పారిశ్రామిక పార్కు ఏర్పాటు చేసేందుకు సిద్ధమని సీఎంకు వెల్లడించింది.

## రెన్యూ పవర్ రూ. 82 వేల కోట్లు పెట్టుబడులు

మంత్రి లోకేష్ ప్రకటించినట్లు ఇంధన రంగంలో రీన్యూ పవర్ సంస్థ భారీ పెట్టుబడి పెట్టేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా విశాఖలో ఏపీ ప్రభుత్వంతో రీన్యూ పవర్ గురువారం ఒప్పందం చేసుకుంది. రూ. 82 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ సమక్షంలో రీన్యూ పవర్ సంస్థ ఎంఓయూలు కుదుర్చుకుంది. ఈడీబీతో రూ.60 వేల కోట్ల విలువైన నాలుగు ఎంఓయూలను రీన్యూ పవర్ సంస్థ ప్రతినిధులు కుదుర్చుకున్నారు. ఇవి కాకుండా గతంలోనే రూ. 22 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు రీన్యూ పవర్ ముందుకు వచ్చింది. పునరుత్పాదక శక్తి, సోలార్ తయారీ, బ్యాటరీ స్టోరేజ్, పంప్డ్ హైడ్రో, గ్రీన్ అమ్మోనియా రంగాల్లో రీన్యూ పవర్ సంస్థ పెట్టుబడులు పెడుతోంది. ఒప్పందంలో భాగంగా 6 జీడబ్ల్యూ పీవీ ఇంగోట్-వేఫర్ ఎ÷-లాంట్, 2 జీడబ్ల్యూ పంప్డ్ హైడ్రో ప్రాజెక్ట్, 300 కేటీపీఏ గ్రీన్ అమ్మోనియా సౌకర్యం, విండ్, సోలార్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ వంటి వాటిల్లో 5 జీడబ్ల్యూ హైబ్రిడ్ ప్రాజెక్టులను రీన్యూ పవర్ ఏర్పాటు చేయనుంది. తాజా ఎంఓయూల ద్వారా 10 వేలకు పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ, ఉపాధికి అవకాశం లభించనుంది. ఇప్పటికే దేశంలోనే అతిపెద్ద హైబ్రిడ్ పునరుత్పాదక శక్తి ప్రాజెక్టును అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేసేందుకు రీన్యూ పవర్ అంగీకారం తెలిపింది. గత ప్రభుత్వంలో రాష్ట్రం వీడి వెళ్లిన కంపెనీలు తిరిగి భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టడానికి సిద్ధంగా ఉన్నాయని మంత్రి లోకేష్ ట్వీట్ చేసిన విషయం తెలిసిందే. లోకేష్ ట్వీట్ చేసిన ప్రకటనపై విశాఖలో సిఐఐ సమ్మిట్‌కు ముందు రీన్యూ పవర్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదిరింది.

# జూబ్లీహిల్స్ కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

- కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో లెక్కింపు
- పోస్టల్ బ్యాలెట్‌తో ఓట్ల లెక్కింపు ప్రారంభం
- 42 టేబుళ్లు ఏర్పాటు చేసినట్లు ఆర్వో కర్ణన్ వెల్లడి



**హైదరాబాద్,నవంబర్13( వెలుతురు):**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని ఆర్వో కర్ణన్ తెలిపారు. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలోని డీఆర్సీ సెంటర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్‌తో ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. 407 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఓట్లు లెక్కిస్తాం. మొత్తం 58 మంది అభ్యర్థులు ఉన్నందున ప్రత్యేక అనుమతి తీసుకుని లెక్కింపునకు 42 టేబుళ్లు ఏర్పాటు చేశారు. 10 రౌండ్లలో కౌంటింగ్ పూర్తిచేస్తామని తెలిపారు.. కౌంటింగ్‌కు మొత్తం 186 మంది సిబ్బందిని కేటాయించాం. ఫలితాలను ఎప్పటికప్పుడు ఈసీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తామన్నారు. మీడియాకు ప్రత్యేకంగా ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి ఫలితాలను వెల్లడిస్తాంఅని చెప్పారు. ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద 250 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామని నగర జాయింట్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్ తెలిపారు. 15 ప్లాటూన్ల సిబ్బందిని రప్పిస్తున్నామన్నారు. 144 సెక్షన్ అమల్లో ఉంటుందని.. అనుమతి ఉన్నవారు మాత్రమే లెక్కింపు కేంద్రం వద్దకు రావాలని సూచించారు. శాంతిభద్రతలకు భంగం వాటిల్లితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇకపోతే ఓట్ల లెక్కింపు సందర్భంగా సాయంత్రం 6 వరకు మద్యం దుకాణాలు బంద్ కానున్నాయి.

# ప్రభుత్వ పాఠశాలల్లో ఫీజులు కడతా

- విద్యార్థుల టెన్త్ పరీక్ష ఫీజు చెల్లిస్తానన్న కిషన్ రెడ్డి



**హైదరాబాద్,నవంబర్13( వెలుతురు):**

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తన ఉదారతను చాటుకున్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులందరికీ ఎస్ఎస్‌సీ బోర్డు పరీక్ష ఫీజును తానే కడతానని ప్రకటించారు. ఈ మొత్తాన్ని ఎంపీగా తనకు వచ్చే వేతనం నుంచి భరించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ అందించిన అంత్యోదయ స్ఫూర్తితోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. పదో తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులకు ఈ సందర్భంగా ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ అంశంపై హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందనకు రాసిన లేఖను ఆయన 'ఎక్స్'లో షేర్ చేశారు. ఏ ఖాతాలో ఈ మొత్తాన్ని డిపాజిట్ చేయాలనే విషయాన్ని తనకు తెలియజేయాలని కలెక్టర్‌ను కోరారు. అలాగే, పాఠశాలల వారీగా పదో తరగతి విద్యార్థుల వివరాలు, ఎంత మొత్తాన్ని జమ చేయాలనే వివరాలను కూడా తెలియజేయాలన్నారు. ఇదిలావుంటే కరీంనగర్‌లో ఇంతకుముందే ఇదే విధానాన్ని మరో కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రకటించారు.

# తెలంగాణ టెట్ నోటిఫికేషన్ విడుదల




**హైదరాబాద్,నవంబర్13( వెలుతురు):**

తెలంగాణలో టెట్ నోటిఫికేషన్ విడుదలయింది. నవంబర్ 15వ తేదీ నుంచి అభ్యర్థుల నుంచి ఈ దరఖాస్తులు స్వీకరిస్తారు. ఈ దరఖాస్తులు స్వీకరణకు తుది గడువు నవంబర్ 29వ తేదీతో ముగియనుంది. జనవరి 3 నుంచి 31వ తేదీ వరకు టెట్ పరీక్షలు నిర్వహిస్తారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. కాగా.. 2025 ఏడాదికి సంబంధించి తొలి విడత టెట్ నోటిఫికేషన్ గత జూన్‌లో విడుదల చేశారు. ఇప్పటికే పరీక్షలు పూర్తి చేయగా.. జులై 22న ఫలితాలు సైతం వెల్లడించారు. తాజాగా రెండో విడత టెట్ నోటిఫికేషన్ గురువారం విడుదల చేశారు. ఇక ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు సైతం టెట్‌లో అర్హత సాధించాలంటూ ఇప్పటికే సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ నేపథ్యంలో తమ ఉద్యోగాల్లో కొనసాగాలంటే.. టీచర్లంతా ఈ టెట్ పాస్ కావాల్సి ఉంది. ఈ పరీక్షకు శుక్రవారం ( నోటిఫికేషన్ విడుదల చేస్తారు. శనివారం నుంచి నవంబర్ 29 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఏటా రెండుసార్లు టెట్ నిర్వహించాల్సి ఉండగా.. ఈ ఏడాది జూన్‌లో తొలి విడత పరీక్షలు నిర్వహించి.. జులై 22న ఫలితాలు వెల్లడించిన విషయం తెలిసిందే. రెండో విడత టెట్‌కు శనివారం నుంచి దరఖాస్తుల ప్రక్రియ మొదలుకానుంది.

# జూబ్లీహిల్స్ ఫలితంతో రాజకీయ పార్టీల భవిష్యత్

- హోరాహోరీగా పోరాడిన కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి
- గెలుపుపై ఎవరి అంచనాలు వారివే
- ఎగ్జిట్ పోల్ సర్వేతో కాంగ్రెస్‌లో ఉత్సాహం




**హైదరాబాద్,నవంబర్13( వెలుతురు):**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితం మరో 24 గంటల్లో తేలనుంది. అధికార, విపక్షాల మధ్య నువ్వా నేనా అన్నట్లు సాగిన సిట్టింగ్ స్థానాన్ని నిలుపుకోవాలని బీఆర్ఎస్, ఎలాగైనా జూబ్లీహిల్స్‌పై జెండా ఎగురవేయాలని కాంగ్రెస్ సర్వశక్తులూ ఒడ్డి పోరాడాయి. సుమారు నెలరోజుల పాటు పార్టీలు తమ నాయకత్వాన్ని నియోజకవర్గంలో మోహరించాయి. విమర్శలు, ప్రతివిమర్శలు, సవాళ్లు, ప్రతిసవాళ్లతో రాష్ట్ర వ్యాప్తంగా ఉత్కంఠ రేపిన జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో గెలిచేదెవరో శుక్రవారం తేలనుంది. ఎగ్జిట్ పోల్ సర్వేతో కాంగ్రెస్‌లో ఉత్సాహం నెలకొంది. పార్టీ అభ్యర్థి గెలుపు ఖాయమని ధీమాలో అధికార కాంగ్రెస్ ఉంది. అధికార, విపక్షాల మధ్య నువ్వా నేనా అన్నట్లు సాగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితం రాజకీయ పార్టీల భవిష్యత్ తేల్చనుంది. సిట్టింగ్ స్థానాన్ని నిలుపుకోవాలని బీఆర్ఎస్ , ఎలాగైనా జూబ్లీహిల్స్‌పై జెండా ఎగురవేయాలని కాంగ్రెస్ సర్వశక్తులూ ఒడ్డి పోరాడాయి. బిజెపి కూడా గెలిచి తీరాలన్న పట్టుదలతో పోరాడింది. సుమారు నెలరోజుల పాటు పార్టీలు తమ నాయకత్వాన్ని నియోజకవర్గంలో మోహరించాయి. సాధారణంగా ఎక్కడైనా ఉప ఎన్నికలో భారీగా పోలింగ్ శాతం నమోదు అవుతుంటుంది. కానీ జూబ్లీహిల్స్‌లో మాత్రం ఒక్క శాతమే ఓటింగ్ పెరగడంతో.. గెలుపు ఎవరిని వరిస్తుందా అనేది తెలియని పరిస్థితి. తామే గెలుస్తామంటూ కాంగ్రెస్ పార్టీ, కాదు కాదు తామే గెలుస్తామంటూ బీఆర్ఎస్ పార్టీ ధీమా వ్యక్తం చేస్తున్నాయి. సర్వేలు అన్నీ తమ వైపే ఉన్నాయని కాంగ్రెస్ నేతలు చెబుతుండగా.. సైలెంట్ ఓటింగ్ జరిగిందని.. తద్వారా తమ విజయం ఖాయమని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. మొత్తంగా శుక్రవారం మధ్యాహ్నం తుది ఫలితం వెల్లడయ్యే వరకు ఉత్కంఠ తప్పని పరిస్థితి. ఇప్పటికే అధికారులు ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తిచేశారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో లెక్కింపు ప్రారంభం కానుంది. పది రౌండ్లలో లెక్కింపు పూర్తి చేయాలని నిర్ణయించారు. ఉప ఎన్నికలో లక్షా 94 వేల 632 ఓట్లు పోలయ్యాయి. వీటిని పది రౌండ్లుగా 42 టేబుళ్లపై లెక్కింపు జరుపనున్నారు. తొలుత పోస్టల్ బ్యాలెట్, ఆ తర్వాత 103 హోం ఓటింగ్‌లను లెక్కించిన తర్వాత ఈవీఎంల్లోని ఓట్ల లెక్కింపు మొదలవుతుంది. సాధారణంగా 14 టేబుళ్లపై కౌంటింగ్ జరుగుతుంది. ఉప ఎన్నిక కావడం, ఉద్యోగులు అందుబాటులో ఉండడంతో ఎక్కువ టేబుళ్లు ఏర్పాటు చేసి త్వరగా లెక్కింపు పూర్తి చేయాలని నిర్ణయించారు. ఉదయం 8.45 గంటలకల్లా తొలి రౌండ్ ఫలితం వెల్లడి కానుంది. మధ్యాహ్నం ఒంటి గంటలోపే తుది ఫలితాన్ని ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తున్నది. ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని మొత్తం 10 రౌండ్లుగా కొనసాగించ నున్నారు. ఒక్కో రౌండ్ వారీగా ఫలితాలను వెల్లడించనున్నారు. ఎన్నికల బరిలో 58 అభ్యర్థులతో పాటు నోటాకు పోలైన ఓట్ల సంఖ్యను అధికారులు వెల్లడించనున్నారు. కాగా కౌంటింగ్ కేంద్రంలో పటిష్టమైన మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. దీనికితోడు సీసీ కెమెరాలతో పర్యవేక్షణ, సాయుధ బలగాలతో 24గంటల పహారా ఉండనుంది. స్టేడియానికి 100 మీటర్ల మేరలో ఆంక్షలు అమల్లో ఉంటాయని అధికారులు తెలిపారు. ఎన్నిక ఏదైనా మా వైఖరిలో తేడా ఏమీ ఉండదని జూబ్లీహిల్స్ ఓటర్ మరోసారి నిరూపించారు. ప్రతిసారీ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పోలింగ్ 50 శాతానికి మించడం లేదు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 47.49 శాతం పోలింగ్ నమోదు కాగా.. తాజాగా ఉప ఎన్నికలో 48.49 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. ఇక్కడ కేవలం ఒక్కశాతం మాత్రమే పోలింగ్ శాతం పెరగడం గమనార్హం. ఉప ఎన్నిక సమయానికి నియోజకవర్గంలో మొత్తం 4.01 లక్షల ఓటర్లు ఉండగా.. లక్షా 94వేల 631 మంది మాత్రమే ఓటుహక్కును వినియోగించుకున్నారు. కేవలం 48.49 శాతం పోలింగ్ మాత్రమే నమోదు అయినట్లు జిల్లా ఎన్నికల అధికారులు బుధవారం అధికారికంగా ప్రకటించారు. 99,771 మంది పురుషులు ఓటు వేశారు. బస్తీల్లో ఉండే ఓటర్లు ఓటేసేందుకు ఆసక్తి చూపగా, అపార్ట్‌మెంట్లలో ఉన్న ఓటర్లు చాలావరకు ఓట్లు వేయనట్లు తెలుస్తోంది. మరోవైపు కొత్తగా ఓటుహక్కు వచ్చిన యువత ఓటు వేసేందుకు ఉత్సాహం కనబర్చారు. అయితే పోలింగ్ శాతం తగ్గడానికి కారణాలు లేకపోలేదని విశ్లేషకుల అంచనా.. ప్రైవేట్ ఉద్యోగులకు సెలవులు లేకపోవడం, ఓటింగ్ శాతం పెంచడంలో అధికారుల ప్రచార లోపం, పోలింగ్ బూత్‌ల వరకు ఓటర్లను రప్పించడంలో రాజకీయ పార్టీలు విఫలం అయ్యాయనే ఆరోపణలున్నాయి.

# దేశవ్యాప్తంగా ఉల్లి రైతులకు కన్నీరు

- కొనుగోలు ధరలు పెరిగినా గిట్టుబాటు మృగ్యం
- మార్కెటింగ్ సౌకర్యం లేక ఆందోళన



**న్యూఢిల్లీ,నవంబర్13( వెలుతురు):**

దేశవ్యాప్తంగా ఉల్లి పంట పండించిన అన్నదాతలు బోరున విలపిస్తున్నారు. గిట్టుబాటు ధరలు లేక రైతులు, కొనడానికి అధికధరలు వెచ్చించి ప్రజలు కన్నీరు పెట్టుకుంటున్నారు. ఎపిలో కర్నూలు రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం హడావిడి చేసినా రైతులకు ఒరిగిందేమీ లేదు. చాలా చోట్ల రైతులు ఉల్లి పంటను మార్కెట్‌కు తీసుకెళ్లితే రవాణా ఖర్చులు కూడా రావడం లేదని, పొలాల్లోనే వాటిని వదిలేస్తున్నారు. కొన్ని మాసాల నుంచే అక్కడి రైతులు మద్దతు ధర కోసం వివిధ రూపాల్లో పోరాడుతూనేవుంది. హైదరాబాద్ లాంటి పట్టణాల్లో కిలో ఉల్లి మాత్రం 30కి పైనే అమ్ముతున్నారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో ఇప్పటికే పాత ఉల్లి పంట నిల్వలు ఉండగా..ఇప్పుడు కొత్త పంట కూడా మార్కెట్‌లోకి రావడం, నేపాల్, బంగ్లాదేశ్, పాకిస్థాన్ దేశాలకు ఎగుమతులు నిలిపివేయడం వంటి కారణాల మూలాన ధరలు అమాంతం పడిపోయాయి. మంగళవారం కిలో రూ.2కు పడిపోయిన ధరలు బుధవారం రూ.1 కంటే దిగువకు పడిపోయాయి. కనీసం రవాణా ఛార్జీలు కూడా దక్కకపోవడంతో రైతు మార్కెట్‌లోనే కంటతడి పెడుతున్నారు. ఉల్లి ప్రధాన మార్కెట్లలో ఒక్కటైన మధ్యప్రదేశ్‌లోని మాల్వా ప్రాంతంలో మంగళవారం కిలో ఉల్లి ధర రూ.2గా ఉంది. బుధవారం మరో ప్రధానమార్కెట్ అయిన మంద్‌సౌర్‌లో కిలో ఉల్లి ధర రూ.1కి, అంతకంటే దిగువకు పడిపోయింది. దీంతో రైతులు భారీగా నష్టపోతున్నారు. మాల్వాలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఇక రాజస్థాన్‌లోని అల్వార్‌లోనూ ఉల్లి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. అక్కడ కూడా కిలో ఉల్లి రూ.1 నుంచి రూ.5 మధ్యనే పలుకుతోంది. నాణ్యత మరీ అధికంగా ఉంటే కిలో రూ.8 చొప్పున కొంటున్నారు. ఇక ఆసియాలోనే అతిపెద్ద ఉల్లి పాయల మార్కెట్‌గా పేరొందిన మహారాష్ట్రలోని నాసిక్ ప్రాంతంలోనూ ఉల్లి రైతు గోడు అంతాఇంత కాదు. ÷రిత్త, పాత ఉల్లిపాయల నిల్వలు ఒకేసారి మార్కెట్‌లోకి వచ్చిన నేపథ్యంలోనే ఉల్లి పాయల ధరలు పడిపోయినట్లు ప్రకటించి రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలోని బిజెపి నేతృత్వ డబుల్ ఇంజిన్ సర్కార్లు చేతులు దులిపేసుకుంటున్నాయి. అన్నదాతలకు కనీస మద్దతు కూడా ఇవ్వకుండా పరిహాసమాడు తున్నాయి. ప్రభుత్వం తక్షణమే ఉల్లి పంటకు మద్దతు ధర కల్పించి..ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతు సంఘాల ఐక్య వేదిక డిమాండ్ చేసినా..డబుల్ ఇంజిన్ సర్కార్ నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోంది. దాదాపు ఆరు నెలలుగా తమ ఉత్పత్తులను నిల్వ చేసినప్పటికీ.. సరైన ధర లభించడం లేదని, ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని అన్నదాతలు వాపోతున్నారు. వెల్లుల్లి ధరలు కూడా భారీ స్థాయిలో పడిపోవడంతో అక్కడి రైతన్నలు ఆక్రందనకు గురౌతున్నారు. వాతావరణ పరిస్థితులు, నిల్వ చేయడానికి అవసరమైన గోడాన్లు లేకపోవడం, ప్రభుత్వ నిర్లక్ష్యం వెరసి ఉల్లి పంట సాగు చేసే రైతన్నలను సంక్షోభంలోకి నెట్టేశాయని మహారాష్ట్ర స్టేట్ ఆనియన్ ప్రొడ్యూసర్స్ ఫార్మర్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు భరత్ డిఘోలే అన్నారు. సంక్షోభ నివారణకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని, కనీస మద్దతు ధరతో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రత్లాం వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాల్ ఉల్లి ధర కేవలం రూ.600గా ఉంది. పొలం నుంచి మార్కెట్‌కు ఉల్లిని తరలించడానికి రవాణాకు అయిన ఖర్చు కూడా రావడం లేదని నగ్రా గ్రామానికి చెందిన ఓ అన్నదాత వాపోయాడు. '30 క్వింటాళ్ల ఉల్లిపాయలను మార్కెట్‌కు తరలించేందుకు రూ.2 వేలు అయ్యింది. మార్కెట్‌లో అమ్మగా క్వింటాల్‌కు రూ.250లే వచ్చాయి. తీవ్రంగా నష్టపోయాం' అని దుంఖం నిండిన కళ్లతో ఆ రైతు అన్నారు.

# జూబ్లీహిల్స్‌లో ధర్మమే గెలుస్తుంది

- రియల్ ఎస్టేట్‌ను సర్వనాశనం చేశారు
- రూ.3.48వేల కోట్ల అప్పులతో ఆర్థిక అత్యాచారం
- సిఎం రేవంత్‌పై ఎమ్మెల్సీ దాసోజు విమర్శలు





**హైదరాబాద్,నవంబర్13( వెలుతురు):**

ఎన్ని అక్రమాలు చేసినా జూబ్లీహిల్స్‌లో ధర్మమే గెలుస్తుందని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ అన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కీలక వ్యాఖ్యలు చేశారు. బైపోల్స్‌లో ఎంఐఎం కూడా అక్రమాలకు పాల్పడి కాంగ్రెస్‌కు సహకరించిందని ఆరోపించారు. పోలీసులు బోగస్ ఓటింగ్‌కు సహకరించటం ప్రత్యక్షంగా చూశామన్నారు. కాగ్ రిపోర్ట్ సీఎం రేవంత్ రెడ్డి బట్టలు విప్పేసిందన్నారు. అప్పులు భారీగా తెచ్చిన రేవంత్.. ఆర్థిక అత్యాచారానికి పాల్పడ్డారంటూ వ్యాఖ్యలు చేశారు. అనుభవం లేని ముఖ్యమంత్రి ఉంటే.. ఇంతకంటే ఏం జరుగుతుందన్నారు. రేవంత్ రెడ్డి.. రియల్ ఎస్టేట్‌ను సర్వనాశనం చేశారని మండిపడ్డారు. హైడ్రా పేరుతో ఆర్ఆర్ టాక్స్‌తో దోపిడీ జరుగుతుందని ఆరోపణలు గుప్పించారు. రెండేళ్ళల్లో రూ.3.48వేల కోట్ల అప్పులు తెచ్చారన్నారు. పార్టీ ఫిరాయింపుల విచారణ సందర్భంగా సందర్శకులు, మీడియాపై నిషేధం సరికాదని అన్నారు. ఇది అసెంబ్లీ స్పీకర్, ముఖ్యమంత్రి రేవంత్ సొంత వ్యవహారం కాదని చెప్పుకొచ్చారు. దొంగలు దొంగలు ఊర్లు పంచుకున్నట్లు ఉంది వ్యవహారం అంటూ కామెంట్స్ చేశారు. మాజీ ఎమ్మెల్యేలు , మాజీ ఎంపీలు మాజీ ఎమ్మెల్సీలకు ప్రవేశాన్ని నిషేధించడం ఏంటని ప్రశ్నించారు. కేసు వాదిస్తున్న అడ్వకేట్లను సెల్ ఫోన్‌లు తీసుకురావద్దని హుకుం జారీ చేయటం సరికాదన్నారు. స్పీకర్ కార్యాలయం విడుదల చేసిన బులెటిన్ రాజ్యాంగ విరుద్ధమన్నారు. సుప్రీంకోర్టులో ఫుల్ బెంచ్ వాదనలు జరిగినప్పుడు కూడా సెల్ ఫోన్లు అనుమతిస్తారని తెలిపారు. తక్షణమే బులెటిన్ ఎత్తి వేయాలని స్పీకర్‌కు లేఖ రాసినట్లు చెప్పారు. ఫిరాయింపు విచారణను లైవ్ స్ట్రీమింగ్ ద్వారా ప్రజలు ప్రత్యక్ష్యంగా వీక్షించే అవకాశమివ్వాలని డిమాండ్ చేశారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల వాదనల గురించి ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరముందని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ వ్యాఖ్యలు చేశారు.

# సంపాదకీయం.. ఓటు బ్యాంక్ రాజకీయాలతో ప్రమాదం !

భారతదేశ విచ్ఛిన్నమే ఉగ్రవాదుల లక్ష్యంగా ఉంది. దేశాన్ని మతపరంగా మరోమారు విభజించే కుట్రలు సాగుతున్నాయి. ఈ ప్రమాదం పసిగట్టి మన పాలన సాగాలి. ఒకవైపు పాక్ ఉగ్రదాడులను ఎగదోస్తుండగా, ఇప్పుడు బంగ్లాదేశ్ కూడా ఇందుకు తోడయ్యింది. అక్రమ వలసలను నిరోధించే చర్యలను అడ్డకుకుంటున్న వారు దేశద్రోహ కుట్రలను గుర్తించడం లేదు. ఓటుబ్యాంక్ రాజకీయాల కోసం ఓట్ల సమీక్షను కూడా తప్పు పడుతున్నారు. ఓట్ల రాజకీయంలో దేశం ఎలా దెబ్బతింటున్నదో వీరికి అర్థం కావడం లేదు. సరిహద్దుల నుంచి అక్రమంగా వస్తున్న చొరబాటుదారులకు ఆధార్ కార్డులు వచ్చేస్తున్నాయి. ఓటర్లుగా నమోదు అవుతున్నారు. తరవాత రేషన్ కార్డులు కూడా వచ్చేస్తున్నాయి. ఇప్పుడు ఇలా లక్షల్లో మనదేశంలో తిష్టవేశారు. వీరందరిని గుర్తించి ఏరిపారేయాలి. వీరితో దేశంలో అస్థిరత ఏర్పడుతోంది. దీనిని సరిహద్దు రాష్ట్రాల పాలకులు అసలు సమస్యగా గుర్తించడం లేదు. దీనిని అడ్డుకోవాలని చూస్తే హిందుత్వవాదులుగా ముద్రవేసి విమర్శలు చేస్తున్నారు. దేశంలో రాజకీయ పార్టీలు అధికారమే లక్ష్యంగా రాజకీయ చదరంగం ఆడుతున్నాయి. ఎర్రకోట ఘటన నిఘా వైఫల్యమని, పార్లమెంటులో చర్చించాలని చెబుతున్న వారు గతంలో జరిగిన వాటికి సమాధానం చెప్పాలి. జాతి ఐక్యంగా ఉండాల్సిన సమయంలో రాజకీయ నేతల నీచ రాజకీయాలను ప్రతి ఒక్కరూ ఎండగట్టాల్సిందే. ఇకపోతే రాజధాని ఢిల్లీలోని చారిత్రాత్మక ఎర్రకోట సమీపంలో బాంబుపేలుడు ఘటనలో13 మంది ప్రాణాలు కోల్పోవడం, అనేక మంది క్షతగాత్రులు కావడం అత్యంత విషాదకరం. ఈ ఘటనపై ఇప్పుడు అనేక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. కేవలం భారతదేశాన్ని లక్ష్యంగా చేసుకుని ఉగ్రమూకలు ఇక్కడ మారణకాండకు తెగిస్తున్నాయన్నది సుస్పష్టం. వైద్యులుగా ప్రాణాలు పోయాల్సిన వారు దగుల్బాజీలుగా మారారు. అలాగే మహిళా వైద్యురాలు సహితం ఇందులో భాగస్వామ్యం అయ్యిందంటే వారు ఎంతటి దుర్మార్గులో అర్థం చేసుకోవాలి. ఇకపోతే ఆహార పదార్థాల్లో విషం కలిపి చంపాలని కూడా ప్రయత్నం చేసిన తీరు బయటపడింది. ఈ క్రమంలో దర్యాప్తు సంస్థలు కూపీ లాగుతున్నాకొద్దీ అనేక విషయాలు బయటకు వస్తున్నాయి. ఇస్లామిక్ టెర్రరిస్టులు మరాణ కాండకు తెగబడితే సహించాలన్న ధోరణిలో ఉన్నారు. ఈ దేశాన్ని ఇప్పటికే ముక్కలు చేశారు. భారత్ నుంచి విడివడ్డ పాక్, బంగ్లాదేశ్‌లో భారత వ్యతిరేక కార్యకలాపాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇలాంటి వారిని మంచిచేసుకోవడం అన్నది అసాధ్యం. మతం ముసుగులో మారణహోమం చేయాలనుకున్న వారిని మార్చలేం. అలాంటి వారిని ఏరిపారుయడమే విధానం కావాలి. ఇక ఢిల్లీ పేలుళ్ల కుట్రలను శోధించిన కొద్దీ అనేక విషయాలు బయటకు వస్తున్నాయి. ఉగ్రవాదులకు శిక్షణ ఇచ్చి, ఆత్మాహుతి బాంబర్లుగా తయారు చేసి, రక్తపాతం సృష్టించడమే వారి మతవిధానంగా, ఆచారంగా భావిస్తున్నారు. ఫరీదాబాద్ ఉగ్రపథకంలో కుట్రదారులకు విదేశీ సంబంధాలపై అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా తాజాగా కీలక విషయం వెలుగులోకి వచ్చింది. తుర్కియేలోని 'ఉకాసా' అనే హ్యాండ్లర్‌తో ఈ మాడ్యూల్ టచ్‌లో ఉన్నట్లు నిఘా వర్గాలు కనుగొన్నాయి. ఈ మేరకు మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఉకాసా అంటే అరబిక్‌లో స్పైడర్. ఫరీదాబాద్ మాడ్యుల్, ఉగ్రసంస్థ జైషే మహ్మద్‌తో పాటు అన్సర్ ఘజ్‌వత్-ఉల్ హింద్ అనే సంస్థల నిర్వాహకులకు ఈ ఉకాసాతో ప్రత్యక్ష సంబంధాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఆన్‌లైన్ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్‌లో డాక్టర్ ఉమర్‌తో పాటు అతడి సహచరులు ఈ ఉకాసా హ్యాండ్లర్‌తో సంభాషించి నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. డాక్టర్ ఉమర్ తో సహా పలువురు 2022లో తుర్కియేలో పర్యటించినట్లు అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో అంకారాలో వారు రెండు వారాలు ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఈ హ్యాండ్లర్ కూడా అంకారాలో ఉన్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. అక్కడి నుంచే ఈ గ్రూప్‌ను నడపడంతో పాటు వారికి నిధులు కూడా సమకూర్చినట్లు భావిస్తున్నారు. మాడ్యూల్ భారత్‌లో బహుళ పేలుళ్లకు రూపొందించిన ప్రణాళిక వెనుక ఈ ఉకాసా కీలక పాత్ర పోషించినట్లు గుర్తించారు. హ్యాండ్లర్లతో చర్చించేటప్పుడు నిఘా వర్గాలకు దొరకకుండా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ మాడ్యూల్ వెనుక ఓ విదేశీ గ్రూప్ పనిచేస్తుందని స్పష్టంగా తెలుస్తోందని ఓ సీనియర్ అధికారి తెలిపారు. ఈ నెట్‌వర్క్ కార్యకలాపాల గురించి పూర్తిగా తెలుసుకునేందుకు నిందితులు చేసిన చాట్, కాల్ హిస్టరీలను అధికారులు పరిశీలిస్తున్నారు. ఉకాసా ను గుర్తించడంతో పాటు అతడికి పాక్ ఉగ్రవాద నిర్వాహకులతో ఉన్న సంబంధాల గురించి తెలుసు కునేందుకు విదేశీ నిఘా సంస్థల సహకారం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దేశవ్యాప్తంగా నాలుగు కీలక ప్రాంతాల్లో ఒకేసారి దాడులు జరపాలని నిందితులు ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ఇందుకోసం ఐ20, ఎకోస్పోర్ట్‌తో పాటు మరో రెండు పాత కార్లను కూడా సిద్ధం చేయాలని వారు ప్లాన్ చేసినట్లు సమాచారం. ఇందులో ఐ20 కారులోనే ఎర్రకోట వద్ద పేలుడు జరగ్గా.. ఎకోస్పోర్ట్ కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మిగతా రెండు కార్ల కోసం అన్వేషణ కొనసాగుతోంది. ఇకపోతే ఈ ప్లాన్‌ను అమలుచేసేందుకు 8 మందిని సిద్ధం చేసినట్లు ఆ డైరీల సమాచారంతో అధికారులు గుర్తించారు. ఒక్కో ప్రాంతానికి ఇద్దరు చొప్పున వెళ్లి పేలుళ్ల జరపాలని వీరు పన్నాగం పన్నినట్లు దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి. ఈ ఎనిమిది మందిలో ఉమర్, ముజమ్మిల్‌తో పాటు డాక్టర్ అదిల్, డాక్టర్ షాహీన్ కూడా ఉన్నట్లు తెలిపాయి. ఢిల్లీ పేలుడు ఘటన పై దర్యాప్తు చేపట్టిన అధికారులు హరియాణాలోని ఫరీదాబాద్‌లో గల అల్-ఫలా యూనివర్సిటీని జల్లెడ పడుతున్నారు. ఇక్కడి మెడికల్ కాలేజీలోని బాయ్స్ హాస్టల్ ఉండే 17వ నంబరు భవనం వీరి ఉగ్ర కార్యకలాపాలకు కేంద్రంగా ఉన్నట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. దీన్నిబట్టి చూస్తే వీరు దాడులకు పక్కా ప్రణాళిక రచించినట్లు దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. ఇజ్రాయిల్ తదితర ప్రాంతాల్లో కూడా ఇప్పటికే పెద్ద ఎత్తున మారణహోమం జరిగింది. ఇప్పుడు భారత్‌లో వారు ఆడిన ఆటలు సాగకపోవడం వల్లనే ఈ దాడులకు తెగిస్తున్నారు. కాశ్మీర్‌లో ప్రశాంత వాతావరణం రాకుండా చేశారు. ఇప్పుడు దేశంలో కూడా అలాగే చేయాలనుకుంటున్నారు. ఇలాంటి కుట్రదారులను ముందుగా రాజకీయాలకు అతీతంగా ఎదుర్కోవాలి.




## ఫరీదాబాద్ మాడ్యూల్‌లో మరో డాక్టర్

**- కష్టంగా మారిన మృతుల గుర్తింపు ప్రక్రియ**



**న్యూఢిల్లీ,నవంబర్13( వెలుతురు):** ఫరీదాబాద్ మాడ్యూల్‌కు సంబంధించి మరో డాక్టర్‌ను భద్రతాధికారులు అరెస్టు చేశారు. జమ్మూకశ్మీర్‌కు చెందిన కార్డియాలజిస్ట్ విద్యార్థి డాక్టర్ మహ్మద్ ఆరిఫ్‌ను కాన్పూరులో అదుపులోకి తీసుకున్నారు. ఇతడికి ఇటీవల అరెస్టయిన డాక్టర్ షాహిన్‌తో దగ్గర సంబంధాలు ఉన్నట్లు తెలుస్తోంది. వీరిద్దరూ నిత్యం టచ్‌లో ఉండినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. మరోవైపు ఎర్రకోట ఘటనలో మరణించిన వారి, చావుబతుకుల మధ్య ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారి కుటుంబ సభ్యులు పడుతున్న క్షోభ హృదయవిదారకం. మృతుల శరీర భాగాలను గుర్తులు లేదా ఆభరణాలను బట్టి గుర్తించాల్సిన దుస్థితి ఏర్పడటం ఎంతటి విషాదం! ఇంతటి అమానుష కాండను ప్రపంచమంతా ముక్తకంఠంతో ఖండించింది. ఈ మారణహోమానికి బాధ్యులను అత్యంత కఠినంగా శిక్షించాల్సిందే. గత పదేళ్లలో పుల్వామా, పహల్గాం తదితర భారీ ఉగ్రవాద దాడులు జమ్ముకాశ్మీర్‌లో జరిగాయి. పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడికి ప్రతిస్పందనగా కేంద్రం 'ఆపరేషన్ సిందూర్' చేపట్టింది. మతపరమైన విభజన రగిలించడానికే ఉగ్రఘాతుకం జరిగిందని 'పహల్గాం' ఘటన రుజువు చేసింది. దేశ చరిత్రలో ఎన్నడూ లేనంతగా 2,900 కిలోల భారీ పేలుడు పదార్థాలను మూడు రాష్ట్రాల పోలీసులు సంయుక్తంగా స్వాధీనం చేసుకుని, ముగ్గురు వైద్యులుసహా ఎనిమిదిమందిని అరెస్టు చేసిన తరువాత రోజే ఢిల్లీలో పేలుళ్లు చోటుచేసుకున్నాయి. దేశవ్యాప్తంగా ఇటువంటి నెట్‌వర్క్‌లు వేళ్లూనుకోవడం ఆందోళనకరం. పేలుడు పదార్థాలు, ఉగ్రవాద స్థావరాల లోగుట్టును ఛేదించడం ప్రభుత్వ కర్తవ్యం. అందుకు ఎంతటి మూల్యమైనా చెల్లించాల్సిందే. హస్తినలో విస్ఫోటానికి ఆత్మాహుతి బాంబర్ కారణమని, అదే కారులో మరొకరు ఉన్నారని ప్రాథమిక నివేదికలు చెబుతున్నాయి. దేశాన్ని విచ్ఛిన్నం చేసే ఎత్తుగడలు, హిందూ మతంపై విద్వేషాన్ని వ్యాపింపజేసే వాతావరణం గత పదేళ్లలో బాగా పెరిగింది. విద్వేషం పెంచే ధోరణులను అడ్డుకోవాలి. రెచ్చగొట్టే చర్యలకు లొంగిపోకుండా ఐక్యతేభారత్ బలమని చాటిచెప్పాలి.ఇస్లామిక్ ఉగ్రవాదం ప్రమాదకరము, వినాశకరమైనది. ఉగ్రవాదంపై పోరాడటం అత్యవసరం. ఉగ్రవాదుల హత్యాకాండకూ, వారి విద్వేషపూరిత భావజాలానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో ప్రజలు కలసి రావాలి. అలాగే ఇస్లామిక్ ఉగ్రవాదం పట్ల ప్రజలంతా అప్రమత్తంగా వుండాలి.

## బ్లాస్ట్‌కు ముందు మసీదుకు వెళ్లిన ఉమర్

**- సిసి టివి కెమెరాల్లో దృశ్యాలు నమోదు**

**న్యూఢిల్లీ,నవంబర్13( వెలుతురు):**




ఢిల్లీలోని ఎర్రకోట వద్ద భారీ పేలుడుకు సంబంధించి మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. బ్లాస్ట్‌కు ముందు డాక్టర్ ఉమర్ నబీ ఓల్డ్ ఢిల్లీలోని ఓ మసీదును సందర్శించారు. తుర్క్‌మాన్‌గేట్ ఎదురుగా ఉన్న రాంలీలా మైదాన్ సమీపంలోని మసీదునుంచి ఉమర్ బయటకు వస్తున్న దృష్యాలు అక్కడే ఉన్న నిఘా కెమెరాలో నిక్షిప్తమై ఉన్నాయి. సోమవారం మధ్యాహ్నం 2:30 గంటల సమయంలో అతడు మసీదును సందర్శించినట్లు తెలుస్తోంది. దాదాపు 10 నిమిషాలపాటూ అక్కడే ఉన్నాడు. ఆ తర్వాత ఎర్రకోటవైపు వెళ్లినట్లుగా సమాచారం. బాంబు పేలుడు సంభవించిన ఐ20 కారులో ఉన్నది డాక్టర్ ఉమర్ నబీ అని తేలింది. కారులో లభించిన నమూనాలతో అతని డీఎన్ఏ సరిపోలడంతో కారు నడిపింది నబీయేనని అధికారులు నిర్ధారణకు వచ్చారు. పేలుడుకు ముందు ఉమర్ కారు నడుపుతున్న సీసీటీవీ దృశ్యాలను అధికారులు గుర్తించారు. దీంతో ఘటన సమయంలో కారులో ఉన్న అతను కూడా ప్రాణాలు కోల్పోయాడని అధికారులు అనుమానించారు. ఈ నేపథ్యంలో పుల్వామాలో ఉన్న అతని తల్లి నుంచి డీఎన్ఏ నమూనాలు తీసుకొని పరీక్షించారు. కారు స్టీరింగ్, యాక్సిలరేటర్ మధ్య ఇరుక్కున్న కాలు నుంచి సేకరించి డీఎన్ఏను ఆమె డీఎన్ఏతో సరిపోల్చారు. దీంతో కారులో లభించిన డీఎన్ఏ ఉమర్ నబీదేనని తేలినట్లు ఢిల్లీ పోలీసులు వెల్లడించారు.

## ఉగ్రకుట్రకు కేరాఫ్ అల్ ఫలాహ్ వర్సిటీ

**- విధ్వంస రచనకు రూమ్ నంబర్ 17**

**- ఇక్కడి నుంచే ముష్కరుల పథకరచన**




**న్యూఢిల్లీ,నవంబర్13( వెలుతురు):** ఢిల్లీ బాంబు పేలుడుఘటన నేపథ్యంలో అల్ ఫలాహ్ వర్సిటీ పేరు తెరపైకి వచ్చింది. ఈ వర్సిటీలో పనిచేస్తున్న డాక్టర్లు, ప్రొఫెసర్లు ఉగ్ర కుట్రలో భాగం కావడంతో దర్యాప్తు సంస్థల దృష్టి ఈ వర్సిటీపై పడింది. దర్యాప్తు అధికారులు వర్సిటీకి చేరుకొని ముమ్మరంగా సోదాలు చేస్తున్నారు. ఈ దర్యాప్తులో కీలక ఆధారాలు బయటపడ్డట్లు తెలుస్తోంది.మెడికల్ కాలేజీలోని బాయ్స్ హాస్టల్ ఉండే 17వ నంబర్ భవనం వీరి ఉగ్ర కార్యకలాపాలకు అడ్డాగా ఉన్నట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఈ భవనంలోని 13వ నంబర్ గది కీలకంగా మారింది. ముజమ్మిల్‌కి చెందిన ఈ గది వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ కు రహస్య సమావేశ కేంద్రంగా పనిచేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఢిల్లీ, సమీప రాష్ట్రాల్లో పేలుళ్లకు ఈ గది నుంచే కుట్ర చేసినట్లు తేలింది. యూనివర్సిటీ ల్యాబ్ నుంచి కొన్ని రసాయనాలను తీసుకురావాలని ఉమర్, ముజమ్మిల్ ప్లాన్ వేసినట్లుగా సమాచారం. ఈ గదిలో సోదాలు చేపట్టిన దర్యాప్తు అధికారులు కొన్ని కెమికల్స్‌తోపాటూ పెన్‌డ్రైవ్‌లు, పలు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ముజమ్మిల్ గదితో పాటు ఉమర్‌కు చెందిన 4వ నంబరు గది నుంచి మూడు డైరీలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అందులో కీలక విషయాలు ఉన్నట్లు దర్యాప్తు వర్గాలు తెలిపాయి. డైరీల్లో భారీ ఉగ్ర ప్లాన్లను గుర్తించినట్లు దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి.మొత్తం 32 వాహనాల్లో పేలుడు పదార్దాలను నింపాలని అనుమానిత ఉగ్రవాదులు ప్లాన్ చేసినట్లు ఇంటెలిజెన్స్ అధికారులు పేర్కొన్నారు. మొత్తం 8 మంది అనుమానితులు సుమారు నాలుగు లొకేషన్లలో పేలుడుకు పాల్పడాలని భావించినట్లు తెలుస్తున్నది. పేలుడు పదార్దాలను కొనుగోలు చేసేందుకు వైట్‌కాలర్ డాక్టర్లు సుమారు 26 లక్షల నిధి సేకరించినట్లు తెలుస్తున్నది. అనుమానితులు డాక్టర్ ముజమ్మిల్ గన్నై, డాక్టర్ అదీల్ అహ్మద్ రాథర్, డాక్టర్ షహీన్ సయ్యిద్, డాక్టర్ ఉమర్ నబీ ఆ డబ్బును పోగు చేశారు. అయితే ఆపరేషన్స్ నిర్వహించేందుకు ఆ డబ్బును డాక్టర్ ఉమర్ వాడినట్లు తెలుస్తున్నది. ఫరీదాబాద్ టెర్రర్ మాడ్యూల్, ఎర్రకోట పేలుడు ఘటనల్లో తీగ లాగే కొద్దీ భారీ ఉగ్ర కుట్ర బయటపడుతోంది. వీరు దేశవ్యాప్తంగా నాలుగు నగరాల్లో దాడులకు పన్నాగం పన్నినట్లు తెలిసింది. ఇందుకోసం 8 మంది సూసైడ్ బాంబర్లను సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ కేసుల్లో నిందితులు డాక్టర్ ఉమర్ నబీ, డాక్టర్ ముజమ్మిల్ డైరీల్లో భారీ ఉగ్ర ఎ÷-లాన్లను గుర్తించినట్లు దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి. దిల్లీ పేలుడు ఘటన పై దర్యాప్తు చేపట్టిన అధికారులు హరియాణాలోని ఫరీదాబాద్‌లో గల అల్-ఫలా యూనివర్సిటీని జల్లెడ పడుతున్నారు. ఇక్కడి మెడికల్ కాలేజీలోని బాయ్స్ హాస్టల్ ఉండే 17వ నంబరు భవనం వీరి ఉగ్ర కార్యకలాపాలకు కేంద్రంగా ఉన్నట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఇందులో ముజమ్మిల్‌కు చెందిన 13వ నంబరు గదిలోనే ఉగ్ర కుట్రలకు పథక రచన చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. యూనివర్సిటీ ల్యాబ్ నుంచి కొన్ని రసాయనాలను తీసుకురావాలని ఉమర్, ముజమ్మిల్ ఎ÷-లాన్ చేసినట్లు తెలిసింది. ఈ గదిలో పోలీసులు సోదాలు జరిపి కొన్ని కెమికల్స్, డిజిటల్ పరికరాలు, పెన్‌డ్రైవ్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఇక, ముజమ్మిల్ గదితో పాటు ఉమర్‌కు చెందిన 4వ నంబరు గది నుంచి మూడు డైరీలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అందులో కీలక విషయాలు ఉన్నట్లు దర్యాప్తు వర్గాలు తెలిపాయి. ఆ డైరీల్లో 25 మంది వ్యక్తుల పేర్లు ఉన్నట్లు తెలుస్తోంది. వారంతా జమ్మూకశ్మీర్, ఫరీదాబాద్‌కు చెందిన వారని గుర్తించారు. దీంతోపాటు నవంబరు 8 నుంచి 12 వరకు తేదీలను ప్రస్తావించినట్లు సమాచారం. దీన్నిబట్టి చూస్తే వీరు దాడులకు పక్కా ప్రణాళిక రచించినట్లు దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. దేశవ్యాప్తంగా నాలుగు కీలక ప్రాంతాల్లో ఒకేసారి దాడులు జరపాలని నిందితులు ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ఇందుకోసం ఐ20, ఎకోస్పోర్ట్‌తో పాటు మరో రెండు పాత కార్లను కూడా సిద్ధం చేయాలని వారు ఎ÷-లాన్ చేసినట్లు సమాచారం. ఇందులో ఐ20 కారులోనే ఎర్రకోట వద్ద పేలుడు జరగ్గా.. ఎకోస్పోర్ట్ కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మిగతా రెండు కార్ల కోసం అన్వేషణ కొనసాగుతోంది. ఈ ప్లాన్‌ను అమలుచేసేందుకు 8 మందిని సిద్ధం చేసినట్లు ఆ డైరీల సమాచారంతో అధికారులు గుర్తించారు. ఒక్కో ప్రాంతానికి ఇద్దరు చొప్పున వెళ్లి పేలుళ్ల జరపాలని వీరు పన్నాగం పన్నినట్లు దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి. ఈ ఎనిమిది మందిలో ఉమర్, ముజమ్మిల్‌తో పాటు డాక్టర్ అదిల్, డాక్టర్ షాహీన్ కూడా ఉన్నట్లు తెలిపాయి. ఈ ఉగ్ర కుట్రను అమలుచేసే బాధ్యతను ప్రధానంగా ఉమర్‌కు అప్పగించినట్లు సమాచారం. ఇందుకోసం నిందితులు దాదాపు రూ.20 లక్షల వరకు నిధులు సేకరించి ఆ మొత్తాన్ని ఉమర్‌కు ఇచ్చినట్లు దర్యాప్తు వర్గాలు పేర్కొన్నాయి. ఈ డబ్బును వినియోగించి 20 క్వింటాళ్లకు పైగా ఎన్‌పీకే ఫెర్టిలైజర్‌ను గురుగ్రామ్, నూహ్ తదితర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసినట్లు గుర్తించాయి. ఈ పదార్థాలను వినియోగించి వారు ఐఈడీ బాంబులను తయారుచేయాలని ప్లాన్ చేసినట్లు అధికారులు భావిస్తున్నారు. అయితే, వీరి కుట్రలను పోలీసులు భగ్నం చేశారని దర్యాప్తు వర్గాలు పేర్కొన్నాయి.

## పేలిన కారులో ఉన్నది ఉమర్ నబీయే

**- డిఎన్ఎతో పోల్చి చూసి గుర్తింపు**

**- పేలుడుకు ముందు అక్కడే తచ్చాడినట్లు వెల్లడి**

**న్యూఢిల్లీ,నవంబర్13( వెలుతురు):** ఢిల్లీలోని ఎర్రకోట వద్ద పేలుడుకు సంబంధించి మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. బాంబు పేలుడు సంభవించిన ఐ20 కారులో ఉన్నది డాక్టర్ ఉమర్ నబీ అని తేలింది. కారులో లభించిన నమూనాలతో అతని డీఎన్ఏ సరిపోలడంతో కారు నడిపింది నబీయేనని అధికారులు నిర్ధారణకు వచ్చారు.గత సోమవారం ఢిల్లీలోని ఎర్రకోట వద్ద భారీ పేలుడు సంభవించిన విషయం తెలిసిందే. పేలుడుకు ముందు ఉమర్ కారు నడుపుతున్న సీసీటీవీ దృశ్యాలను అధికారులు గుర్తించారు. దీంతో ఘటన సమయంలో కారులో ఉన్న అతను కూడా ప్రాణాలు కోల్పోయాడని అధికారులు అనుమానించారు. ఈ నేపథ్యంలో పుల్వామాలో ఉన్న అతని తల్లి నుంచి డీఎన్ఏ నమూనాలు తీసుకొని పరీక్షించారు. కారు స్టీరింగ్, యాక్సిలరేటర్ మధ్య ఇరుక్కున్న కాలు నుంచి సేకరించి డీఎన్ఏను ఆమె డీఎన్ఏతో సరిపోల్చారు. దీంతో కారులో లభించిన డీఎన్ఏ ఉమర్ నబీదేనని తేలినట్లు ఢిల్లీ పోలీసులు వెల్లడించారు. ఏడాది జనవరిలో ఎర్ర కోట వద్ద డాక్టర్ ముజమ్మిల్ పలుసార్లు రెక్కీ నిర్వహించినట్లు వెల్లడైందని అధికారులు తెలిపారు. గణతంత్ర దినోత్సవం నాడు ఎర్ర కోటపై దాడి చేసేందుకు భారీ కుట్ర జరిగిందని, అందులో భాగంగానే ఈ రెక్కీ జరిగిందని పోలీసులు తెలిపారు. అయితే ఆ సమయంలో అక్కడ పటిష్టమైన పోలీసు పెట్రోలింగ్ ఉండడంతో వారి కుట్ర భగ్నమైందని చెప్పారు. ÷ూబ్రీ మసీదు కూల్చివేత జరిగిన డిసెంబర్ 6న భారీ పేలుడుకు రెడ్ ఫోర్ట్ సమీపంలో పేలుడుకు గురైన కారును నడుపుతున్న డాక్టర్ ఉమర్ నబీ కుట్ర పన్నినట్లు బుధవారం అధికార వర్గాలు వెల్లడించాయి. అంతర్రాష్ట్ర వైట్ కాలర్ జైషే మొహమ్మద్ ఉగ్ర మాడ్యుల్‌తో సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణపై అరెస్టయిన 8 మందిని పోలీసులు ప్రశ్నించగా ఈ సంచలన వివరాలు వెల్లడైనట్లు ఆ వర్గాలు చెప్పాయి. ఢిల్లీ బాంబు పేలుడు ఘటన నేపథ్యంలో అల్ ఫలాహ్ వర్సిటీ పేరు తెరపైకి వచ్చింది. ఈ వర్సిటీలో పనిచేస్తున్న డాక్టర్లు, ప్రొఫెసర్లు ఉగ్ర కుట్రలో భాగం కావడంతో దర్యాప్తు సంస్థల దృష్టి ఈ వర్సిటీపై పడింది. ఫరీదాబాద్ పరిధిలోని ధౌజ్ గ్రామంలో 70 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ సంస్థ హర్యానా రాజధానికి కేవలం 30 కి.మీ దూరంలోనే ఉంది. వైట్ కాలర్ టెర్రర్ నెట్‌వర్క్‌కు, రాడికలైజ్డ్ నిపుణుల బృందం తలపెట్టిన ఒక మారణహోమానికి కేంద్ర బిందువుగా మారింది. పోలీసులు, ఇతర దర్యాప్తు బృందాలు పలువురు సిబ్బందిని ప్రశ్నించారు. డాక్టర్ ఉమర్ కాకుండా, ఉగ్ర దాడికి సహకరించారని అనుమానిస్తున్న, జైషే మహ్మద్‌తో సంబంధం ఉన్న అతని ఇద్దరు సహాయకులు డాక్టర్ ముజమ్మిల్ షకీల్, డాక్టర్ షాహిన్ షాహిద్‌లు కూడా ఇదే విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్నారు. డాక్టర్ షకీల్‌ను అరెస్ట్ చేయడంతో తనను కూడా అరెస్ట్ చేస్తారన్న భయంతో ఉమర్ సోమవారం కారు బాంబు పేలుడుకు పాల్పడినట్టు అనుమానిస్తున్నారు. డాక్టర్ షాహిన్ కారు నుంచి రైఫిళ్లు, మందుగుండు సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటివరకు ఆరుగురిని యూనివర్సిటీ నుంచి అరెస్ట్ చేశారు. పేలుడు అనంతరం మరో డాక్టర్ నిసర్-ఉల్-హసన్ పరారీలో ఉన్నాడు. హసన్ ప్రస్తుతం ఈ యూనివర్సిటీలో మెడిసిన్ డిపార్ట్‌మెంట్‌లో ప్రొఫెసర్‌గా ఉన్నారు. దేశ ద్రోహ కార్యకలాపాలకు పాల్పడ్డాడన్న ఆరోపణపై ఆయనను శ్రీ మహరాజ హరి సింగ్ హాస్పిటల్ నుంచి జమ్ము కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ విధుల నుంచి తొలగించారు. అయితే ఇలాంటి రికార్డు ఉన్న వ్యక్తిని ఈ యూనివర్సిటీలో ఎలా నియమించారన్న విషయంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## మంచాలలో బీరప్ప దేవాలయ నిర్మాణాన్ని పరిశీలించిన మంచాల మాజీ ఎంపీటీసీ ఎద్మ నరేందర్ రెడ్డి



**మంచాల వెలుతురు నవంబర్ 13:**
మంచాల మండలం కేంద్రంలోని కురుమ సంఘనికి చెందిన బీరప్పగుడి నిర్మాణం గత కొన్ని సంవత్సరాలుగా భూ వివాదంలో చిక్కుకొని నిర్మాణం పనులు నిలిచిపోయాయి మంచాల గ్రామం స్థానిక రాజకీయ నాయకుల ద్వారా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి గారి చొరవతో కొద్ది రోజుల క్రితం భూవివాదం సమస్య పరిష్కారం అయ్యింది కురుమ సంఘం పెద్దలు వెంటనే బీరప్పగుడి నిర్మాణం పనులు ప్రారంభించారు బుధవారం రోజు బీరప్ప దేవాలయానికి స్లాబ్ వేశారు గుడి నిర్మాణ పనులను మంచాల మాజీ ఎంపీటీసీ ఎద్మ నరేందర్ రెడ్డి కురుమ సంఘం పెద్దలతో పరిశీలించారు ఈ కార్యక్రమంలో కురుమ సంఘం పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ గజిటెడ్ అధికారుల సంఘం హైదరాబాద్ నగర శాఖ కార్యవర్గ సమావేశం




**బషీర్ బాగ్ వెలుతురు 13 నవంబర్ :**
తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం నగర్ శాఖ నాలుగు గంటలకు భూగర్భ జల వనరుల శాఖ చింతల్ బస్తి హైదరాబాద్ లో నిర్వహించారు ఈ సమావేశాన్ని హైదరాబాద్ నగర శాఖ సంఘం అధ్యక్షుడు గండూరి వెంకటేశ్వర్లు కార్యదర్శి శెట్టిపల్లి నిరంజన్ రెడ్డి ప్రారంభించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీజీవో అధ్యక్షులు ఏలూరు శ్రీనివాసరావు ప్రధాన కార్యదర్శి ఎ సత్యనారాయణ హాజరై వివిధ అంశాల పై చర్చించారు ఎజెండా అంశాలపై ఏకగ్రీవంగా తీర్మానాలు చేసారు గత 14 సంవత్సరాలుగా టీజీవో కేంద్ర సంఘంలోనూ హైదరాబాద్ నగర శాఖకు అధ్యక్షులుగా విశిష్ట సేవలందిస్తున్న ప్రస్తుత అధ్యక్షులు గండూరి వెంకటేశ్వర్లు టీ జి ఓ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి పదవికి తీసుకోవాల్సిందిగా ఏకగ్రీవంగా తీర్మానించారు ఒకవేళ ఏకగ్రీవంగా వీలుకాని పక్షంలో ఎన్నికలలో పాల్గొనడానికి ఏకగ్రీవంగా అనుమతి ఇస్తూ తీన్మారించారు ప్రస్తుతం నగర శాఖలో ఖాళీగా ఉన్న కోశాధికారి పదవిని భీంసింగ్ కు జాయింట్ సెక్రెటరీ పదవిని వెంకట రమణ కు మరియు మరొక జాయింట్ సెక్రెటరీ పదవికి వెంకటేశ్వర అదేవిధంగా నరసింహ చారి బీసీ మెంబర్ నుండి జాయింట్ సెక్రటరీగా పదోన్నతి కల్పించడంతో పాటు వెంకట నరసయ్య ని కూడా కార్యవర్గంలోనికి తీసుకోవడానికి ఏకగ్రీవంగా తీర్మానించడం అయినది హైదరాబాద్ నగరశాఖ కార్యవర్గం 2026 వాల్ క్యాలెండర్ టేబుల్ క్యాలెండర్ అండ్ డైరీల ప్రిపరేషన్ పనిని మొదలు పెట్టినవలసిందిగా తీర్మానిస్తూ నగరశాఖ సభ్యులందరూ అడ్వైజర్మెంట్ తప్పనిసరిగా ఇవ్వవలసిందిగా తీర్మానించారు.

## ఢిల్లీ ఉగ్రదాడిని నిరసిస్తూ అయ్యప్ప స్వాముల కొవ్వొత్తుల ప్రదర్శన



**బషీర్ బాగ్ వెలుతురు నవంబర్ 13:**
ఢిల్లీ ఉగ్రదాడిని ఖండిస్తూ బాగ్ అంబర్ పేట్ లో అయ్యప్ప స్వాములు కొవ్వొత్తుల ప్రదర్శనను నిర్వహించారు. స్థానిక అయ్యప్ప దేవాలయం పరిసరాల్లో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించిన స్వాములు బాంబు పేలుళ్లలో మృతి చెందిన వారికి నివాళులర్పించారు. ఢిల్లీ బాంబు పేలుళ్లకు కారకులైన ఉగ్రవాదులపై కఠినంగా వ్యవహరించాలని ఈ సందర్భంగా స్వాములు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు శేఖర్ రెడ్డి, జనగాం ఓంకార్ గౌడ్, సతీష్ ముదిరాజ్, వర్కాల కృష్ణ, కట్టెల మహేష్ గౌడ్, శ్రీమంత్, అంబటి యాదగిరి రాజు, మురుగన్, డాక్టర్ అజయ్ కుమార్, కెంచె మహేష్,తవిటి వెంకటేష్ ముదిరాజ్ ,గుప్తా అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## అకాల వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం

**- సోయాబీన్, మొక్కజొన్న, పత్తి కొనుగోళ్లలో సడలింపులు ఇవ్వాలి**

**- కేంద్రానికి మరోమారు లేఖ రాసిని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**హైదరాబాద్, నవంబర్13( వెలుతురు):**



సోయాబీన్, మొక్కజొన్న, పత్తి కొనుగోళ్లలో సమస్యలపై కేంద్రానికి తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరోసారి లేఖ రాశారు. 'మొంథా' తుఫాను, అకాల వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం జరిగిందని, రైతులకు ప్రత్యేక సడలింపులు ఇవ్వాలని కేంద్రానికి ఆయన విజ్ఞప్తి చేశారు. అలానే సోయాబీన్ ఎఫ్ఏక్యూ ప్రమాణాల్లో సడలింపు ఇవ్వాలని మంత్రి తుమ్మల కోరారు. వర్షాల ప్రభావంతో గింజల్లో రంగు మారడం, ముడతలు వచ్చాయి. ఔంఈఇఅ, ఔఅఅఈ సంస్థలకు పంటల నాణ్యత సడలింపు ఆదేశాలు ఇవ్వాలని కేంద్రాన్ని మంత్రి తుమ్మల కోరారు. రాష్ట్రంలో 3.66 లక్షల ఎకరాల్లో సోయాబీన్ సాగు చేశారని, ఎకరాకు 7.62 క్వింటాళ్ల సగటు దిగుబడి వచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు 48,757 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు చేయడంతో 14,519 మంది రైతులకు లాభం చేకూరిందని మంత్రి తెలిపారు. కనీస మద్దతు ధర కింద మొత్తం 16.85 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలుకు ఔంఈఇఅ, ఔఅఅఈ సంస్థలకు అనుమతి ఇవ్వాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. పత్తి కొనుగోళ్లలో ఎకరాకు 7 క్వింటాళ్ల పరిమితి అనేది రైతులకు నష్టం చేకూరుస్తుందని, ఆ పరిమితిని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పత్తి తేమ శాతం సడలించి, ఎకరాకు 11.74 క్వింటాళ్ల దిగుబడి ఆధారంగా కొనుగోలు కొనసాగించాలని కేంద్రానికి సూచించారు. పత్తి మొక్కజొన్న, సోయాబీన్ రైతులకు రక్షణ కల్పించేందుకు కేంద్రం తక్షణ చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు విజ్ఞప్తి చేశారు.

# అవగాహన సదస్సు- డ్రగ్స్ ఇన్స్పెక్టర్ జె. నాగరాజు





**ఆటోనగర్ వెలుతురు నవంబర్ 13:**
గురువారం రోజున అనగా 13 11 2025 డ్రగ్స్ ఇన్స్పెక్టర్ నాగరాజు అసిస్టెంట్ డైరెక్టర్ జి ప్రసాద్ రంగారెడ్డి వారి ఆదేశాలకు మేరకు ఆటోనగర్ డంప్ యార్డ్ తనిఖీ చేయడం జరిగింది. తనిఖీ చేసిన సందర్భంలో అక్కడ ఎలాంటి వాడకంలో లేని మెడిసిన్స్ గాని తర్వాత ఎక్స్ పైరి మెడిసిన్స్ కానీ ఇలాంటివి కనుగొనబడలేదు అక్కడ లేవు. కెవి సుబ్బారావు సూపర్వైజర్ హెచ్ఐఎంఎస్ డబ్ల్యూ ఆటోనగర్ వారిని ఎంక్వయిరీ చేయగా మాకు తెలియజేసింది ఎలాంటి మెడిసిన్స్ కూడా వాళ్ళు యాక్సెప్ట్ చేయట్లేదు డిస్పోస్ చేయడము లేదు. కేవీ సుబ్బారావు సూపర్వైజర్ కి మేము ఇన్స్ట్రక్ట్ చేసాము ఎలాంటి మెడిసిన్స్ గాని అతను తీసుకోకుండా ఉండడానికి మేము ఇన్స్ట్రక్ట్ చేసాము. మెడిసిన్స్ తీసుకోవడం లేదు కానీ తీసుకోకుండా ఉండడానికి మేము ఇన్స్ట్రక్ట్ చేసాము అదే విధంగా అడ్మినిస్ట్రేషన్ యొక్క టోల్ ఫ్రీ నెంబర్ 1800596969 ని వారికి ఇచ్చాము ఎవరైనా మెడిసిన్స్ గానీ వాడకంలో లేని మెడిసిన్స్ మరియు ఎక్స్పైర్ డ్రగ్స్ గాని ఎవరైనా పంపిస్తే మాకు తెలియవలసిందిగా అతనికి తెలియజేసాము. తర్వాత రంగారెడ్డి జిల్లా కెమిస్ట్స్ & డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఆటోనగర్ లో మీటింగ్ కండెక్ట్ చేసాము. ఈ అసోసియేషన్ లో సభ్యులైనటువంటి రిటైలర్స్ హోలేసేల్ వారికి ఇన్స్ట్రక్ట్ చేశాము. ఎక్స్పైరీ మెడిసిన్స్ కానీ ఏవైనా ఉంటే 30 రోజుల లో ఎక్స్పైరీ డేట్ విత్ రిటైలర్ అయితే హోల్సేలర్ కి గాని మ్యానుఫ్యాక్చరింగ్ గాని రిటర్న్ చేయాలి. ఒకవేళ మ్యానుఫ్యాక్చరర్ గాని సీ అండ్ ఏఫ్ ఏజెంట్ గాని ఎక్కడి నుంచి తెచ్చారు అక్కడికి త్వరగా 30 రోజుల లోగా వాళ్ళు రిటన్ చేసి రిటర్న్ చేయాలి ఈ విధంగా సిక్స్ మంత్స్ లోగా మ్యానుఫ్యాక్చరర్ కి చేరే విధంగా చూడాలి. ఎక్స్పైరీ డేట్ విధిని 6 నెలల లోగా మ్యానుఫ్యాక్చరర్ గాని లేకపోతే మ్యానుఫ్యాక్చర్ ఆయన సైట్ వద్ద గాని లేకపోతే మనకి పొల్యూషన్ కంట్రోల్ అనుమతి పొందిన సంస్థ ద్వారా అతను ఆ మెడిసిన్స్ ని డిస్పెన్ చేయాలి. ఇది రీసెంట్ గా వచ్చిన మన డక్స్ కంట్రోల్ జనరల్ ఆఫ్ ఇండియా వారు 26.5.2025న వారు ఈ గైడ్ లెన్స్ ఇచ్చారు . దీని ప్రకారము వితిన్ సిక్స్ మంత్స్ లోగా మనము ఎక్స్పరిమెంట్స్ డిస్పెస్ చేయాలి అని తెలిపారు. ఈ మీటింగ్ లో రంగారెడ్డి కెమిస్ట్స్ & డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు డా,, పెండెం కృష్ణ కుమార్, జనరల్ సెక్రటరీ ఎస్ సత్యనారాయణ, ట్రెజరర్ మహేందర్ రెడ్డి, వేణు కుమార్ కేమిస్ట్ లు పాల్గొన్నారు.

# నిషేధిత, ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టే ఎలాంటివి అక్రమ రవాణా జరగడానికి వీలు లేదు

**- జిల్లా ఎస్పీ గారి ఆధ్వర్యంలో జిల్లా పోలీసు, సాయుధ పోలీసులతో నాకాబందీ...**

**- జిల్లా ప్రజల శాంతి, భద్రతల పరిరక్షణలో భాగంగా నాకాబందీ...**

**- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్. ఐపిఎస్...**





**జహీరాబాద్ వెలుతురు నవంబర్ 13:**
జిల్లా ప్రజల శాంతి, భద్రతల పరిరక్షణతో పాటు ప్రభుత్వ



ఆదాయానికి గండికొట్టే అక్రమ రవాణా కార్యకలాపాలను అరికట్టేందుకు సంగారెడ్డి జిల్లా పోలీసులు విస్తృత చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ ఆధ్వర్యంలో, తెలంగాణ-కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన మొగుడంపల్లి మండలం మాడ్గి వద్ద అర్ధరాత్రి మెగా నాకాబందీ కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్ - ముంబయి జాతీయ రహదారి (NH-65)పై నవంబర్ 12వ తేదీ రాత్రి 9 గంటల నుండి 13వ తేదీ తెల్లవారు జామున 1.30 గంటల వరకు చిరాగ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నాకాబందీ నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. జిల్లాలోని ప్రధాన మార్గాలపై వాహనాలను ఆపి విస్తృతంగా తనిఖీలు జరిపారు. జిల్లా సరిహద్దులు ఇతర రాష్ట్రాలతో కలిసిన కారణంగా, తెలంగాణ ప్రభుత్వంచే నిషేధించబడిన గంజాయి, గుట్కా, అక్రమ మద్యం, మాదక ద్రవ్యాలు, పిడిఎస్ బియ్యం వంటి వస్తువుల అక్రమ రవాణా జరగకుండా ప్రత్యేక నిఘా బృందాలను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ పరితోష్ పంకజ్ వివరించారు. అంతర్ రాష్ట్ర నేరస్తుల కదలికలు, పేలుడు స్వభావం గల పదార్థాల రవాణా వంటి ప్రమాదకర కార్యకలాపాలను అరికట్టడంలో భాగంగా ప్రతిరోజు నిర్దిష్ట ప్రాంతాలను గుర్తించి వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నాకాబందీ కార్యక్రమంలో మొత్తం 80 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. వారిని విభిన్న బృందాలుగా విభజించి వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. మొత్తం 850 వాహనాలను తనిఖీ చేయగా, ఇతర రాష్ట్రాల నుండి అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనం చేయడంతో పాటు, మద్యం సేవించి వాహనాలు నడిపిన 9 మందిపై డీడీ కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ వివరించారు. జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో ఈ నాకాబందీ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఇందులో అదనపు ఎస్పీ రఘునందన్ రావు, జహీరాబాద్ డీఎస్పీ సైదా నాయక్, జహీరాబాద్ పట్టణ ఇన్‌స్పెక్టర్ శివలింగం, బొల్లారం ఇన్‌స్పెక్టర్ రవీందర్ రెడ్డి, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్, సదాశివపేట ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్, నారాయణఖేడ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా సాయుధ విభాగం సిబ్బంది మరియు వివిధ సబ్‌డివిజన్‌లకు చెందిన ఎస్‌ఐలు పాల్గొన్నారు. జిల్లా ప్రజల భద్రత, చట్టం-శాంతి కాపాడడంలో భాగంగా ఇటువంటి నాకాబందీ కార్యక్రమాలు తరచూ కొనసాగుతాయని ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. అక్రమ రవాణా లేదా చట్ట విరుద్ధ చర్యల్లో పాల్గొనేవారిపై ఎటువంటి రాయితీ లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి

**వెలుతురు నారాయణఖేడ్ నవంబర్ 13 :**
సంగారెడ్డి జిల్లా :- కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ సమీపంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో నారాయణఖేడ్ మండలం జగన్నాథ్ పూర్ గ్రామానికి చెందిన రాచప్ప, కాశీనాథ్, నవీన్ మరణించినందున వారి కుటుంబ సభ్యులను వారి ఇంటికి వెళ్లి పరామర్శించి వారికి ధైర్యాన్ని చెప్పి ప్రగాఢ సానుభూతి తెలియజేసిన గౌరవ నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి వారితోపాటు మండల పార్టీ అధ్యక్షులు పరమేష్, కల్హేర్ జడ్పీటీసీ నరసింహారెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షులు నగేష్ సెట్,మాజీ సర్పంచ్ ప్రకాశ్ పటేల్, రమేష్ పటేల్, శరణప్ప పటేల్, బాలప్ప, మల్లొంద్,శ్రీనివాస్ రెడ్డి, ప్రశాంత్ సాగర్, వారి కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.





# రంజోల్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు ముందడుగు

**- సెవెన్ హిల్స్ ఫుడ్ కంపెనీ పరిశీలన**

**జహీరాబాద్ వెలుతురు నవంబర్ 13:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం రంజోల్ గ్రామంలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల విస్తరణ దిశగా చర్యలు మొదలయ్యాయి. తెలంగాణ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ పరిధిలో భాగంగా సెవెన్ హిల్స్ ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారు ఇక్కడ ప్రాసెసింగ్ యూనిట్ స్థాపించేందుకు ముందడుగు వేసింది. ఈ క్రమంలో కంపెనీ ప్రతినిధులు ఈరోజు బాబానగర్ పరిసరాల్లో ఆలుగడ్డ సాగు చేసే పొలాలను సందర్శించి, మట్టి నమూనాలు సేకరించారు. అదేవిధంగా గాలిలో గల పోషకాలు, నీటి నాణ్యత వంటి అంశాలపై సాంకేతిక పరీక్షలు నిర్వహించారు. పరీక్షల ఫలితాల ఆధారంగా ఈ ప్రాంతంలో ఆలుగడ్డ సాగుకు అనుకూలత



ఉన్నట్లు తేలితే, స్థానిక రైతులతో టై-అప్ చేసి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ను స్థాపించడమే కాకుండా, ఉత్పత్తుల మార్కెటింగ్ సదుపాయాలు కూడా కల్పించేందుకు కంపెనీ సహకరిస్తుందని కంపెనీ ప్రతినిధి హరిబాబు తెలిపారు. ఈ పరిశీలన కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ప్రదీప్ కుమార్, రైతులు శ్రీనివాస్ రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు స్థానిక రైతుల ఆర్థిక స్థాయిని పెంచుతాయని పేర్కొంటూ, ప్రభుత్వం కూడా జహీరాబాద్ ప్రాంతంలో ఇలాంటి యూనిట్లు మరింతగా ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని రైతులు అభిలషించారు.

## ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత: ఎమ్మెల్సీ కోటిరెడ్డి



**తిరుమలగిరి (సాగర్) వెలుతురు న్యూస్, నవంబర్ 13:**
నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ నియోజకవర్గం తిరుమలగిరి సాగర్ మండలం,ఎల్లాపురం గ్రామంలో గ్రామ అయ్యప్ప స్వాముల ఆహ్వానం మేరకు శ్రీ హరిహర సుత అయ్యప్ప స్వామి వారి విగ్రహ ప్రతిష్ట మరియు ధ్వజస్తంభ మహోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన నల్లగొండ జిల్లా శాసన మండలి సభ్యులు యం.సి కోటిరెడ్డి అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ సందర్భంగా ఎమ్మెల్సీ ని అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. ఒక మారుమూల గ్రామంలో అయ్యప్ప స్వామి దేవాలయం మరియు విగ్రహ ప్రతిష్ట ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. తదనంతరం నిర్వాహకులు ఎమ్మెల్సీ ని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ మహోత్సవ కార్యక్రమంలో..... అయ్యప్ప గురు స్వామి మండల గోవిందు యాదవ్,మాజీ యం.పి.టి.సి గుండెబోయిన అంజి యాదవ్,మాజీ సర్పంచ్ పురుషోత్తం యాదవ్, గ్రామ పెద్దలు భాషం వెంకటేశ్వర్లు యాదవ్,రావులపాటి గురువయ్య యాదవ్, గంగరాజు యాదవ్,న్యాయవాది జిల్లేపల్లి శ్రీనివాస్,పెద్ద బోయిన అశోక్ యాదవ్, రాజు యాదవ్,కేతపల్లి ఏసు, పెద్ద బోయిన బిక్షం యాదవ్, పెద్దమామ మధు, రావులపాటి సైదులు,మరియు గ్రామస్తులు, అయ్యప్ప స్వాములు,భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## ఓయూ నుంచి డాక్టరేట్ పొందిన చుక్కలతను సన్మానించిన బిజెపి రాష్ట్ర నేతలు పుల్లెల పవన్, సొల్లు అజయ్ వర్మ



**కరీంనగర్ వెలుతురు నవంబర్ 13:**
కరీంనగర్ పట్టణం ఉస్మాన్ పుర కు చెందిన చుక్క నరసయ్య పోచమ్మ , దంపతుల కూతురు చుక్కలత ఉస్మానియా యూనివర్సిటీ నుండి డాక్టరేట్ పొందిన సందర్భంగా తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర అధ్యక్షులు బిజెపి రాష్ట్ర నాయకులు.. సొల్లు అజయ్ వర్మ డాక్టర్ పుల్లెల పవన్ లు గురువారం రోజున ఆమెను ఘనంగా సన్మానించారు... ఉస్మానియా యూనివర్సిటీ సోషియాలజీ విభాగం నుంచి ప్రొఫెసర్ సునంద పాండే పర్యవేక్షణలో " రీసెర్చ్ స్కాలర్స్ ఆస్పిరేషన్స్, జాబ్ అపోర్చునిటీస్ అండ్ ఎడ్యుకేషనల్ వేస్టేజీ- ఏ కంపరేటివ్ స్టడీ ఆఫ్ సెలెక్టెడ్ యూనివర్సిటీస్ ఇన్ ఇండియా" అనే అంశంపై పరిశోధన పూర్తి చేసినందుకు గాను చుక్క లతకు ఓయూ పరీక్షల విభాగం డాక్టరేటును ప్రకటించింది. కరీంనగర్ ఉస్మాన్ పుర కు చెందిన చుక్క లత తండ్రి బాల్యంలోనే మృతి చెందారు. తల్లి పోచమ్మ స్వీపర్ గా పనిచేస్తూ లత ను పోషిస్తూ చదివించింది. తన తల్లి ఆశయం తో పాటు తన ఆకాంక్షల మేరకు చుక్క లత చిన్ననాటి నుంచి ఇష్టంతో కష్టపడి చదువుతూ నాలుగు పీజీ కోర్సులతోపాటు ఒక బిఈడి కోర్సును పూర్తి చేసి ఓయూ సోషియాలజీ విభాగం నుంచి పీహెచ్డీ కోర్సును కూడా పూర్తిచేసి డాక్టరేట్ ను సాధించింది. పీహెచ్డీ కోర్స్ చేస్తున్న క్రమంలోనే తన తల్లి క్యాన్సర్ బారిన పడి మరణించింది. అయినప్పటికీ అధైర్య పడకుండా మొక్కవోని దీక్షతో పరిశోధన పూర్తిచేసి చుక్క లత డాక్టరేట్ ను పొందింది. తన పరిశోధనకు సహకరించిన ఓయూ సోషియాలజీ విభాగం అధ్యాపకులు, ఇతర మిత్రులకు చుక్కలత కృతజ్ఞతలు తెలిపారు. తన డాక్టరేట్ ను తల్లిదండ్రులైన చుక్క నరసయ్య పోచమ్మలకు అంకితం ఇస్తున్నట్లు డాక్టర్ లత తెలిపారు.

# నవంబర్ 28న సూర్యాపేటలో గీతన్నల రణభేరి పోస్టర్ ఆవిష్కరణ

**వేలాదిమంది గీత కార్మికులు తరలిరావాలని కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు మేకపోతుల వెంకటరమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు పిలుపు.**



**సూర్యాపేట వెలుతురు నవంబర్ 13:**
కల్లుగీత కార్మిక సంఘం తెలంగాణ రాష్ట్ర 4 వ మహాసభల సందర్భంగా నవంబర్ 28వ తేదీన సూర్యాపేటలో భారీ ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహిస్తున్నామని దీనికి రాష్ట్ర నలుమూలల నుండి గీత కార్మికులు వేలాదిగా తరలిరావాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు మేకపోతుల వెంకటరమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. గురువారం రోజున సూర్యాపేటలోని అంతటి విజయ్ ఫంక్షన్ హాల్ లో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎల్గూరి గోవిందు, మడ్డి అంజిబాబాబు, తదితరులతో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బహిరంగ సభ అనంతరం 29,30 తేదీలలో జరిగే ప్రతినిధుల మహాసభలో రాష్ట్రంలోని గీత కార్మికుల సమస్యలు చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. 1957లో రాష్ట్రంలో మొట్టమొదట ఏర్పడ్డ సంఘం కల్లుగీత కార్మిక సంఘం. ఈ 68 సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణంలో అనేక పోరాటాలు, ఉద్యమాలు నిర్వహించాం. సొసైటీలు, టిఎఫ్ టి లు, పెన్షన్, ఎక్స్‌గ్రేషియా లాంటి కొన్ని హక్కులు సాధించుకున్నాము. మరెన్నో సాధించుకోవాల్సి ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 5 లక్షల కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్న కల్లుగీత వృత్తి గురించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పట్టింపే లేదు. కేంద్ర బిజెపి ప్రభుత్వం గీత కార్మికుల సంక్షేమానికి ఒక్క పథకం కూడా పెట్టలేదు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదు. అధికారులకు, మంత్రులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ 4 వేలకు, ఎక్స్‌గ్రేషియా 10 లక్షలకు పెంచాలని, ప్రమాద నివారణకు వృత్తి చేసే వారందరికీ జాప్యం లేకుండా కాటమయ్య రక్షణ కవచం ఇవ్వాలని, ప్రమాదానికి గురైన గీత కార్మికులకు ఇవ్వాల్సిన పెండింగ్ ఎక్స్‌గ్రేషియా వెంటనే విడుదల చేయాలని, నీరా మరియు తాటి ఈత ఉత్పత్తుల పరిశ్రమలు ఏర్పాటు చేయాలని తదితర డిమాండ్ల పరిష్కారం కోసం ఉద్యమిస్తామన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో నగేష్, అబ్బగాని బిక్షం, గునగంటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంది

- మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి
- రాజ్యాంగ సవరణ చేసైనా బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి
- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగంగౌడ్
- బీసీల ధర్మ పోరాట దీక్షకు మద్దతు పలికిన అఖిల పక్ష పార్టీల నాయకులు



**మిర్యాలగూడ వెలుతురు నవంబర్ 13:**
బీసీలకు విద్య ఉద్యోగ రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు పట్టణంలోని సబ్ కలెక్టర్



కార్యాలయం ముందు బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ అధ్వర్యంలో బీసీల ధర్మ పోరాట దీక్ష చేశారు. ఈ దీక్షకు అఖిల పక్ష పార్టీల నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు. దీక్షను ఉద్దేశించి ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉందనీ అన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీలో ఆమోదించి రాష్ట్రపతి ఆమోదానికి పంపించిన కూడా నెలల తరబడి బిల్లు గురించి పట్టించుకోవడం లేదని తెలిపారు. బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదించాలని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఢిల్లీలో ధర్నా చేసిన కూడా కేంద్రం ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. బీసీల కోసం కాంగ్రెస్ పార్టీ రిజర్వేషన్ తీసుకొస్తుంటే బిజెపి కావాలని కాలయాపన చేస్తుందని అన్నారు. బీసీలకు బిజెపి వ్యతిరేకత అని ఆరోపించారు. కేంద్రంలో మంత్రులుగా ఉన్న కిషన్ రెడ్డి, బండి సంజయ్ బీసీ రిజర్వేషన్ బిల్లుపై అభిప్రాయం చెప్పాలన్నారు. బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగంగౌడ్ మాట్లాడుతూ వచ్చే పార్లమెంటు సమావేశాల్లో కాంగ్రెస్ పార్టీ ప్రైవేట్ బీసీ బిల్లు పెట్టాలని అన్నారు. బీసీ బిల్లును బీసీ ప్రధాని అయిన నరేంద్ర మోడీ ఆమోదించి బీసీల న్యాయమైన రిజర్వేషన్ల డిమాండ్ ను ఆమోదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు ఎర్రబెల్లి దుర్గయ్య మహేష్ గౌడ్ సందెనబోయిన జయమ్మ బంటు కవిత జానపాటి రవి డాక్టర్ రాజు బీజేపీ పట్టణ అధ్యక్షుడు బంటు గిరి,అంబేద్కర్ యువజన సంఘం కొమ్ము శ్రీనివాస్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఎండి షోయబ్ మండల సోములు పొదిలి శ్రీనివాస్ సయ్యద్ ఫరూక్ గాజుల శ్రీనివాస్ చిలుకూరి బాలు పోలగాని వెంకటేష్ వజ్రగిరి అంజయ్య నాయుడు సిపిఐ ధనుంజయ నాయుడు సైదులు అనిల్ సతీష్ దోనేటి అశోక్ బంటు సైదులు పాశం శ్రీను గాలం వెంకన్న యాదవ్ అంతటి రాములు గౌడ్ తాళ్లపల్లి విజయ్ శ్రీనివాస్ యాదవ్ దాసరాజు జయరాజు ఆర్లపూడి శ్రీనివాస్ దుర్గా భవాని కలమ్మ కల్పన లక్ష్మి పాల్గొన్నారు.

# ఆయిల్ ఫామ్ సాగుతో లాభాలు



**మునుగోడు వెలుతురు నవంబర్ 13:**
మునుగోడు మండలంలోని పులిపలుపుల రైతు వేదిక నందు ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. మునుగోడు మండల డివిజన్ ప్లాంటేషన్ ఆఫీసర్ ప్రసాద్ ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఎకరానికి 57 మొక్కలను నాటుకోవచ్చని, వరి కంటే ఎక్కువ లాభాలు పొందవచ్చని, దీనికీ ప్రభుత్వం తరుపున సబ్సిడీ వస్తుంది. డ్రిప్ పరికరాలు sc, st రైతులకు 100%, బీసీ రైతులకు 90%, మరియు ఓసీ రైతులకు 80% రాయితీ వస్తుంది, రైతులు ఆయిల్ ఫామ్ పంట వేసిన తర్వాత అంతర పంటల సాగు మరియు ఎరువుల నిమిత్తం ఎకరాకు 4,200/- రూపాయలను 4 సంవత్సరాల పాటు ఇస్తుంది. కాబట్టి ఆసక్తి ఉన్న రైతులు ముందుకు వచ్చి ఆయిల్ పామ్ పంటను వేయాలని తెలిపారు.



అనంతరం పులిపలుపుల క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి, ఎం నరసింహ, మాట్లాడుతూ నీళ్లు ఉన్న రైతులు ఆయిల్ పామ్ సాగు ఒక్కసారి నాటితే పంట దిగుబడి 4 వ సంవత్సరం నుండి మొదలై 35 సంవత్సరాల పాటు ప్రతి నెల ఆదాయం వచ్చే ఏకైక పంట ఆయిల్ పామ్ అని అన్నారు. 200 రూపాయలు విలువ గల మొక్కలను కేవలం 20/- లకే ఒక్కో ఆయిల్ పామ్ మొక్కను రైతులకు ప్రభుత్వం ఇస్తుంది,మరియు మార్కెట్ సమస్య కూడా లేదు ప్రభుత్వ ఆధ్వర్యంలో బై బ్యాక్ అగ్రిమెంట్ కూడా ఉంటుంది అని తెలిపారు. వ్యవసాయ సహకార పరిమితి సంఘం ఆధ్వర్యంలో "ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహన సదస్సు"ను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పులిపలుపుల క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి- నరసింహ గారు, పతంజలి ప్లాంటేషన్ ఆఫీసర్ - ప్రసాద్ గారు ,HEO శ్రీనివాస్ గారు , PACS-CEO సుఖేందర్ గారు, సిబ్బంది, అశోక్ రెడ్డి, లింగస్వామి, చంద్రశేఖర్ పతంజలి ఫీల్డ్ అసిస్టెంట్ స్వామి, యాదయ్య మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# రైతు ధీమాగా ఉండాలంటే పంట బీమా అవసరం

**- ఎమ్మెల్యే పాయల్ శంకర్**



**ఆదిలాబాద్ వెలుతురు నవంబర్ 13:**
ప్రమాద సమయాల్లో రైతులకు అండగా నిలిచేందుకు పంటల బీమా ఉంటేనే రైతులకు ధీమాగా ఉంటుందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జైనథ్ మండలం లక్ష్మీం పూర్ గ్రామంలో ఓ రైతు ఇంట్లో షార్ట్ సర్క్యూట్ వల్ల నిల్వ ఉంచిన పత్తి దగ్దం అయింది. విషయం తెలుసుకునే ఎమ్మెల్యే గురువారం బాధిత రైతు ఇంటికి వెళ్ళి ప్రమాదంలో దగ్ధమైన పత్తిని పరిశీలించి రైతుతో మాట్లాడి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పంట అమ్ముకునేందుకు సిద్ధంగా ఉండగా అగ్ని ప్రమాదంలో దగ్ధం అవ్వడం ఎంతో నష్టాన్ని చేకూరుస్తోందన్నారు. అందుచేతనే ప్రమాద సమయాల్లో భీమా ఉంటే రైతులకు ఎంతో ఆసరాగా ఉంటుందన్నారు. గత ప్రభుత్వం పంటల బీమా కోసం నిర్ణయం తీసుకున్నప్పటికీ ఆయా సంస్థలకు డబ్బులు చెల్లించకపోవడంతో రైతులకు బీమా అందలేకపోయిందని ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫసల్ బీమా పథకం ఈ రాష్ట్రంలో అమలు కావడం



లేదు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పంటల బీమా పథకాన్ని అమలు చేసే విధంగా చూస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు బిజెపి నాయకులు కరుణాకర్ రెడ్డి . రాందాస్.విజయ్.అశోక్ రెడ్డి.రాకేష్.రెడ్డి. రమేష్.ఉన్నారు.

# రైతుల కోసం 10 రూపాయలకే భోజనం

**- కలెక్టర్ తో కలిసి ప్రారంభించిన ఎమ్మెల్యే**

**ఆదిలాబాద్ వెలుతురు నవంబర్ 13:**
పండించిన పంటను అమ్ముకునేందుకు మార్కెట్ కి వచ్చే రైతుల కోసం 10 రూపాయలకే భోజన వసతిని కల్పించడం జరిగిందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. మార్కెట్ యార్డ్ లో ఇస్కాన్ సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనాన్ని జిల్లా కలెక్టర్ రాజర్షి షా, డీసీసీబీ చైర్మన్ అడ్డీ బోజారెడ్డి, ఇస్కాన్ సంస్థ స్వామీజీ తో కలిసి గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం అతిథులు రైతులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజ సేవలో గొప్ప పాత్ర పోషిస్తున్న ఇస్కాన్ సంస్థ వారు రైతులకు భోజనం పెట్టేందుకు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో ప్రారంభించిన భోజనాన్ని కార్యక్రమాన్ని జిల్లాలోనీ ఇతర మార్కెట్ యార్డులో ప్రారంభించేందుకు సహకరించాలని కోరారు. దేశానికి అన్నం పెడుతున్న రైతులకు పంట అమ్ముకునేందుకు మార్కెట్ యార్డ్ కు వచ్చిన సమయంలో ఇబ్బంది పడకుండా భోజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో పలువురు రైతు సంఘాల నాయకులు, మార్కెట్ కమిటీ అధికారులు రైతులు పాల్గొన్నారు











# తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం సంగారెడ్డి-మెదక్ జిల్లా ఎన్నికలు

**- తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం**


**వెలుతురు నారాయణఖేడ్ నవంబర్ 13 :**
సంగారెడ్డి – మెదక్ జిల్లా కార్యవర్గం ఎన్నికలు తేది 16.11.2025, ఆదివారం రోజున ఉదయం 10.00 గంటలకు సంగారెడ్డి పట్టణములో రిటైర్డ్ ఎలక్ట్రిసిటీ అధికారుల భవనంలో జరుపబడును. ఎన్నికల అధికారిగా శ్రీ. మామిడాల. రవికుమార్ (తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి) గారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుంది. గత కార్యవర్గం ఏర్పడి మూడు సంవత్సరాలు పూర్తి అవుతున్నందున కొత్త కార్యవర్గం ను తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం సంగారెడ్డి–మెదక్ జిల్లాల సభ్యులు ఆదివారం జరిగే ఎన్నికలలో ఎన్నుకోవడం జరుగుతుంది. అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి పదవులతో పాటు మొత్తం 23 పదవులకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుంది. ఈ ఎన్నికలలో తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘంలో సభ్యత్వం తీసుకున్న సభ్యులు మాత్రమే పోటీచేయటానికి అర్హులు. కావున సభ్యత్వం తీసుకొన్న సభ్యులు అందరు ఈ ఎన్నికల కార్యక్రముకు హాజరుకావాలని కోరుచున్నాము.

## కుంకుమార్చన, దీపోత్సవానికి సర్వం సిద్ధం





శ్రీ పంతులు శ్రీ చక్ర లలితా దేవి ఆలయ వ్యవస్థాపకులు..



చండీ ఉపాసకులు బ్రహ్మశ్రీ గురు రాజు శర్మ

**వెలుతురు నారాయణఖేడ్ నవంబర్ 13 :**
సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ పట్టణంలోని శ్రీ చక్ర సహిత లలితా దేవి ఆలయంలో శుక్రవారం నిర్వహించనున్న కార్తీకదీపోత్సవం,కుంకుమార్చన కార్యక్రమాలకు లలితాంబికాదేవి ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు శ్రీ పంతులు,పురోహితులు బ్రహ్మశ్రీ గురు రాజ శర్మలు మాట్లాడుతూ కార్తీక మాసం శివకేశవులకు అత్యంత ప్రీతిపాత్రమైందని పరమ పవిత్రమైన ఈ మాసంలో మహిళలు దీపారాధన చేయడం వల్ల సకల శుభాలు కలుగుతాయన్నారు. శుక్రవారం సాయంత్ర నిర్వహించే శివపార్వతుల కళ్యాణం కార్యక్రమంలో మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని చెప్పారు..


## చౌటుప్పల్ క్యాంపు కార్యాలయంలో మరోమారు కంటి పరీక్షలు





**చౌటుప్పల్ వెలుతురు నవంబర్ 13:**
చౌటుప్పల్ మున్సిపాలిటీలో చౌటుప్పల్ మండలంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాలలో కంటి పరీక్షలు చేయించుకోలేని వారికి మరల గురువారం రోజున చౌటుప్పల్ లోని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారి వ్యక్తిగత క్యాంపు కార్యాలయంలో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు.. వ్యవసాయ పనుల దృష్ట్యా, వ్యక్తిగత కారణాల వల్ల మున్సిపాలిటీలో మండలంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాలకు హాజరు కాని వారికి గురువారం రోజున కంటి పరీక్షలు చేసుకునే అవకాశం కల్పించారు.. దీంతో చౌటుప్పల్ మండలంలోని పలు గ్రామాలు చౌటుప్పల్ పట్టణంలోని పలు వార్డుల నుండి క్యాంపు కార్యాలయానికి తరలివచ్చారు... 47 మంది కి డాక్టర్లు కంటి పరీక్షలు నర్వహించగా వారిలో 29 మంది ఆపరేషన్ కు ఎంపికయ్యారు.. ఆపరేషన్లకు ఎంపికైన వారిలో అనారోగ్య కారణాల వల్ల 3 గ్గురు వ్యక్తిగత కారణాల వల్ల మరో 5 గురు వెళ్లలేకపోయారు... మిగిలిన 19 మంది ని కంటి ఆపరేషన్ల కోసం వెంటనే హైదరాబాద్ కి తరలించారు.

## ఏఐసీసీ కార్యదర్శిగా నియమితులైన జెట్టి కుసుమకుమార్‌కు సన్మానించిన సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి



**జహీరాబాద్ వెలుతురు నవంబర్ 13:**
ఏఐసీసీ కార్యదర్శిగా నియమితులై, ఒడిశా రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జిగా బాధ్యతలు స్వీకరించిన జెట్టి కుసుమకుమార్ ని తెలంగాణ రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ యన్. గిరిధర్ రెడ్డి గురువారం వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి ఘనంగా సన్మానిస్తూ, నూతన బాధ్యతలపై శుభాకాంక్షలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి జెట్టి కుసుమకుమార్ చేసిన సేవలు, కృషిని గిరిధర్ రెడ్డి ప్రశంసించారు. ఒడిశా రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాలను సమర్థంగా నిర్వహించి పార్టీ అభివృద్ధికి మరింత తోడ్పడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి పాల్గొని జెట్టి కుసుమకుమార్ ని అభినందించారు.

# కోహిర్ మండల విద్యాధికారి పాఠశాలల తనిఖీ

**- స్పెషల్ క్యాంపెయిన్ 5.0 కార్యక్రమంపై దృష్టి**





**జహీరాబాద్ వెలుతురు నవంబర్ 13:**
డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు సంగారెడ్డి జిల్లా కోహిర్ మండల విద్యాధికారి మొహమ్మద్ జాకీర్ హుస్సేన్ గురువారం మండలంలోని పలు పాఠశాలలను సందర్శించారు. స్పెషల్ క్యాంపెయిన్ 5.0 కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో క్లీనింగ్, స్క్రాప్ రిమూవల్, వేస్ట్ మెటీరియల్ తొలగింపు వంటి చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ యూపీఎస్ బడంపేట్, యూపీఎస్ పైడిగుమ్మల్, ఎంపీపీఎస్ లాల్‌సింగ్ తండా పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల పరిశుభ్రతను పరిశీ లించి, పనులు సమర్థవంతంగా పూర్తి చేసిన ప్రధానో పాధ్యాయులు శ్రీనివాస్, తిరుమలేష్, రామోజీరావు ను అభినందిం చారు. డైరెక్టర్ ఆదేశాల మేరకు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక అధికారులు ప్రతి జిల్లాలో 10 మండలాలను ఆకస్మికంగా తనిఖీ చేయాలని సూచించినట్లు ఎంఈఓ తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రతి పాఠశాల పరిశుభ్రత, వేస్ట్ మెటీరియల్ తొలగింపుపై ప్రధానోపాధ్యాయులు పూర్తి బాధ్యత వహించా లని ఆయన సూచించారు. అలాగే రేపు అనగా నవంబర్ 14న జరగనున్న పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (PTM) ను విజయవంతంగా నిర్వహించాలని ఎంఈఓ సూచించారు. PTM లో చర్చించిన అంశాలను Telangana School Education App లో 100 శాతం నమోదు చేయాలని ఆదేశించారు. ఈ అంశాలపై CRP లతో ఫిజికల్ మీటింగ్ కూడా ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

# ఘనంగా పడమటి ఆంజనేయ స్వామి జాతర

**- అన్నిశాఖల సమన్వయంతో జాతరకు వచ్చే ప్రజలకు సౌకర్యాలు కల్పించాలి**

**- అధికారుల సమీక్షా సమావేశంలో మంత్రి వాకిటి శ్రీహరి**







**మక్తల్ వెలుతురు నవంబర్ 13:**
నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గంలో మక్తల్ పట్టణంలో డిసెంబర్ 2 న ప్రారంభం కాబోయే పడమటి ఆంజనేయస్వామి జాతర పనులపై రాష్ట్రమంత్రి వాకిటి శ్రీహరి ఆలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు డిసెంబర్ 2న ప్రారంభమై 9వ తేదీ వరకు కొనసాగుతుందని మంత్రి తెలిపారు. 3వ తేదీ రోజు ప్రభోత్సవం, 4వ తేదీన రథోత్సవం, 5న పాల ఉట్ల ఉత్సవాలు జరుగుతాయని తెలియజేశారు. ఈ నెల 30 న ఆలయ సమీపంలో పునర్నిర్మించబడిన పడమటి ఆంజనేయస్వామి కోనేరుకు యజ్ఞ యాగాది పూజలు నిర్వహిస్తామని మంత్రి తెలిపారు. ఈ పూజల తర్వాత కోనేరులోనుండి తెచ్చిన నీటితో మొదటగా ఆంజనేయస్వామికి స్నానాభిషేకాలు నిర్వహిస్తామని తెలియజేశారు. భక్తులందరూ కోనేరులో స్నానం ఆచరించిన తర్వాత ఆంజనేయస్వామిని దర్శించుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కోనేరు పునర్నిర్మాణానికి కృషి చేసిన కల్పనకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. కల్పన తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఉన్న కోనేరులను పునర్నిర్మాణం చేయడానికి అమెరికా నుండి వచ్చిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్రంలో ఉన్న కోనేరులను బాగు చేయాలనే ఒక టీంలో తాను కూడా భాగస్వామ్యం కావాలని కోరుకుంటున్నానని మంత్రి తెలిపారు. పడమటి ఆంజనేయస్వామి పై ఉన్న భక్తితో తాను కోనేరు పునర్నిర్మాణం కోసం బడ్జెట్ ఆలస్యమైనా కూడా సొంత ఖర్చుతో పునర్నిర్మాణం పూర్తి చేశానని గుర్తు చేశారు. ఇందుకు సహకరించి కోనేరు చుట్టూ ఇండ్లు ఉన్నవారు వారి స్థలాలను కొంత కేటాయించినందుకు స్థానికులకు ధన్యవాదాలు తెలిపారు. జాతర అంగరంగ వైభవంగా జరగాలని పట్టణంలో జాతర ప్రాముఖ్యత,సంస్కృతి ఉట్టిపడేలా ఏర్పాట్లు ఉండాలని,జాతర జరిగినన్ని రోజులు పుర వీధులన్నీ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని,ప్రతి వంద మందికి ఒక మంచినీటి ట్యాంకర్ ఉండేలా చూసుకొని భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మున్సిపల్ అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. జాతర సమయంలో ఎక్కువగా సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో భద్రతాపరంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా పెంచాలని,ట్రాఫిక్ కు ఎలాంటి అంతరాయం కలగకుండా పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేయాలని,రథోత్సవానికి ఎక్కువగా భక్తులు పాల్గొంటారు కాబట్టి పటిష్టంగా ఏర్పాటు చేయాలని పోలీసుల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జాతరకు భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసి, మక్తల్ జాతర అనే స్టిక్కర్ అంటించి రవాణా సదుపాయం కల్పించాలని అధికారులకు స్పష్టం చేశారు. జాతర జరిగినన్ని రోజులు విద్యుత్ సరఫరాకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు. జాతర సందర్భంగా పనిచేసే ప్రతి వాలంటీర్ కి ఒక డ్రెస్ కోడ్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఆలయ సమీపంలో ఈసారి జాతరలో అయోధ్య రాముడి గుడి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ రాధా లక్ష్మారెడ్డి, ఆలయ ధర్మకర్త రాణేశాచారీ, ఎండోమెంట్ ఈ.వో కవిత, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రమశక్తి నీతి - 2025 నూతన లేబర్ పాలసీని వెంటనే ఉపసంహరించుకోవాలి

**- సిఐటియు జిల్లా అధ్యక్షుడు బీరం మల్లేష్ డిమాండ్...**





**జహీరాబాద్ వెలుతురు నవంబర్ 13:**
కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన "శ్రమశక్తి నీతి –2025" నూతన లేబర్ పాలసీ పూర్తిగా కార్మిక వర్గానికి వ్యతిరేకమైందని, దానిని వెంటనే ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు బీరం మల్లేష్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని శ్రామిక్ భవన్‌లో సిఐటియు ఆధ్వర్యంలో "నూతన లేబర్ పాలసీ – శ్రమశక్తి నీతి 2025: కార్మిక వర్గంపై దాడి" అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ, కేంద్ర బిజెపి ప్రభుత్వం దొడ్డిదారిన లేబర్ కోడ్స్ అమలు చేయడానికే ఈ నూతన పాలసీని తెచ్చిందని, ఇది కార్మికుల హక్కులను లుంగించడమేనని అన్నారు. 19 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చడం, కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా పెట్టుబడిదారుల చెంతకు అప్పగించడం వంటిదని ఆయన విమర్శించారు. శ్రమశక్తి నీతి పేరు గొప్పగా ఉన్నా, దాని సారాంశం మాత్రం కార్మికుల హక్కులను తాకట్టు పెట్టే విధంగా ఉందని ఆయన పేర్కొన్నారు. లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా సిఐటియు నేతృత్వంలో జరిగిన దేశవ్యాప్త సమ్మె ఫలితంగా అమలు ప్రక్రియను ప్రభుత్వం వెనక్కి తీసుకుందని గుర్తుచేశారు. దేశంలోని కేరళ వామపక్ష ప్రభుత్వం తప్ప ఇతర రాష్ట్రాలు 8 గంటల పని దినాన్ని 10 గంటలకు పెంచుతున్నాయన్నది దురదృష్టకరం అని పేర్కొన్నారు. కేరళ ప్రభుత్వం మాత్రం కార్మిక వ్యతిరేక కోడ్స్ అమలు చేయబోమని స్పష్టం చేసిందని అన్నారు. శ్రమశక్తి నీతి – 2025 అమలు చేస్తే, దేశంలోని కార్మిక వర్గం పై తీవ్ర ప్రభావం చూపి, ప్రజాస్వామ్యం మరియు సామాజిక న్యాయానికి దెబ్బతీస్తుందని హెచ్చరించారు. ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ (ILC) ను వెంటనే సమావేశపరచాలని, కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్చలు జరపాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మిక వర్గం ఐక్యంగా ముందుకు వచ్చి శ్రమశక్తి నీతి – 2025 నూతన లేబర్ పాలసీని ప్రతిఘటించాలని మల్లేష్ పిలుపునిచ్చారు. ఈ సెమినార్‌లో సిఐటియు జహీరాబాద్ పారిశ్రామిక క్లస్టర్ కన్వీనర్ ఎస్. మహిపాల్, నాయకులు నర్సయ్య, నరేష్, మహేశ్వర్, నందమ్మ, యశోదా, సందీప్ రెడ్డి, నారాయణ, బక్కన్న, వంశీ, బాలరాజు, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## సుస్థిర వ్యవసాయ దిశగా కె.వి.కెలో బయో రిసోర్స్ సెంటర్ స్థాపన

**- రైతులకు సూక్ష్మజీవాల పంపిణి...**





**జహీరాబాద్ వెలుతురు నవంబర్ 13:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ లోని డి.డి.ఎస్ – కె.వి.కె ఆధ్వర్యంలో, సుస్థిర వ్యవసాయ కేంద్రం హైదరాబాద్ వారు జెనీవా యూనివర్సిటీ, స్విట్జర్లాండ్ వారి ఆర్థిక సహకారంతో నడుపుతున్న "స్కేలింగ్ ఆగ్రో ఎకలాజికల్ ప్రాజెక్ట్" నిధుల ద్వారా కె.వి.కెలో బయో రిసోర్స్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఈ కేంద్రం ద్వారా వ్యవసాయంలో ఉపయోగపడే వివిధ సూక్ష్మజీవాల అభివృద్ధి చేయడం జరిగింది. పంటల్లో వేరుకుళ్లను నివారించడానికి ట్రైకోడెర్మా, మొక్కల ఎదుగుదలకు ఎన్‌పికె కన్సోర్షియం, రసం పీల్చే పురుగులను అరికట్టేందుకు బవేరియా బ్యాసియానా, లద్దె పురుగులను నివారించడానికి మెటారిజియం అనిసోప్లీయే వంటి సూక్ష్మజీవాలను తయారు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించి, సూక్ష్మజీవాల ప్రాముఖ్యత, వాటి వాడక పద్ధతులు, పంటలలో వాడే సరియైన పరిమాణాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జెనీవా యూనివర్సిటీ స్విట్జర్లాండ్ ప్రొఫెసర్ క్రిష్టఫర్ చేతుల మీదుగా రైతులకు సూక్ష్మజీవాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కె.వి.కె సిబ్బంది, సుస్థిర వ్యవసాయ కేంద్రం ప్రతినిధులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## ఏనుగుల సంచారంపై ముందస్తు హెచ్చరికలు

**- అటవీ అధికారులకు డిప్యూటీ సీఎం సూచన**




**అమరావతి,నవంబర్13( వెలుతురు):**
ఏనుగుల సంచారంపై ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. అటవీ ప్రాంతాలను ఆనుకొని ఉన్న గ్రామాలలోకి ఏనుగులు ప్రవేశించే పరిస్థితులు ఉత్పన్నమయ్యే అవకాశాలు ఉన్నప్పుడు ముందస్తు హెచ్చరికలు చేయాలన్నారు. ఈ పక్రియను మరింత పెంచాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. కుప్పం మండలంలోని వెంకటేశ్వరపురం గ్రామంలో కిట్టయ్య అనే వ్యక్తి ఏనుగు దాడిలో మరణించిన ఘటనపై పవన్ కళ్యాణ్ స్పందించారు. ఈ ఘటనపై పీసీసీఎఫ్, సంబంధిత అధికారులతో గురువారం ఉదయం డిప్యూటీ సీఎం చర్చించారు. కిట్టయ్య కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆ కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సాయాన్ని సత్వరమే అందించాలని ఆదేశాలు జారీ చేశారు. తమిళనాడు అటవీ ప్రాంతం వైపు నుంచి వచ్చిన ఏనుగు మూలంగా ఈ ఘటన చోటు చేసుకుందని, అక్కడ కూడా సదరు ఏనుగు మూలంగా మరణాలు సంభవించాయని పవన్‌కు అటవీ శాఖ అధికారులు వివరించారు. మన రాష్ట్ర అటవీ ప్రాంతంలోకి వస్తోందని ట్రాక్ చేసిన వెంటనే సమీప గ్రామాల వారికి ముందుగానే తెలియచేశామని చెప్పారు. దీనిపై పవన్ కళ్యాణ్ స్పందిస్తూ.. ముందస్తు హెచ్చరికలను మరింత విస్తృతం చేయాలన్నారు. గ్రామాలవారీగా నూ, రైతులతోనూ సోషల్ మీడియా గ్రూప్స్ ఏర్పాటు చేసి వాటికి టెక్ట్స్ మెసేజ్‌లతో పాటు, వాయిస్ మెసేజ్‌లు కూడా పంపిస్తే సమాచారం తొందరగా చేరుతుందని అధికారులకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సూచనలు చేశారు.

## అటవీ భూముల ఆక్రమణ వ్యవహారం

**- రుజువు చేయాలని ఎంపి మిథున్ సవాల్**



**చిత్తూరు,నవంబర్13( వెలుతురు):**
అటవీభూముల ఆరోపణలపై ఎంపి మిథున్ రెడ్డి స్పందించారు. విషయమై ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంపీ మిథున్ రెడ్డి కౌంటర్ అటాక్ ఇచ్చారు. తాజాగా ఆయన పలు విషయాలలో పవన్ కళ్యాణ్ ను పేర్కొంటూ 'ఎక్స్' లో పోస్ట్ చేశారు. పవన్ కళ్యాణ్ ఆరోపణలపై ఆయన తీవ్రంగా స్పందించారు. మిథున్ రెడ్డి ఈ పోస్టులో పవన్ కళ్యాణ్‌ను నేరుగా సవాల్ విసిరారు. ఆయన చేసిన పోస్ట్ లో.. పవన్ కళ్యాణ్ ను పేర్కొంటూ.. మీరు ఆరోపణలు చేసి తర్వాత వెనక్కి తగ్గడంలో నిపుణులు. ఇదే పని మీరు ఎర్రచందనం విషయంలో కూడా చేశారు. ఇప్పుడు మీరు హెలికాప్టర్ నుంచి చూపించిన భూమి మా చట్టబద్ధమైన సొత్తు. మేము ఆ భూమిని 2000 సంవత్సరంలో చట్టబద్ధంగా కొనుగోలు చేశాం అని మిథున్ రెడ్డి తెలిపారు. అలాగే, మీరు చేసిన ఆరోపణలు నిరూపించండి. ఆధారాలు ఉంటే బయటపెట్టండి. లేకపోతే ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేయవద్దని ఆయన హెచ్చరించారు.

## విజయవాడ నడిబొడ్డున దారుణం

**- సూర్యారావు పేటలో భార్యను హత్య చేసిన భర్త**

**- హంతకుడు విజయ్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు**



**విజయవాడ,నవంబర్13( వెలుతురు):**
విజయవాడలో దారుణ ఘటన చోటుచేసుకుంది. భార్యను కత్తితో నరికి హత్య చేసిన భర్త స్థానికులను భయాందోళనలకు గురి చేశాడు. ఈ సంఘటన గురువారం ఉదయం సూర్యారావు పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. అందిన సమాచారం ప్రకారం.. హత్యకు గురైన మహిళ సరస్వతీగా గుర్తించారు. ఆమె భర్త విజయ్ తో గత కొంతకాలంగా దాంపత్య జీవితం సజావుగా సాగడం లేదు. తరచూ చిన్నచిన్న విషయాలపై ఇద్దరి మధ్య వాగ్వాదాలు జరుగుతున్నాయని, ఇటీవల వీరిద్దరూ విడివిడిగా నివసిస్తున్నారని పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం విజయ్ కోపంతో భార్య ఉన్న చోటుకు వెళ్లి, కత్తితో ఆమెపై దాడి చేశాడు. ఈ ఘటనలో సరస్వతీ అక్కడికక్కడే మృతిచెందింది. హత్య అనంతరం కూడా విజయ్ కత్తితో వీరంగం సృష్టించాడని, స్థానికులు భయంతో దగ్గరికి రాలేకపోయారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఎవరైనా దగ్గరికి వస్తే చంపేస్తా అంటూ విజయ్ కేకలు వేయడంతో ప్రాంతం మొత్తం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తరువాత సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న సూర్యారావు పేట పోలీసులు నిందితుడు విజయ్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్యాభర్తల మధ్య కొనసాగుతున్న వ్యక్తిగత విభేదాలే ఈ హత్యకు కారణమని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.


## విశాఖలో పలు కంపెనీలకు లోకేశ్ శంకుస్థాపనలు

**విశాఖపట్నం,నవంబర్13( వెలుతురు):**
విశాఖ ఐటీ హిల్స్‌లో ఐటీ సహా పలు కంపెనీలకు మంత్రి లోకేశ్ భూమి పూజ చేశారు. సెయిల్స్ సాఫ్ట్‌వేర్, ఐస్పేస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, టెక్ తమ్మిన సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, ఫినోమ్ పీపుల్స్ లిమిటెడ్, రహేజా ఐటీ స్పేస్, రెసిడెన్షియల్ ప్రాజెక్ట్, వరల్డ్ ట్రేడ్ సెంటర్‌కు శంకుస్థాపన చేశారు. ఈ పరిశ్రమల ద్వారా రూ.వేల కోట్లు పెట్టుబడులు, వేలాది మందికి ఉద్యోగాలు లభించనున్నాయి.

# అటవీశాఖ భూముల ఆక్రమణ

**- పెద్దిరెడ్డిపై పవన్ ఆరోపణలతో హాట్ టాపిక్**

**- సర్వత్రా ఇదే అంశంపై చర్చ**



**అమరావతి,నవంబర్13( వెలుతురు):**
అటవీశాఖ మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై డిప్యూటీ సిఎ పవన్ కళ్యాణ్ చేసిన అటవీ భూ ఆక్రమణ ఇప్పుడు సంచలనంగా మారింది. సర్వత్రా ఇప్పుడు ఇదే అంశంపై చర్చిస్తున్నారు. ముఖ్యంగా తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ఈ వ్యవహారం హాట్ టాపిక్‌గామారింది. అలాగే దీనిపై పెద్ది రెడ్డి తనయుడు, ఎంపి మిథున్ రెడ్డి ఘాటుగా స్పందించారు. దీనిని రుజువు చేయాలన్నారు. శేషాచల అటవీ ప్రాంతంలో భూకబ్జాలపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేసిన బహిరంగ ఆరోపణలు రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీశాయి. జనసేన పార్టీ 'బిగ్ ఎక్స్‌పోజ్'గా ప్రచారం చేసిన ఈ విషయం ఇప్పుడు కొత్త మలుపు తిరిగింది. పవన్ కళ్యాణ్ ఇటీవల తిరుపతి పర్యటన సందర్భంగా.. మంగళంపేట అటవీ ప్రాంతంలోని అక్రమ ఆక్రమణలపై స్వయంగా పరిశీలన చేశారు. ఆయన ఏరియల్ వ్యూ వీడియోలు, మ్యాపింగ్‌లు, ఉపగ్రహ చిత్రాలతో కూడిన ఆధారాలను విడుదల చేశారు. ఈస్ట్ ఘాట్స్ పరిధిలోని రక్షిత అటవీ భూముల్లో సుమారు 76.74 ఎకరాల భూకబ్జా జరిగినట్లు అందులో పేర్కొన్నారు. ఈ భూములు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబానికి సంబంధించినవని పవన్ కళ్యాణ్ తన 'ఎక్స్' ఖాతా పోస్టులో తెలిపారు. ఈ ఘటనపై పవన్ కళ్యాణ్ సమగ్ర నివేదికను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు సమర్పించారు. రక్షిత అటవీ ప్రాంతంలో అక్రమ నిర్మాణాలు జరగడం చట్టవిరుద్ధమని పేర్కొంటూ దానిపై దర్యాప్తు అవసరమని సూచించారు. ఇకపోతే అడవి మధ్యలో ఉన్న భూమి అటవీశాఖ మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబానికి వారసత్వంగా ఎలా వచ్చిందని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రశ్నించారు. భూమి ఎప్పుడు చేతులు మారిందో తెలుసుకోవాలని, దీనిలో ఎవరి పాత్ర ఎంతనే దానిపై నివేదికలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. పుంగనూరు నియోజకవర్గం మంగళంపేటలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి, ఆయన కుటుంబ సభ్యుల చేతిలోని 104 ఎకరాల అటవీ భూములపై పవన్‌కల్యాణ్ అటవీశాఖ ఉన్నతాధికారులతో చర్చించారు. మంగళంపేటలో సర్వే నంబర్లు 295, 296లో అసలు భూమి విస్తీర్ణం ఎంత, అది కాలానుగుణంగా ఎలా పెరిగిందనేది కీలకమైన అంశం. సర్వే నంబర్లు సబ్ డివిజన్ చేసి అటవీ భూములను ప్రణాళిక ప్రకారం కలిపేసుకున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. ఇదంతా ఎలా జరిగిందనే అంశంపై దృష్టి పెట్టాలన్నారు. రక్షిత అటవీ భూముల్లో ఆస్తులు కబ్జా చేసి ఎస్టేట్‌లు నిర్మించిన వాళ్లు ఎంతటి వారైనా ఉపేక్షించకుండా చట్ట ప్రకారం ముందుకెళ్లాలి. భూములు ఆక్రమించిన వారి వివరాలు అటవీశాఖ వెబ్‌సైట్‌లో పెట్టాలి. వారిపై కేసులు ఏ స్థితిలో ఉన్నాయనే వివరాలు ప్రజలకు తెలియాలన్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో పాటు ఆయన కుమారుడు మిథున్‌రెడ్డి 2024 ఎన్నికల్లో అటవీ భూములపై అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం అందించారన్న విషయం నా దృష్టికి వచ్చింది. ఈ అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకోండి. భూ రిజిస్ట్రేషన్ రికార్డుల ప్రకారం 40.80 ఎకరాలు వారి ఆధీనంలో ఉంటే.. వెబ్‌ల్యాండ్‌లోకి వచ్చే సరికి 77.54 ఎకరాలుగా చూపారు. ఒకేసారి ఎందుకు ఇంత పెరిగిందన్నది పరిశీలించాలన్నారు. మంగళంపేట అటవీ భూముల ఆక్రమణపై విజిలెన్స్ నివేదిక ఎంతో కీలకం. పెద్దిరెడ్డి కుటుంబం ఆక్రమించిన భూముల పూర్తి వివరాలు అందులో ఉన్నాయి. వాటిని ప్రాతిపదికగా తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

# నేడు బీహార్ ఎన్నికల ఫలితాలు

**- ఎగ్జిట్ పోల్ ఫలితాలు ఫలిస్తాయా**

**- మరోమారు నితీశ్ సిఎం అయ్యేనా**




**పాట్నా,నవంబర్13( వెలుతురు):**
దేశవ్యాప్తంగా ఉత్కంఠ రేపుతున్న బిహార్ ఎన్నికల ఫలితాలు శుక్రవారం విడుదల కానున్నాయి. సీఎం నితీశ్ కుమార్ తన అధికారాన్ని నిలబెట్టుకుంటారా? లేదా? అనేది నేటితో తేలిపోతుంది. ఎగ్జిట్ పోల్ సర్వేల ప్రకారం మళ్లీ ఎన్‌డిఎ గెలుస్తుందని ప్రకటించారు. అయితే దీనిని తేజస్వియాదవ్ కొట్టి పారేశారు. సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా చేసి రికార్డు నెలకొల్పిన నితీశ్ కుమార్ ఈసారి గెలిస్తే సరికొత్త చరిత్ర సృష్టించిన వారవుతారు. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం కానుంది. ఓట్ల లెక్కింపు కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఎన్నికల సంఘం ఇటీవల తెలిపింది. కౌంటింగ్ సెంటర్లలో రెండంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశామని వెల్లడించింది. మొదటి భద్రతా వలయంలో కేంద్ర పారామిలిటరీ దళాలు, ఆ తరువాత రాష్ట్ర పోలీసు బలగాలతో పహారాను ఏర్పాటు చేసినట్టు తెలిపింది. 24/7 సీసీటీవీ నిఘా కూడా ఉంటుందని వెల్లడించింది. ఇక ఓట్లు భద్రపరిచిన ప్రతి స్ట్రాంగ్ రూమ్ క్యాంపస్ వద్ద జిల్లా సీనియర్ అధికారుల పర్యవేక్షణలో ఓ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. జిల్లా ఎలక్షన్ ఆఫీసర్లు, రిటర్నింగ్ ఆఫీసర్లు స్టాం÷-రగ్ రూమ్‌లను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని ఈసీ ఆదేశించింది. ఈసారి ఎన్నికల్లో ఓటింగ్ భారీ స్థాయిలో నమోదైన విషయం తెలిసిందే. 243 అసెంబ్లీ నియోజకవర్గాలకు నవంబర్ 6, 11 తేదీల్లో రెండు దశల్లో ఓటింగ్ నిర్వహించగా రికార్డు స్థాయిలో 67.13 శాతం మేర పోలింగ్ జరిగింది. దీంతో, ప్రజాతీర్పుపై ఉత్కంఠ పతాకస్థాయికి చేరుకుంది. ఈ ఎన్నికల్లో ఎన్డీయే క్లీన్ స్వీప్ చేస్తుందని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. ప్రతిపక్ష మహాగఠ్‌బంధన్ కూటమి నేత తేజస్వీ యాదవ్ మాత్రం ఈ అంచనాలను కొట్టిపారేశారు. తమ కూటమి మంచి మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని అన్నారు.సీఎం నితీశ్ సారథ్యంలోని జేడీ(యూ), బీజేపీతో సహా ఎన్డీయే (ఔఅం) కూటమిలోని ఐదు పార్టీలు బరిలో నిలిచాయి. జేడీ(యూ), బీజేపీలు 101 నియోజకవర్గాల్లో తమ అభ్యర్థులను బరిలోకి దింపాయి. ఇక ఆర్‌జేడీ, కాంగ్రెస్, సీపీఐ(ఎమ్ఎల్) లిబరేషన్, ఇతర లెఫ్ట్ పార్టీలు, వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీలు మహాగఠ్‌బంధన్‌గా (మహాకూటమి) ఏర్పడి ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నాయి.

# డాక్టర్ షాహీన్ వ్యవహారంపై కుటుంబం ఆశ్చర్యం

**- ఇంతకాలం తమకు ఎలాంటి అనుమానం లేదన్న తండ్రి**

**- కుటుంబం లక్నోలో ఉంటుండగా పోలీసుల విచారణ**


**- ఆమె గురించి తనకు పెద్దగా తెలియదన్న మాజీ భర్త**



**న్యూఢిల్లీ,నవంబర్13( వెలుతురు):**
ఢిల్లీ పేలుళ్ల ఘటనకు కారణమైన కీలక నిందితుల్లో ఒకరైన డాక్టర్ షాహీన్ పట్ల ఆమె కుటుంబ సభ్యులు మాట్లాడిన తీరు విస్మయం వ్యక్తం చేస్తోంది. షాహీన్‌కు ఉగ్రవాదులతో సంబంధాలున్నాయనే విషయాన్ని నమ్మలేకపోతున్నామని.. కనీసం అలాంటి సంఘటనకు సంబంధించిన ఆనవాళ్లు కూడా తెలియవని ఆమె కుటుంబ సభ్యులు వాపోతున్నారు. ప్రస్తుతం తాము లక్నోలోని దాలిగంజ్ ప్రాంతంలోని ఓ ఇరుకైన సందులో నివాసముంటున్నామని, తాముండే ప్రాంతానికి ఢిల్లీకి సుమారు 550 కిలోమీటర్ల దూరం ఉంటుందని షాహీన్ తండ్రి సయ్యద్ అహ్మద్ అన్సారీ అన్నారు. ఢిల్లీలో జరిగిన పేలుడు కేసులో షాహీన్‌కు సంబంధముందని, జైష్-ఎ-మహమ్మద్ ఉగ్రవాద సంస్థతో కలిసి పనిచేస్తోందనే ఆరోపణలపై ఆమె అరెస్ట్ కావడం కలిచివేస్తోందని వాపోయారు. ఎలాంటి అనుమానాలు తమకు లేవని అన్నారు.. ఆమె ఉగ్రవాదులతో కలిసి పనిచేస్తుందని విని షాక్ తిన్నా. ఇటీవలే అనగా దాదాపు నెల క్రితం నేను ఆమెతో మాట్లాడాను. ఆమె అలహాబాద్‌లో వైద్య విద్య పూర్తి చేసి, ఫరీదాబాద్‌లో పనిచేస్తోందని అన్సారీ తెలిపారు. షాహీన్ సోదరుడు మహమ్మద్ షోయబ్ మాట్లాడుతూ.. 'షాహీన్‌కు ఉగ్రవాదులతో సంబంధాలున్నాయంటే నమ్మలేకపోతున్నాం. ఆమె ఢిల్లీలో అరెస్టయ్యాక.. ఇటీవల పోలీసులు, భద్రతా దళ సిబ్బంది మా ఇంటికి వచ్చారు. వారు నాతో సహా మా కుటుంబంలో ఎవ్వరినీ ఇబ్బందులకు గురిచేయలేదు. గత నాలుగేళ్లుగా షాహీన్ మాకు దూరంగా ఉంటోంది. కానీ ఆమె పిల్లలతో మా అమ్మానాన్నలు అప్పుడప్పుడూ మాట్లాడుతుండేవారు. లఖ్‌నవూలోని ఐఐఎం రోడ్డులో షాహీన్‌కు ఓ ఇల్లుందని తెలుసు. మేమెప్పుడూ అక్కడికి వెళ్లలేదు. కనీసం అదెక్కడుందో, ఎలా ఉందో కూడా మాకు తెలీదు. మెడిసిన్ చదివేటప్పుడు ఆమె ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలకు పాల్పడినట్టు కూడా అనిపించలేదు. అలాంటిది ఆమెకు ఉగ్రవాదులతో లింకులు ఉన్నాయంటే ఇప్పటికీ నమ్మలేక పోతున్నాం.' అని వివరించారు. ఢిల్లీ పేలుడు ఘటన తర్వాత కాన్పూర్‌లో ఆప్తమాలజిస్ట్‌గా పనిచేస్తున్న షాహీన్ మాజీ భర్త డా.జాఫర్ హయత్‌ను పోలీసులు విచారించారు. 'షాహీన్ అరెస్టైన విషయం నాకూ మంగళవారమే తెలిసింది. మేమిద్దరం విడివిడిగా మెడిసిన్ పూర్తిచేశాం. నేను ఆమెకు సీనియర్‌ని. 2003లో మాకు పెళ్లయింది. ఇద్దరు పిల్లలున్నారు. 2012లో మేం విడాకులు తీస్కున్నాం. అయితే మా మధ్య ఎప్పుడూ గొడవలు రాలేదు. విడాకుల తర్వాత ఆమెతో నేనెప్పుడూ మాట్లాడలేదు. అసలు ఆమె పెళ్లిళ్లలో తప్ప ఎప్పుడూ కనీసం బురఖా కూడా ధరించేది కాదు. అలాంటిది ఆమెకు ఉగ్రవాద కార్యకలాపాలతో ప్రమేయం ఉందంటే నమ్మలేకపోతున్నాను.' అని హయత్ చెప్పారు. షాహీన్.. అప్పట్లో విదేశాల్లో స్థిరపడాలని తరచూ అంటుండేదని ఆయన తెలిపారు. అయితే.. ఆమె భారత్‌లోనే ఉన్నట్టు ఇటీవలే తెలిసిందన్నారు.వైద్యురాలైన షాహీన్ గురించి విచారణ చేపట్టిన దర్యాప్తు బృందం పలు విషయాలు వెల్లడించింది. 2013లో జీవీఎస్ఎమ్ మెడికల్ కాలేజీ నుంచి ఆమె ఎలాంటి సమాచారం లేకుండా అదృశ్యమైందని, ఫలితంగా కాలేజీ యాజమాన్యం ఆమెను తొలగించినట్టు తెలిపింది. ఆల్-ఫలాహ్ విశ్వవిద్యాలయంలో చేరాక.. ఆమెకు డా.ముజామ్మిల్ గనైతో పాటు ప్రస్తుతం అరెస్టైన మరో ఇద్దరు వైద్యులతో పరిచయం ఏర్పడిందని అధికారుల దర్యాప్తులో తేలింది.

## విశాఖలో ట్రేడ్ సెంటర్‌కు శంకుస్థాపన

**వేలాదిమందికి ఉద్యోగావకాశాలు వస్తాయని వెల్లడి**



**విశాఖపట్నం,నవంబర్13( వెలుతురు):**
విశాఖ ఐటీ హిల్స్‌లో ఐటీ సహా పలు కంపెనీలకు మంత్రి లోకేశ్ భూమి పూజ చేశారు. సెయిల్స్ సాఫ్ట్‌వేర్, ఐస్పేస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, టెక్ తమ్మిన సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, ఫినోమ్ పీపుల్స్ లిమిటెడ్, రహేజా ఐటీ స్పేస్, రెసిడెన్షియల్ ప్రాజెక్ట్, వరల్డ్ ట్రేడ్ సెంటర్‌కు శంకుస్థాపన చేశారు. ఈ పరిశ్రమల ద్వారా రూ.వేల కోట్లు పెట్టుబడులు, వేలాది మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. మంత్రితో పాటు సెయిల్స్ సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్ సీఈవో, ఎండీ కిరణ్, ఫినోమ్ పీపుల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కో ఫౌండర్ హరి బైరెడ్డి, ఐ స్పేస్ సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్ సీఈవో రమేష్‌లు కార్యక్రమంలో పాల్గొన్నారు. రూ.21 కోట్లతో సెయిల్ సంస్థ ఏర్పాటు చేసే ఏఐ ఎక్స్‌లెన్స్ సెంటర్ ద్వారా 430మందికి ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు ఎండీ కిరణ్ వెల్లడించారు. డిజిటల్ ఆంధ్రప్రదేశ్, ఇండియా ఏఐ మిషన్ లక్ష్యాలకు అనుగుణంగా ఏఐ, క్లౌడ్ టెక్నాలజీలను ఉపయోగించి అత్యాధునిక ఎంటర్ ప్రైజ్ సొల్యూషన్స్‌పై సెయిల్స్ సాఫ్ట్ వేర్ సంస్థ దృష్టిసారించనుంది. విశాఖ ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, ప్రభుత్వ ఉన్నతాధికారులు కార్యక్రమానికి హాజరయ్యారు. విశాఖ యూనిట్‌పై రెండుదశల్లో రూ.207.5 కోట్లు పెట్టుబడి పెట్టి.. 2,500 మందికి ఉద్యోగాలు కల్పించనున్నట్లు హరి బైరెడ్డి వెల్లడించారు. అడ్వాన్స్ ప్రొడక్ట్ డెవలప్‌మె, ఏఐ రీసెర్చి, కస్టమర్ డెలివరీ ఎక్స్‌లెన్స్‌పై ఫినోమ్ దృష్టి సారించనుంది. 3 దశల్లో రూ.119.18 కోట్లు పెట్టుబడి పెట్టి, 2వేలమందికి ఉద్యోగాలు కల్పించనున్నట్లు ఐ స్పేస్ సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్ సీఈవో రమేష్ తెలిపారు. రాష్ట్రంలో ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, మెయింటెనెన్స్ సర్వీసెస్, ఐటీ సొల్యూషన్స్, ఐటీఓ సేవల డెలివరీ కార్యకలాపాలను ఐ స్పేస్ సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్ సంస్థ చేపట్టనుంది.

## ప్రభుత్వ టీచర్లు టెట్ పాస్ కావాల్సిందే

**- స్పష్టం చేసిన తెలంగాణ ప్రభుత్వం**



**హైదరాబాద్, నవంబర్13( వెలుతురు):**
టీచర్లకు ప్రభుత్వం షాక్ ఇచ్చింది. తెలంగాణలో ఇకపై సర్వీస్ టీచర్లు సైతం టెట్ క్వాలిఫై కావాల్సిందేనని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అందుకు సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం శుక్రవారం జారీ చేయనుంది. దీంతో ఇకపై టీచర్లు సర్వీస్‌లో ఉండాలన్నా.. ప్రమోషన్లు పొందాలన్నా టెట్ క్వాలి÷ తప్పనిసరి అని ఈ సందర్భంగా ప్రభుత్వం స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు టెట్ నిబంధనలను తెలంగాణ విద్యా శాఖ సవరణ చేసింది. 2009 తర్వాత నియమితులైన 30 వేల మంది టీచర్లకు ఈ నిబంధన వర్తించనుంది. రానున్న రెండేళ్లలో సర్వీసులో ఉన్న టీచర్లంతా ఈ టెట్ పాస్ కావాల్సిందేనన్నది సుస్పష్టం. మరోవైపు.. టెట్ నోటిఫికేషన్‌ను గురువారం తెలంగాణ విద్యా శాఖ విడుదల చేసింది. నవంబర్ 15వ తేదీ నుంచి ఈ దరఖాస్తులను అభ్యర్థుల నుండి స్వీకరిస్తారు. నవంబర్ 29వ తేదీతో ఈ దరఖాస్తులు స్వీకరణ ముగియనుంది. జనవరి 3 నుంచి 31వ తేదీ వరకు టెట్ పరీక్షలు నిర్వహిస్తారు. కాగా.. ఈ ఏడాదికి సంబంధించి తొలి విడత టెట్ నోటిఫికేషన్ గత జూన్‌లో ప్రభుత్వం విడుదల చేసింది. ఇప్పటికే ఈ పరీక్షల ఫలితాలు.. జులై 22న వెల్లడయ్యాయి. తాజాగా గురువారం రెండో విడత టెట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులంతా ఈ టెట్‌లో అర్హత సాధించాలంటూ ఇప్పటికే సుప్రీంకోర్టు సంచలన తీర్పును వెలువరించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో తమ ఉద్యోగాల్లో కొనసాగాలంటే.. ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న టీచర్లంతా ఈ పరీక్ష పాస్ కావాల్సి ఉంది.

## కౌంటర్ దాఖలు చేయడంలో నిర్లక్ష్యం

**- ప్రభుత్వం తీరుపై మండిపడ్డ హైకోర్టు**

**హైదరాబాద్, నవంబర్13( వెలుతురు):**
తెలంగాణ ప్రభుత్వంపై హైకోర్టు సీరియస్ అయింది. చాలా కేసుల్లో నిర్దేశిత గడువులోపు.. కౌంటర్ దాఖలు చేయడం లేదని ప్రభుత్వంపై మండిపడింది. వికారాబాద్ జిల్లాలో నేవీ రాడార్ స్టేషన్ కేసు విచారణ సందర్భంలో తెలంగాణ హైకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. తదుపరి విచారణ డిసెంబర్ 12కు వాయిదా వేసిన హైకోర్టు.. డిసెంబర్ 12లోపు కౌంటర్ దాఖలు చేయకుంటే.. ప్రభుత్వానికి జరిమానా విధిస్తామని హైకోర్టు హెచ్చరించింది.

## వికారాబాద్లో విద్యార్థికి విద్యుత్ షాక్ - పరిస్థితి విషమం



**వికారాబాద్ నవంబర్13 ( వెలుతురు):**
వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని గంగారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఘోర ప్రమాదం జరిగింది. పాఠశాల ప్రహరీ గోడకు ఆనుకుని ఎలాంటి రక్షణ కంచ లేకుండా ఏర్పాటు చేసిన 33 కె.వి ట్రాన్స్ఫార్మర్ కారణంగా మూడవ తరగతి విద్యార్థి వంశీ తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం ప్రకారం, మధ్యాహ్న భోజన విరామ సమయంలో వంశీ పాఠశాల బయటకు వెళ్లినప్పుడు ట్రాన్స్ఫార్మర్ వైర్లను తాకడంతో విద్యుత్ షాక్ తగిలి చేతులు, కాళ్లు కాలిపోయాయి. తలకు గాయాలు కావడంతో పాటు ముక్కు నుండి రక్తం కారింది. వెంటనే స్పందించిన పాఠశాల సిబ్బంది, స్థానికులు గాయపడిన విద్యార్థిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అక్కడ చిన్నపిల్లలకు అవసరమైన వైద్య సదుపాయాలు, డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో జిల్లా, మండల అధికారులతో సంప్రదించి విద్యార్థిని స్థానిక ప్రైవేట్ ఆసుపత్రి ఈశాకు తరలించారు. ప్రస్తుతం వంశీ పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. పాఠశాల వద్ద నిర్లక్ష్యంగా ఉన్న ట్రాన్స్ఫార్మర్పై తల్లిదండ్రులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై కలెక్టర్ తక్షణ చర్యలు తీసుకుని విద్యార్థికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఆపరేషన్ సింధూర్ 2.0 షురూ...

**న్యూఢిల్లీ, నవంబర్13( వెలుతురు):**
ఢిల్లీలోని ఎర్రకోట వద్ద గత సోమవారం ఉగ్రదాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో 12 మంది భారతీయులు చనిపోయారు. 20 మందికి పైగా గాయపడ్డారు. వీరంతా కూడా ఢిల్లీలో చికిత్స పొందుతున్నారు. వారందరినీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పరామర్శించారు.. భూటాన్ పర్యటన నుంచి స్వదేశానికి వచ్చిన ఆయన నేరుగా బాంబు పేలుడు క్షతగాత్రులను పరామర్శించారు.. ఈ సందర్భంగా ఆయన ఉగ్రవాదులకు గట్టి హెచ్చరికలు పంపారు. ఎట్టి పరిస్థితుల్లో ఈ దారుణానికి పాల్పడిన వారికి కఠిన శిక్ష తప్పదని స్పష్టం చేశారు.ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ మాటలు మాట్లాడిన వెంటనే జమ్ము కాశ్మీర్ లో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. ఇండియన్ ఆర్మీ జమ్ము కాశ్మీర్లోని సుమారు 300 ప్రాంతాలలో సెర్చ్ ఆపరేషన్లు మొదలుపెట్టింది. అంతేకాదు జమాత్ ఈ ఇస్లామి అనే ఉగ్రవాద సంస్థతో సంబంధం ఉన్న వ్యక్తుల గృహాలలో తనిఖీలు చేసిన ఆర్మీ అధికారులు.. ఉగ్రవాదులకు సంబంధించిన కీలక సమాచారాన్ని.. ఇతర పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. పలువురిని అదుపులోకి తీసుకున్నారు. వారందరిని కూడా అధికారులు విచారిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ విచారణలో ఉగ్రవాదులకు సంబంధించిన కీలక సమాచారాన్ని ఆర్మీ అధికారులు సేకరించినట్టు తెలుస్తోంది. ఆ వ్యక్తుల బ్యాంకు ఖాతాలు.. వాడుతున్న ఫోన్ నెంబర్లు.. ఎవరెవరితో మాట్లాడుతున్నారు.. అనే విషయాలను ఆర్మీ అధికారులు సేకరించారని తెలుస్తోంది.ఆపరేషన్ సిందూర్ సమయంలో కూడా ఇండియన్ ఆర్మీ ఇలానే చేసింది.. అత్యంత ఖచ్చితమైన ఆధారాలతో ఆపరేషన్ చేసింది. ఉగ్రవాదుల స్థావరాలను నేలమట్టం చేసింది.. కేవలం ఉగ్రవాదులు మాత్రమే నష్టపోయే విధంగా కూల్చివేతలు చేపట్టింది. దీంతో పాకిస్తాన్లో స్థావరాలు ఏర్పాటు చేసుకొని ఉగ్రవాద కార్యకలాపాలు సాగిస్తున్న సంస్థలు తీవ్రంగా నష్టపోయాయి. ఇప్పుడు కూడా భారత ఆర్మీ అప్పటి మాదిరిగానే దూకుడుగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో ఆపరేషన్ సిందూర్ 2.0 మొదలైందని.. ఉగ్రవాద దేశంపై దాడి షురూ అవుతుందని విశ్లేషకులు చెబుతున్నారు.భూటాన్ వేదికగా జరిగిన కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఉగ్రవాదులకు సూటిగా.. స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. ఆయన స్వదేశానికి రాగానే పరిస్థితి మారిపోయింది. ఇండియన్ ఆర్మీ జమ్మూ కాశ్మీర్ మొత్తాన్ని జల్లెడ పడుతోంది. అనుమానాస్పద వ్యక్తులను ప్రశ్నించి వదిలేస్తోంది. అంతేకాదు సున్నితమైన ప్రాంతాలలో నిఘా ను మరింత పటిష్టం చేసింది.

## జూబ్లీ ఓటమి ఎఫెక్ట్...
## నామమాత్రంగా మిగిలిన కమలం





**హైదరాబాద్, నవంబర్13( వెలుతురు):**
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఎవరి అంచనాలు వారు వేసుకుంటున్నారు. విజయంపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ వాతావరణం తారస్థాయికి చేరుకుంది. పోలింగ్ అనంతరం విడుదలైన ఎగ్జిట్ పోల్స్ పార్టీ వార్ రూమ్‌లలో నూతన చర్చలకు దారితీశాయి. చాలా సర్వేలు కాంగ్రెస్ అభ్యర్థికి ఊతం ఇచ్చి, బీఆర్ఎస్‌కు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో గెలుపోటములు ఎవరిపై ప్రభావం చూపుతాయన్న చర్చ కూడా జరుగుతోంది.ప్రతిష్ఠాత్మక ఉర్దూ మీడియా సంస్థ 'సియాసత్' వెల్లడించిన అంచనా ప్రకారం కాంగ్రెస్ ఓటింగ్ శాతం 48గా, బీఆర్ఎస్ 42గా నమోదైంది. ఇదే సమయంలో 'డెక్కన్ క్రానికల్' మాత్రం బీఆర్ఎస్ వైపు మొగ్గుచూపింది. రెండు అంచనాలు భిన్నంగా ఉన్న నేపథ్యంలో తుది ఫలితాలను ఊహించడం కష్టతరంగా మారాయి. ఈసారి జూబ్లీహిల్స్‌లో ఓటింగ్ శాతం 50 దాటకపోవడం కీలకంగా మారింది. సాధారణంగా తక్కువ పోలింగ్ అధికార పార్టీకి అనుకూలంగా పనిచేస్తుంది. వ్యతిరేకత ఉన్నప్పుడు ఎక్కువ ఓటింగ్ నమోదవడం విపక్షానికి అనుకూలంగా ఉంటుంది. తాజాగా పోలింగ్ కాంగ్రెస్ ఉత్సాహాన్ని బీఆర్ఎస్‌లో టెన్షన్ పెంచింది.ఈ ఉప ఎన్నికలో బీజేపీ నామమాత్రంగా పోటీ చేసినప్పటికీ, ప్రభావం పరిమితంగానే కనిపించింది. 2023లో 3.6 శాతం ఓటు పొందిన ఈ పార్టీ, ఈసారి 6 నుంచి 7 శాతం వరకు పెరగవచ్చని సర్వే సంస్థలు సూచించాయి. అయినా, ప్రధాన పోరు కాంగ్రెస్ మరియు బీఆర్ఎస్ మధ్యే సాగిందని రాజకీయ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయిముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్ పోరులో తన వ్యక్తిగత ప్రతిష్ఠను పణంగా పెట్టారు. అజారుద్దీన్‌కు మంత్రిపదవి ఇచ్చిన నిర్ణయం కూడా వ్యూహాత్మకంగా భావిస్తున్నారు. ప్రత్యేకంగా ఎంఐఎం నేత అసదుద్దీన్ ఓవైసీతో రేవంత్ చర్చించి ముస్లిం ఓట్లు కాంగ్రెస్ వైపు మళ్లేలా చేశారు. గత ఎన్నికల్లో ఎంఐఎం అభ్యర్థిగా ఎన్నికల బరిలో ఉన్న నవీన్ యాదవ్ ఈసారి పోటీ చేయకపోవడం ఆ వ్యూహానికి అనుకూలమైంది.బీఆర్ఎస్ ఈ ఉప ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. మాగంటి సునీత అభ్యర్థిత్వం, ప్రచారం ఇవన్నీ కేటీఆర్ సమన్వయంతో జరిగాయి. అయితే ఫలితాలు ప్రతికూలంగా రాకుండా ఉండాలనే భయం పార్టీలో కనిపిస్తోంది. కేటీఆర్ భవిష్యత్ రాజకీయ భూమికను ఈ ఫలితం ప్రభావితం చేయవచ్చని పార్టీ వర్గాల అభిప్రాయం. ఓటమిని ముందే ఊహించిన గులాబీ బాస్ కేసీఆర్.. సునీతకు ఓటు వేయమని కనీసం ప్రకటన కూడా విడుదల చేయలేదు.జూబ్లీహిల్స్‌లో ఇంతవరకు కాంగ్రెస్ విజయం సాధించిన సందర్భం లేదు. టీడీపీ, బీఆర్ఎస్‌లు మాత్రమే వరుసగా గెలిచాయి. ఈసారి కాంగ్రెస్ విజయవంతమైతే, రేవంత్‌రెడ్డి రాజకీయ బలం కొత్త దిశగా మార్పు అవుతుంది. ఇది భవిష్యత్తు తెలంగాణ రాజకీయ సమీకరణాలను కూడా ప్రభావితం చేసే అవకాశం ఉంది.

## ఉగ్రవాదులుగా మహిళలు! జైష్ మహమ్మద్ కుట్ర అదే..

**న్యూఢిల్లీ, నవంబర్13( వెలుతురు):**
ఉగ్రవాదం.. ఈ ఉన్మాదమైన చర్యకు కేవలం మగవాళ్ళు మాత్రమే పాల్పడతారనే విషయం అందరికీ తెలుసు. ఉగ్రవాదులు కేవలం మగవాళ్ళు మాత్రమేనని.. వారు మాత్రమే అత్యంత కరుడుగట్టిన వ్యక్తిత్వంతో ఉంటారని.. సాటి మనుషులను అత్యంత దారుణంగా చంపేస్తారని అందరికీ తెలిసిందే. గతంలో జరిగిన సంఘటనలు.. ఇటీవల కాలంలో చోటు చేసుకున్న పరిణామాలు కూడా వీటినే నిరూపించాయి. ఇప్పుడు ఉగ్రవాదంలోకి ఆడవాళ్లు కూడా వస్తున్నారు. ముఖ్యంగా భారత్ అంటే తీవ్రస్థాయిలో మండిపడే జైష్ ఏ మహమ్మద్ అనే ఉగ్రవాద సంస్థ ఆడవాళ్లను ఉగ్రవాదులుగా మార్చుతోంది. వారిని వైట్ కాలర్ ఉగ్రవాదులుగా రూపొందించి మన దేశం మీదకి వదులుతోంది. ఢిల్లీ ఘటన తర్వాత.. మన దేశ పోలీసులు ఇద్దరు మహిళా టెర్రరిస్టులను అరెస్ట్ చేసిన తర్వాత దిగ్భ్రాంతికరమైన వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి.జై షే మహమ్మద్ సంస్థ భారత దేశంలో ఉగ్ర కార్యకలాపాలను మరింత విస్తరించడానికి మహిళలను రంగంలో విధించుతోంది. ఐసిస్, బోకో హారం, హమాస్, ఎల్టీటీఈ వంటి సంస్థలు ఆత్మహుతి దాడులకు మహిళలను ఉపయోగిస్తాయి. లష్కర్ ఏ తోయిబా, జై ష్ ఏ మహమ్మద్ వంటి సంస్థలు మాత్రం మహిళలకు ఇటువంటి అవకాశాన్ని ఇవ్వవు. వారిని కేవలం పడక సుఖం కోసం మాత్రమే ఉపయోగించుకుంటాయి. కానీ ఈసారి జై ష్ ఏ మహమ్మద్ అనే సంస్థ మాత్రం తన మార్గాన్ని మార్చుకుంది.. ఈ సంస్థ అధినేత మసూద్ అజర్ సోదరుడు తల్హా విభిన్నంగా ఆలోచించడం మొదలుపెట్టాడు. అతడి ఆదేశాల మేరకే యుద్ధ రంగంలోకి మహిళలను తీసుకోవడం మొదలుపెట్టారు.ఉగ్ర కార్యకలాపాలు సాగించే మహిళలకు "జమాత్ ఉల్ మోమినత్ " అనే పేరు పెట్టారు. ఈ దళానికి జైష్ అధినేత మసూద్ సోదరి సాదియా అజర్ నాయకత్వం వహిస్తోంది. ఇప్పటికే ఈ దళంలో ఉగ్రవాదుల భార్యలు చాలామంది చేరిపోయారు. వీరంతా కూడా ఆత్మాహుతి దాడులకు నేతృత్వం వహించే దిశగా శిక్షణ పొందినట్టు తెలుస్తోంది. వీరు ఇతర మహిళలకు కూడా శిక్షణ ఇస్తున్నట్టు సమాచారం. ఆపరేషన్ సిందూర్ లో భాగంగా భారత దళాలు పాకిస్థాన్లో జైష్ ఉగ్రవాద సంస్థ కార్యాలయాలపై దాడులు చేశాయి. ఈ దాడుల్లో సాదియా భర్త కన్నుమూశాడు. అప్పటినుంచి ఆమె భారత్ మీద తీవ్రస్థాయిలో ద్వేషం పెంచుకుంది. అందువల్లే పేద మహిళలను తన బృందంలో చేర్చుకుంటున్నది.పాకిస్తాన్లోని బహవల్పూర్, కరాచీ, హరీ పూర్, ముజఫర్బాద్, కోట్లి, మాన్సిరా వంటి ప్రాంతాలలో ఉన్న మహిళలను తన బృందంలోకి చేర్చుకుంటున్నది. సోషల్ మీడియా, వాట్సప్, ఇతర మార్గాల ద్వారా రిక్రూట్ చేసుకోవడానికి ప్రయత్నాలు చేస్తోంది. జమ్ము కాశ్మీర్, యూపీలో ఉన్న పేద ముస్లిం మహిళలను లక్ష్యంగా చేసుకొని తన ఉగ్రవాద దళంలోకి తీసుకుంటున్నట్టు తెలుస్తోంది. ఫరీదాబాద్ ప్రాంతంలో పోలీసులకు చిక్కిన ఇద్దరు మహిళ ఉగ్రవాద డాక్టర్లు ఈమె దళానికి చెందిన వారిని తెలుస్తోంది. ఇంటెలిజెన్స్ వర్గాలకు పూర్తిస్థాయిలో సమాచారం ఉండడంతో మహిళా ఉగ్రవాదులపై కన్నేసినట్టు తెలుస్తోంది.

## మహారాష్ట్ర నుంచి ఆదిలాబాద్ సరిహద్దు.. ఆవాసం కోసం పులుల సంచారం..!

**అదిలాబాద్, నవంబర్13( వెలుతురు):**
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సరిహద్దుల్లో పెద్దపులుల సంచారం అలజడి కలకలం రేపుతున్నాయి. మహారాష్ట్ర సరిహద్దులోని తిప్పేశ్వర్ పులుల అభయారణ్యం నుండి పెన్ గంగానదీ తీరం దాటి తెలంగాణ సరిహద్దు దాటి ఆదిలాబాద్ జిల్లాలో ప్రవేశిస్తూ రైతుల్లో వణుకు పుట్టిస్తున్నాయి. అటు కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సరిహద్దుల్లో తడోబా అభయారణ్యం నుండి జిల్లాలోకి పులులు సంచరిస్తున్నాయి. గత కొద్ది రోజులుగా ఇక్కడే తిష్టవేసి పశువులు, మేకల గుంపులపై దాడి చేసి హతమారుస్తున్నాయి.కొన్ని రోజుల క్రితం ఆదిలాబాద్ భీంపూర్ మండలంలోని సరిహద్దు గ్రామాల్లో పత్తి చేనులో పులి కనిపించింది. కొందరు రైతులు ధైర్యంగా సెల్ ఫోన్ లో పులి ఫోటోలు తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. అక్కడి పరిసర ప్రాంతాల్లో పులి కదలికలతో పత్తి ఏరే రైతులు కూలీలు భయాందోళనకు గురయ్యారు. పొలాల్లో రైతులు టపాసులు కాల్చి పనులు చేస్తున్నారు. అక్కడ నుంచి వెళ్ళిన పులి సరిహద్దులో గల బోథ్ మండలంలోని నిగిని, కంటెగాం, రఘునాథ్ పూర్, అజ్జర్, వజ్జర్, చింతల్ బోరి, డేద్రా అటవీ శివారు గ్రామాల్లో సంచరిస్తోంది. అయితే పెద్దపులి అలికిడికి గ్రామాలన్ని వణికిపోతున్నాయి.సరిహద్దు మహారాష్ట్రలోని చికిలి, శివిని, డాంకి, ఈసాపూర్, ఘన్ పూర్ మీదుగా ఓ ఆడపులి సంచరిస్తూ రైతుల్లో హడలెత్తిస్తుంది. అయితే పెంపుడు జంతువులైన ఆవులు, గేదెలు, మేకలను ఈ పెద్దపులి వేటాడి చంపినప్పుడే పులిజాడ నీడలు బయటపడుతున్నాయి. సామాన్య ప్రజలు, రైతులు పత్తి పంట చేనులోకి వెళ్లి పలు సందర్భాల్లో పెద్దపులిని చూసి బీతిల్లిపోవడం ఈవిషయాన్ని అటవీ అధికారులకు సమాచారం అందించడం జరుగుతుంది. ఇదివరకే సరిహద్దులోనీ కంటెగాం, రఘునాథ్ పూర్, నిగిని ప్రాంతాల్లో



అటవీ సిబ్బంది పెద్దపులి కదలికలపై అన్వేషణ సాగిస్తూ పాదముద్రలు సేకరిస్తున్నారు. మరోవైపు అటవీ శాఖ అధికారులు పులి పాదముద్రలు సేకరించి ట్రాప్ కెమెరాలను పెట్టీ పులి కదలికలపై నిఘా పెంచారు. రైతులు మాత్రం ఉదయం సాయంత్రం పూటల్లో పంట చేలకు వెళ్లవద్దని, పగలు వెలుతురున్నప్పుడు పంట చేలకు గుంపులు గుంపులుగా వెళ్లాలని, పెద్దపులి కనిపిస్తే అరుపులు కేకలతో హాడావుడి చేయాలని ఆటవీ అధికారులు సూచిస్తన్నారు. ఈ విషయమై బోథ్ అటవీశాఖ రేంజ్ అధికారి ప్రణయ్ పులి సంచారం వాస్తవమేనన్నారు. ప్రతీ ఏటా అక్టోబర్, నవంబర్, డిసెంబర్ మాసాల్లో ఆదిలాబాద్ జిల్లా సరిహద్దుల్లో పెద్దపులి సంచరించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ మాసాల్లోనే మేటింగ్ కోసం అనువైన వాతావరణం ఉంటుందన్నారు. పులి ఆవాసం కోసం ఈ ప్రాంతానికి తరచూ వస్తూ పోవడం ఈ కాలంలో శరమాములేనని, వ్యవసాయ పనుల్లో ఉండే కూలీలు రైతులు అప్రమత్తంగా ఉండేలా వారికి అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. పులి కదలికలపై ఎప్పటికప్పుడు పాదముద్రలు సేకరించి ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని పులి సంచరించే ప్రాంతాల్లో రైతులు ప్రజలు అప్రమత్తంగా ఉండి గుంపులు గుంపులుగా ఉండాలన్నారు ఉదయం నుంచి సాయంత్రం వరకు తమ పనులు చేసుకుని వెళ్లాలని పులికి ఎలాంటి హాని చేయకూడదని ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. అయితే ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని సరిహద్దు అటవీ ప్రాంతంలో ఆడపులి జిల్లాలోని భీంపూర్ మండల సరిహద్దుల్లోనీ అటవీ ప్రాంతంలో మగపులి కదలికలు మేటింగ్ కోసమేనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పైగా ఆవాసానికి అనువైన ప్రదేశం కావడంతో తిప్పేశ్వర్ అభయారణ్యం దాటి జిల్లాలోకి ప్రవేశిస్తున్నాయన్నాయి. ఇటీవల భీంపూర్ మండలంలోని తాంసి (కె) గ్రామ శివారులో గొంటిముక్కల అశోక్ పత్తి చేనులో పెద్దపులిని చూసి పరుగు పరుగున గ్రామానికి చేరుకున్నారు. పులి కదలికలను పసిగట్టి సెల్ ఫోన్ లో చిత్రీకరించారు. తాంసి (కె)గొల్లఘాట్, అర్లి, భగవాన్ పూర్ వడగాం, సరిహద్దు గ్రామాల్లో మగపులి చేస్తుంది. పత్తి, సోయాబిన్ రైతులు పంట చేతికి వచ్చే దశలో చేనుకు వెళ్లా లంటేనే భయంతో వణికిపోతున్నారు. దట్టమైన అటవీ ప్రాంతాల్లో ఆవాసం అనువుగా ఉండటం, మరోవైపు వణ్య ప్రాణుల సంఖ్య పెరుగడంతో పెద్దపులుల రాకపోకలు ఈ ప్రాంతాల్లో పెరిగిపోయాయి.అటు కుమ్రం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని పెంచికల్ పేట్, కౌటాల, దేహెగాం, కాగజ్ నగర్ అటవీ ప్రాంతాల్లోనూ పెద్ద పులులు సంచరిస్తున్నాయి. పులులు సంచరించే ప్రాంతాల్లో అటవీశాఖ అధికారులు పాదముద్రలను సేకరిస్తూ ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేస్తూ రైతులు కూలీలకు అవగాహన కల్పిస్తున్నారు. గ్రామాల్లో డప్పు చాటింపు సైతం నిర్వహిస్తూ అప్రమత్తం చేస్తున్నారు.

## కొత్త రైల్వే లైన్ కు లైన్ క్లియర్




**మహబూబ్ నగర్, నవంబర్13( వెలుతురు):**
మహబూబ్‌నగర్– డోన్ రైల్వే లైన్ డబ్లింగ్ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. త్వరలోనే భూసేకరణ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే రైళ్ల రాకపోకలు మెరుగుపడటంతో పాటు సరకు రవాణా సామర్థ్యం పెరిగి, దక్షిణ తెలంగాణ ప్రాంత అభివృద్ధికి దోహదపడుతుంది.ప్రయాణికులకు శుభవార్త. మహబూబ్‌నగర్– డోన్ రైల్వే లైన్ డబ్లింగ్ ప్రాజెక్టు పనులు వేగవంతం కానున్నాయి. ఈ కీలక ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియ ప్రారంభించడానికి కేంద్ర ప్రభుత్వం బుధవారం అధికారికంగా ఆమోదం తెలిపింది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే ఒక గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. రైల్వే చట్టం, 1989లోని సెక్షన్ 20ఏ ప్రకారం.. ఈ రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టు కోసం భూములు ప్రజా ప్రయోజనాలకు అత్యవసరం అని కేంద్ర ప్రభుత్వం నిర్ధారించింది. ఈ నిర్ణయం ద్వారా మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో అవసరమైన భూములను సేకరించేందుకు రైల్వే శాఖకు అధికారికంగా మార్గం సుగమమైంది.నోటిఫికేషన్ జారీ అయిన తేదీ నుంచి 30 రోజుల వ్యవధిలోగా భూముల యజమానులు తమ అభ్యంతరాలను రాతపూర్వకంగా సమర్పించవచ్చు. ఈ అభ్యంతరాలను సంబంధిత రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్, మహబూబ్‌నగర్ కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుంది. సమర్పించిన అభ్యంతరాలు, ఇతర వివరాలను అధికారులు పూర్తిగా సమీక్షించిన తర్వాతే భూసేకరణపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఈ ప్రక్రియ పారదర్శకంగా, చట్టబద్ధంగా పూర్తి చేయాలని రైల్వే శాఖ ఆదేశించింది.మహబూబ్‌నగర్–డోన్ మార్గం దక్షిణ భారతదేశంలోని ముఖ్యమైన రైల్వే కారిడార్లలో ఒకటి. ఇది తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలను కలుపుతుంది. సింగిల్ లైన్ కావడం వల్ల ఈ మార్గంలో రైళ్ల రాకపోకలకు జాప్యం జరిగేది, ముఖ్యంగా రద్దీ సమయాల్లో రైళ్లు గంటల తరబడి నిలిచిపోయే పరిస్థితి ఉండేది. దక్షిణ మధ్య రైల్వే తెలిపిన వివరాల ప్రకారం.. ఈ డబ్లింగ్ ప్రాజెక్టు ముఖ్యంగా రెండు ప్రధాన లక్ష్యాలను సాధించడానికి ఏర్పాటు చేస్తున్నారు. డబ్లింగ్ పూర్తయితే ఈ మార్గంలో అదనపు ప్యాసింజర్ రైళ్లను నడపవచ్చు. ప్రస్తుతం ఉన్న రైళ్ల ప్రయాణ సమయం తగ్గుతుంది. వేగంగా, సమయానికి రైళ్లు గమ్యస్థానాలకు చేరుకోగలుగుతాయి. ఈ మార్గం ద్వారా బొగ్గు, సిమెంట్, ఆహార ధాన్యాల వంటి సరకు రవాణా జరుగుతుంది. డబ్లింగ్‌తో సరకు రవాణా సామర్థ్యం గణనీయంగా పెరుగుతుంది, తద్వారా స్థానిక పరిశ్రమలకు, వాణిజ్య కార్యకలాపాలకు ఊతం లభిస్తుంది.ఈ ప్రాజెక్టు మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు దక్షిణ తెలంగాణ ప్రాంత అభివృద్ధికి దోహదపడుతుంది. మెరుగైన రైలు కనెక్టివిటీ వల్ల ఈ ప్రాంతంలో పారిశ్రామిక, వాణిజ్య కార్యకలాపాలు పెరిగే అవకాశం ఉంది. అంతేకాకుండా, ప్రాజెక్టు నిర్మాణ సమయంలో స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఈ డబ్లింగ్ పనులు పూర్తయితే.. దక్షిణ భారతం వైపు వెళ్లే రైల్వే నెట్‌వర్క్ మరింత పటిష్టమవుతుందని రైల్వే అధికారులు భావిస్తున్నారు.

## విశాఖ సీఐఐ సదస్సుకు అన్ని ఏర్పాట్లు పూర్తి

**- బాబు, లోకేశ్ కృషితో భారీగా పెట్టుబడులు**

**- మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి**



**విశాఖపట్నం,నవంబర్13( వెలుతురు):**

విశాఖ సీఐఐ సదస్సుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. గత 5 ఏళ్ళ వైసీపీ అరాచక పాలనతో రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందన్నారు. కూటమి పాలనతో రాష్ట్ర అభివృద్ధిలో నూతన అధ్యాయం మొదలైందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజనరీ నాయకత్వంపై నమ్మకంతో రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులు వస్తున్నాయని చెప్పారు. ఊహించినదానికంటే ఎక్కువగా పెట్టుబడులు వస్తున్నాయన్నారు. రాష్ట్ర యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 17 నెలల్లోనే చంద్రబాబు, లోకేష్ కృషితో ఇప్పటి వరకు రూ.9.5 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు.. ప్రభుత్వం పట్ల ప్రజల్లో, పెట్టుబడిదారుల్లో ఒక నమ్మకం, విశ్వాసం కలిగించారన్నారు. రాష్ట్ర యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. గూగుల్ సంస్థ దేశంలోనే తొలిసారి డేటా సెంటర్ విశాఖలో ఏర్పాటు చేస్తున్నారంటే ఇది రాష్ట్రానికి గర్వకారణమని అన్నారు. లోకేష్ శ్రమకు ఫలితంగా, విశాఖలో గూగుల్ 15 బిలియన్ డాలర్ల (రూ.1.33 లక్షల కోట్లు) పెట్టుబడులు పెట్టబోతోందన్నారు. రాష్ట్రానికి పెట్టుబడుల సాధనలో మంత్రి లోకేష్ ది కీలక పాత్ర అని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి వెల్లడించారు. 14,15న జరగబోయే సీసీఐ పార్టనర్షిప్ సమ్మిట్ రాష్ట్ర రూపురేఖలు మార్చనుందని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. రాష్ట్ర జీడీపీని పెంచడంలో దోహదం చేస్తుందన్నారు. వేగంగా బిజినెస్ చేయాలనుకునే వారు ఏపీని గమ్యస్థానంగా ఎంచుకుంటున్నారు. పెట్టుబడులన్నీ గ్రౌండ్ అయ్యే విధంగా కాలానుగుణ కార్యాచరణ కూడా చేపడతామని చెప్పారు. ఉద్యోగాల కల్పనకు పరిశ్రమలకు భూములిస్తుంటే వైసీపీ దుర్మార్గపు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. వారి హయాంలో అన్ని భూ కబ్జాలు.. భూ దోపిడీలే అంటూ వ్యాఖ్యలు చేశారు. అందుకే అప్పుడు పారిపోయిన కంపెనీలు తిరిగి ఇప్పుడు వస్తున్నాయని మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు

## బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం

**- ఆర్టీసికి 400 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం**



**అమరావతి ,నవంబర్13( వెలుతురు):**

సూపర్ సిక్స్‌లో భాగంగా స్త్రీ శక్తి పథకాన్ని గత ఆగస్టు నెల నుంచి ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని ప్రతి మహిళకూ ఉచిత ఆర్టీసీ ప్రయాణ సౌకర్యం కల్పిస్తూ ఆర్థిక భరోసాను కల్పిస్తోంది. ఈ మేరకు ఆగస్టు 15 నుంచి అక్టోబర్ వరకూ ఈ పథకానికైన ఖర్చును ఏపీఎస్ ఆర్టీసీకి చెల్లిస్తూ కూటమి సర్కార్ ఆదేశాలు జారీ చేసింది. మహిళల జీరో ఫేర్ టికెట్ల ఖర్చుకు సంబంధించిన రూ.400 కోట్ల అదనపు నిధులు విడుదల చేసింది చంద్రబాబు సర్కార్. రెండున్నర నెలల్లో మహిళలకు టికెట్లు జారీ చేసిన మొత్తాన్ని ఆర్టీసీకి చెల్లించింది. తదుపరి చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ ఎండీకి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. మేరకు రవాణాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. స్త్రీశక్తి పథకం కోసం ఆర్టీసీకి నిధులు విడుదల చేయడంపై ఆర్టీసీ ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు ఆర్టీసీ ఎన్ఎంయూఏ, అలాగే ఆర్టీసీ కార్మిక పరిషత్ నేతలు కృతజ్ఞతలు తెలిపారు.

## మళ్లీ పెరిగిన బంగారం ధరలు

**- 3వేలకు పైగా పెరిగిన బంగారం**



**హైదరాబాద్,నవంబర్13( వెలుతురు):**

బంగారం, వెండి ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛమైన 10 గ్రాముల పసిడి ధర ఒక్కరోజే దాదాపు రూ.3 వేలకు పైగా పెరిగి రూ.1,31,500కు చేరుకుంది. 22 క్యారెట్ల పుత్తడి ధర ధర రూ.1,17,150 పలుకుతోంది. కిలో వెండి ధర ఒక్కరోజే రూ.10వేలకు పైగా పెరిగి రూ.1,71,300కు చేరింది. అంతర్జాతీయంగా మార్కెట్‌లో పసిడి ధర ఔన్సు మళ్లీ 4200 స్థాయిని దాటి 4,218 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. వెండి ఔన్సు 54.10 డాలర్ల వద్ద కొనసాగుతోంది. దీన్ని అనుసరించి దేశీయంగా బంగారం, వెండి ధరలు పెరిగాయి. అమెరికా చరిత్రలో అత్యధిక కాలం పాటు కొనసాగిన ప్రభుత్వ షట్‌డౌన్ ఎట్టకేలకు ముగిసింది. దీంతో ఆర్థిక కార్యకలాపాలు ఎప్పటిలానే యథావిధిగా కొనసాగనున్నాయి. ముఖ్యంగా ఎకనామిక్ డేటా వెలువడనుంది. దీంతో అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల కోతకు మార్గం సుగమం కానుంది. ఈ కారణంతోనే బంగారం ధర పెరుగుతోందని విశ్లేషకులు చెబుతున్నారు. దీనికితోడు డాలర్ ఇండెక్స్ బలహీన పడడం, సెంట్రల్ బ్యాంకుల నుంచి కొనుగోళ్లు ఎప్పటిలానే కొనసాగుతుండడం కూడా పసిడి డిమాండ్‌కు కారణమని పేర్కొంటున్నారు.

# 2047కి ప్రపంచంలోనే అగ్రస్థానంలో భారతదేశం

**- విశాఖను మోస్ట్ లివబుల్ సిటీగా తీర్చిదిద్దుతున్నాం**

**- విశాఖ ఎకనామిక్ రీజియన్ సదస్సులో చంద్రబాబు**




**విశాఖపట్నం,నవంబర్13( వెలుతురు):**

విశాఖను మోస్ట్ లివబుల్ సిటీగా తీర్చిదిద్దుతున్నామని.. ప్రధాని మోదీ కూడా ఏపీ అభివృద్ధికి సహకరిస్తున్నారని ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పారు. 2038 నాటికి భారత్ రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుందన్నారు. భారతదేశం 2047కి ప్రపంచంలోనే అగ్రస్థానంలోకి రావటాన్ని ఎవరూ ఆపలేరని కూడా చంద్రబాబు తెలిపారు. ఞాష్ట్ర అభివృద్ధి కోసమే ఓ విజన్ తయారు చేసుకుని అమలు చేస్తున్నామని, దేశంలోని నాలుగు నగరాలకు విజన్ తయారు చేయాలని కేంద్రం నిర్దేశించిందని చంద్రబాబు చెప్పారు. విశాఖ ఎకనామిక్ రీజియన్ సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ వ్యాఖ్యలు చేశారు. ముంబై, వారణాసి, సూరత్, విశాఖల అభివృద్ధికి ఈ సరికొత్త విజన్ అమలు చేయాలని కేంద్రం నిర్ణయించిందని చంద్రబాబు అన్నారు.అక్షర క్రమంలో, అభివృద్ధి పోటీలో ఏపీనే ఎప్పుడూ ముందుంటుందని చంద్రబాబు ఈ సందర్భంగా అన్నారు. 'సాగర తీరాన ఉన్న విశాఖ నగరం దేశంలోనే అత్యంత సుందరమైన ప్రాంతం. గత పాలకులు రాష్ట్రాన్ని.. దాని అభివృద్ధిని సర్వనాశనం చేశారు. అందుకే కూటమిగా ప్రజల మద్దతుతో పునర్నిర్మాణం చేస్తున్నాం. రూ.2.66 లక్షల కోట్ల ఎంఓయూలు సీఐఐ పార్టనర్షిప్ సమ్మిట్ కంటే ముందే చేశాం. 17 నెలల్లోనే రాష్ట్రానికి 20 లక్షల కోట్ల పెట్టుబడులు తేగలుగుతున్నాం.' అని చంద్రబాబు అన్నారు. 'గూగుల్ డేటా సెంటర్ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడులతో వస్తోంది. అనకాపల్లిలో దాదాపు రూ.1 లక్ష కోట్లతో స్టీల్ ఎ÷-లాంట్ రాబోతోంది. 9 జిల్లాలతో ఏర్పాటు చేస్తున్న విశాఖ ఎకనామిక్ రీజియన్ భవిష్యత్ ఆర్థిక శక్తిగా ఏపీని నిర్దేశిరచే ఓ మోడల్. ఈ ఎకనామిక్ రీజన్ సీఈఓ గా.. ఇండస్ట్రీ సెక్రెటరీ యువరాజు వ్యవహరిస్తారు. విశాఖను గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ డెస్టినేషన్, సుస్థిర అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దుతున్నాం. విశాఖ ఎకనామిక్ రీజియన్ అథారిటీకి చైర్మన్ హోదాలో నేనే స్వయంగా అభివృద్ధిని పర్యవేక్షిస్తాను.' అని చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో రూ. 2.66 లక్షల కోట్ల ఎంఓయూలు సీఐఐ భాగస్వామ్య సదస్సు కంటే ముందే చేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు (వెల్లడించారు. 9 జిల్లాలతో ఏర్పాటు చేస్తున్న విశాఖ ఎకనామిక్ రీజియన్ భవిష్యత్ ఆర్థిక శక్తిగా.. ఏపీని నిర్దేశిరచే ఓ మోడల్ కానుందన్నారు.విశాఖ ఎకనామిక్ రీజియన్ డెవలప్‌మెంట్ డాక్యుమెంట్‌ను ముఖ్యమంత్రి , నీతిఆయోగ్ సీఈఓ సుబ్రహ్మణ్యం విడుదల చేశారు. 17 నెలల్లోనే రాష్ట్రానికి రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు తేగలుగుతున్నామని పేర్కొన్నారు. విశాఖను గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ డెస్టినేషన్, సుస్థిర అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. విశాఖపట్నం ఇండస్ట్రియల్ రీజియన్ మాస్టర్ ఎ÷-లాన్-2040కు రూపకల్పన చేశామని, తూర్పుతీరంలో వీఈఆర్ దేశ ఆర్థిక ప్రగతికి గేట్వగా పనిచేస్తుందని తేల్చిచెప్పారు. విశాఖ ఎకనామిక్ రీజియన్ అథారిటీకి చైర్మన్ హోదాలో తానే స్వయంగా నెలకోసారి అభివృద్ధిని సమీక్షిస్తానని తెలిపారు.

## ద వైల్డ్ ఈస్ట్ బుక్ చదవి షాక్ గురయ్యా

**- ఎర్రచందనం అక్రమాలపై అందులో బాగా రాశారు**

**- డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ వెల్లడి**

**అమరావతి,నవంబర్13( వెలుతురు):**

ఎర్రచందనం అక్రమ రవాణా పై తాను చదివిన ఓ పుస్తకం ఎంతో ఆశ్చర్యానికి గురి చేసిందని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. అక్రమ రవాణాలో ఓ వ్యక్తి తనను తాను ఎలా కింగ్ పిన్‌లా మార్చుకున్నాడో చూసి షాక్ అయినట్లు తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు పవన్. 'కొంతకాలం క్రితం నేను ది వైల్డ్ ఈస్ట్ చదవడం మొదలుపెట్టాను. ఆ పుస్తకంలోని వివరాలు ఎంతో ఆశ్చర్యకరమైనవి. ఈ పుస్తకం శేషాచలం ప్రాంతం, తూర్పు కనుమలలో ఎర్రచందనం దోపిడీ గురించి చెబుతుంది. మన విలువైన సహజ వనరులను వ్యవస్థ ముందే ఎలా దోచుకున్నారో చూపిస్తుంది. రాజకీయాల వెనుక దాక్కున్న కొంతమంది నాయకులు పూర్తి స్థాయి మాఫియా బాస్‌లాగా ఎలా వ్యవహరించారో ఇది వెల్లడిస్తుంది. వారిలో ఒక పాత్ర నా దృష్టిని ఆకర్షించింది. దాదాపు ఒక సినిమాలాగా ఎర్రచందనంపై దురాశతో అధికారాన్ని వాడుకుని ఓ చిన్న కాంట్రాక్టర్ మొత్తం నేర సామ్రాజ్యాన్ని ఎలా నిర్మించాడో చూపించాడు రచయిత. మీరు ఆ పుస్తకం చదివినప్పుడు, నేరాన్ని అర్థం చేసుకోలేరు. భూమి, అడవులు, ప్రకృత, ప్రజలపై ద్రోహాన్ని అనుభవిస్తారు' అని పవన్ కల్యాణ్ తెలిపారు. కాగా, గత శనివారం నాడు



తిరుపతి మంగళంలో ఎర్రచందనం గోడౌన్లను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పరిశీలించారు. గ్రేడ్ల వారీగా ఎర్రచందనం వివరాలను అధికారులను అడిగి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలుసుకున్నారు. స్మగ్లింగ్‌కు గురికాకుండా ఎర్రచందనాన్ని కాపాడేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఉన్నతాధికారులతో చర్చించారు. వైసీపీ పాలనలో రూ.5వేల కోట్ల మేర ఎర్రచందనం స్మగ్లింగ్ జరిగి ఉంటుందని ఆరోపించారు. దాదాపు లక్షా 30 వేల చెట్లను నరికేశారని తెలిపారు. స్మగ్లింగ్‌ను అరికట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని.. ఆ చెట్లను అందరం కలిసి కాపాడుకోవాలని ఉన్నతాధికారులకు సూచించారు. అందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ సైతం ఏర్పాటు చేసిన విషయాన్ని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గుర్తు చేశారు.

## గూగుల్‌కుతో డిటిసిఎస్ కూడా వస్తోంది

**- విశాఖలో మంత్రి లోకేశ్ వెల్లడి**

**విశాఖపట్నం,నవంబర్13( వెలుతురు):**




విశాఖపట్నంలో త్వరలో 30 వేల ఉద్యోగాలు రానున్నాయని ఆంధ్ర ప్రదేశ్ ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ వెల్లడిం చారు. గురువారం విశాఖప ట్నంలో మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ.. గూగుల్ సెంటర్ ఏర్పాటుకు చాలా కష్టపడ్డామని చెప్పారు. గూగుల్ మన రాష్ట్రానికి రావడానికి కేంద్రం సహకా రం సైతం ఉందని తెలిపారు. విశాఖకు త్వరలో టీసీఎస్ కూడా రానుందన్నారు. కేవలం టీసీఎస్ కాకుండా ఇతర కంపెనీలను తీసుకువస్తున్న ట్లు ఆయన వివరించారు. అలాగే తూర్పు, పశ్చిమ గోదా వరి జిల్లాల్లో ఆక్వా పరంగా అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో తనపై భారీ మెజారిటీతో గెలిచిన వాళు ఇక్కడే ఉన్నారన్నారు. పార్లమెంట్ పరంగా చూసుకుంటే స్థానిక ఎంపీ భరత్ అత్యధిక మెజార్టీతో గెలిచారని గుర్తు చేశారు. అన్ని రంగాల్లో ఆంధ్రప్రదేశ్ నెంబర్ వన్ స్థానంలో నిలిచింద న్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హైద్రాబా ద్‌ను ఎలా అభివృద్ధి చేశారో.. అదే విధంగా ఆంధ్రప్రదే శ్‌ను సైతం చేసి చూపిస్తారని తెలిపారు. మొన్న జరిగిన యోగాంధ్ర అద్భుతంగా నిర్వహించి నట్లు వివరించారు. త్వరలోనే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించ బోతున్నామని తెలిపారు.


## పెద్దిరెడ్డి భూ అక్రమణలు నిజమే

**- త్వరలోనే దానిని స్వాధీనం చేసుకుంటాం**

**- అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ చలపతిరావు**

**అమరావతి,నవంబర్13( వెలుతురు):**

మాజీమంత్రి పెద్దిరెడ్డి కుటుంబం అటవీ భూముల కబ్జా నిజమేనని అటవీశాఖ నిర్ధారించింది. దానిని స్వాధీనం చేసుకుంటామని తెలిపింది. ఏపీలో పలుచోట్ల అటవీ భూములను అన్యాక్రాంతం చేశారని అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ చలపతిరావు అన్నారు. ఆక్రమణలు గుర్తించి, స్వాధీనం చేసుకునేందుకు కమిటీలు వేసినట్లు చెప్పారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అటవీ భూముల కబ్జాపై గురువారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. చిత్తూరు జిల్లా మంగళంపేటలో 32.63 ఎకరాల భూమి కబ్జాకు గురైనట్లు కమిటీ నిర్ధరించిందని చెప్పారు. ఆ భూమిని స్వాధీనం చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కొన్ని రిట్ పిటిషన్లపై కోర్టులో వాదనలు జరుగుతున్నాయని, ఎక్కడ ఆక్రమణలు ఉన్నా స్వాధీనం చేసుకుంటామని చెప్పారు. అక్రమార్కులను ప్రోత్సహించిన అధికారులపైనా చర్యలు తప్పవన్నారు. పెద్దిరెడ్డి కుటుంబసభ్యుల అధీనంలో అటవీ భూములున్నాయి. ఆయన పేరిట 15 ఎకరాలు, ఇందిరమ్మ పేరిట 10.8 ఎకరాలు, మిథున్‌రెడ్డి పేరుతో 21 ఎకరాలు,



పి.ఇందిరమ్మ పేరిట 9.8 ఎకరాలు ఉన్నాయి. పెద్ది రెడ్డి కుటుంబ సభ్యుల పేర్లతో 74 ఎకరాల వరకు ఉన్నాయి. ఈ భూములకు ఆనుకొని ఉన్న 32.63 ఎకరాల అటవీ భూములను పెద్దిరెడ్డి కుటుంబం ఆక్రమించుకుంది. అటవీ భూముల్లో మామిడి, ఉద్యాన పంటలు సాగు చేశారు. అటవీ భూముల్లో పంటలను పూర్తిగా తొలగించాం. ఆక్రమణదారులపై కేసులు నమోదు చేశాం, కోర్టులో విచారణ జరుగుతోంది. అటవీ భూముల వివరాలు వెబ్‌ల్యాండ్‌లో పెట్టాలని డిప్యూటీ సీఎం పవన్ ఆదేశించారు. సర్వే పూర్తి చేసి స్థలాల వివరాలతో వెబ్ ల్యాండ్‌లో పెడతాం. అటవీ భూముల ఆక్రమణపై కమిటీ నిర్ధరించింది. ఇతర అనుమతులపై రెవెన్యూశాఖ విచారణ జరుపుతోందని తెలిపారు.

## పూణె-బెంగుళూరు రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

**- ఎదురుగా వస్తున్న వాహనాలను ఢీకొన్న కంటెయినర్**

**- దాదాపు 9మంది మృతి చెందినట్లు సమాచారం**



**ముంబై,నవంబర్13( వెలుతురు):**

మహారాష్ట్రలో పుణెళి - బెంగళూరు జాతీయ రహదారిలోని నవలే వంతెనపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా వస్తున్న కంటైనర్ ట్రక్.. ఎదురుగా వస్తున్న వాహనాలను వేగంగా ఢీ కొట్టంది. ఆ వెంటనే ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో తొమ్మిది మంది మరణించారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. అదే రహదారిపై వెళ్లున్న వాహనదారులు వెంటనే స్పందించి.. పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులతోపాటు అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకు వచ్చారు. అనంతరం క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అత్యధిక వేగంతో వస్తున్న కంటైనర్ ట్రక్.. నియంత్రణ కోల్పోయిందని పోలీసులు తెలిపారు. అందువల్లే ఈ ప్రమాదం జరిగిందని చెప్పారు. ఈ ప్రమాదంలో జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. పోలీసులు.. రంగంలోకి దిగి ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తున్నారు. ఉన్నతాధికారులు ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

## బీహార్ ఎన్నికల ఓట్ల లెక్కింపుకు రంగం సిద్ధం

**ఉదయం 8గంటలకు పోస్టల్ బ్యాలెట్‌తో ప్రారంభం**

**పలు రాష్ట్రాల్లో ఉప ఎన్నికల ఓట్ల లెక్కింపు నేడే**

**న్యూఢిల్లీ,నవంబర్13( వెలుతురు):**

బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఎన్నికల సంఘం రంగం సిద్ధం చేసింది. శుక్రవారం ఉదయం 8.00 గంటలకు ఈ ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. తొలుత పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల లెక్కింపు జరుపుతారు. అనంతరం అంటే.. 8.30 గంటలకు ఓట్లు లెక్కింపు ప్రారంభమవుతుంది. అందుకోసం 243 రిటర్నింగ్ అధికారులు, 243 పరిశీలకుల ఈ ఓట్ల లెక్కింపును పర్యవేక్షించనున్నారు. ప్రతి టేబుల్ వద్ద ఒక సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో- ఆబ్జర్వర్లతో సిబ్బందిని ఏర్పాటు చేశారు. అందుకోసం ఎన్నికల సంఘం 4,372 కౌంటింగ్ టేబుల్స్ ఏర్పాటు చేసింది. అభ్యర్థులు నియమించిన 18 వేల మందికి పైగా ఏజెంట్స్ సైతం ఈ లెక్కింపు ప్రక్రియను పర్యవేక్షిస్తారు. రాష్ట్రంలోని మొత్తం 243 అసెంబ్లీ స్థానాలకు రెండు విడతలుగా పోలింగ్ నిర్వహించారు. నవంబర్ 6వ తేదీన 121 స్థానాలకు, నవంబర్ 11వ తేదీన 122 స్థానాలకు పోలింగ్ నిర్వహించారు. ఈ రెండు విడతల్లో ఓటర్లు భారీగా పోలింగ్ కేంద్రాలకు క్యూకట్టారు. దీంతో 67.13 శాతం పోలింగ్ నమోదయింది. 1951 తర్వాత.. ఆ రాష్ట్రంలో ఇంత భారీగా పోలింగ్ నమోదకావడం ఇదే తొలిసారి. ఇక ఈ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయం సాధిస్తుందంటూ ఇప్పటికే ఎగ్జిట్ పోల్స్ సర్వేలు స్పష్టం చేశాయి. మరి ఏ పార్టీకి ఓటరు పట్టం కట్టాడనే దానిపై శుక్రవారం సాయంత్రానికి స్పష్టత రానుంది. మరో వైపు ఈ అసెంబ్లీ ఎన్నికలతోపాటు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో జరిగిన ఉప ఎన్నికల ఫలితాలు కూడా ఇదేరోజు ప్రకటించనున్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లును ఎన్నికల సంఘం సిద్ధం చేసింది. అందులో హైదరాబాద్ నగరంలోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం సైతం ఉంది. ఈ అసెంబ్లీ స్థానానికి మంగళవారం అంటే.. నవంబర్ 11వ తేదీన ఉప ఎన్నికను నిర్వహించారు.



## ఆహ్వానితులకు మాత్రమే ప్రవేశం

### దర్శకుడు రాజమౌళి వీడియో ప్రకటన

ప్రిన్స్ మహేశ్ బాబు, దర్శక ధీరుడు రాజమౌళి కాంబినేషన్ లో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న ఎసెస్ఎంబి సినిమాకు సంబంధించిన ఈవెంట్ ఉంటుందా ఉండదా? అనే చర్చ రెండు రోజులుగా జరుగుతోంది. వరల్డ్ వైడ్ ఆడియెన్స్ ను దృష్టిలో పెట్టుకుని జియో హాట్ స్టార్ తో ఈ ఈవెంట్ ను రాజమౌళి బృందం ఎ÷-లాన్ చేసింది. నవంబర్ 15వ తేదీకి ఈ మూవీపై హైప్ పెంచుతూ ఒక్కో పాత్రను పరిచయం చేస్తూ వస్తోంది. ఇప్పటికే శ్రుతీహాసన్ పాడిన పాటను రివీల్ చేసిన టీమ్, తాజాగా ప్రియాంక చోప్రా లుక్ ను సైతం విడుదల చేసింది. ఇదిలా ఉంటే... ఢిల్లీలో జరిగిన బాంబ్ బ్లాస్ నేపథ్యంలో గ్లోబ్ ట్రాటర్ ఈవెంట్ ఉండకపోవచ్చుననే ప్రచారం రెండు రోజులుగా జరుగుతోంది. దీనికి రాజమౌళి తెర దించారు. ఖచ్చితంగా ఈ వేడుక ఉంటుందని హామీ ఇచ్చారు. కాకపోతే... ఇది పబ్లిక్ ఫంక్షన్ కాదని, కేవలం ఆహ్వానితులకు మాత్రమే అక్కడ ప్రవేశం ఉంటుందని, రామోజీ ఫిల్మ్ సిటీకి ఎవరు ఏ మార్గం గుండా రావాల్సి ఉంటుందనే విషయంలో రాజమౌళి ఓ వీడియో ద్వారా వివరించారు. పోలీసు శాఖ విధించిన ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకుని తాము కూడా చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు రాజమౌళి తెలిపారు. 18 సంవత్సరాల లోపు పిల్లలకు, పెద్ద వారికి ఈ ఈవెంట్ లో పాల్గొనే అవకాశం లేదని స్పష్టం చేశారు. వారంతా జియో హాట్ స్టార్ లో చూసి ఆనందించవచ్చని చెప్పారు. రామోజీ ఫిల్మ్ సిటీ మెయిన్ గెట్ ను నవంబర్ 15వ తేదీ మూసి వేస్తున్నారని, దానికి ముందు, దాని తర్వాత ఉన్న మార్గాల ద్వారా ఈవెంట్ కు ఆహ్వానితులు రావాల్సి ఉంటుందని, వీలైనంత ముందుగా వస్తే మంచిదని సలహా ఇచ్చారు. ఈ




కార్యక్రమానికి హాజరయ్యే వారు క్రమశిక్షణతో మెలగకపోతే కార్యక్రమం రద్దు అయ్యే ఛాన్స్ కూడా ఉందని రాజమౌళి పరోక్షంగా హెచ్చరించారు. సో... మహేశ్ బాబు అభిమానులు, సినిమాను ప్రేమించే వారు ఏ రీతిన ఈ కార్యక్రమంలో పాల్గొని, ఏ స్థాయిలో దీనిని విజయవంతం చేస్తారో చూడాలి.

## దేశంలో సగం మంది నన్ను చంపాలని చూశారు

### దకేరళ స్టోరీపై ఆదాశర్మ తాజా కామెంట్స్

వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ ప్రేక్షకులను అలరిస్తుంటారు నటి అదా శర్మ. ఆమె ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ది కేరళ స్టోరీ 2023లో విడుదలైన ఈ సినిమా సినీ, రాజకీయ రంగాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆ చిత్రం విడుదలైనప్పుడు దేశంలో సగం మంది తనను చంపాలని చూశారని అదా శర్మ తాజాగా వెల్లడించారు. రిస్క్ ఉన్న పాత్రలు చేసినప్పుడే కెరీర్‌కు మరింత విలువ పెరుగుతుంది. '1920' సినిమాతో నేను ఇండస్ట్రీలోకి అడుగుపెట్టాను. నా తొలి చిత్రమే పెద్ద సాహోసోపేతమని నేను భావిస్తాను. 'ది కేరళ స్టోరీ' విడుదలయ్యే వరకూ నాకు మంచి స్క్రిప్ట్ ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూసేదాన్ని. ఆ చిత్రం తర్వాత నా కెరీర్ మారిపోయింది. దాని తర్వాత 'బస్తర్: ది నక్సల్ స్టోరీ' చేశాను. ఈ రెండు చిత్రాలు విడుదలైనప్పుడు బెదిరింపులు ఎదుర్కొన్నాను. దేశంలో సగం మంది నన్ను చంపాలని కోరుకున్నారు. మిగతా సగం మంది నాపై ప్రశంసలు కురిపించారు. వారంతా నన్ను రక్షించారు' అని అదా తెలిపారు. స్క్రిప్ట్ ఎంపిక గురించి అదా మాట్లాడుతూ సవాలుతో కూడినవి మాత్రమే ఇష్టపడతానన్నారు. 'పాత్రలో భావోద్వేగం లేకపోతే నాకు నచ్చదు. యాక్షన్ సన్నివేశాలు ఉండాలి. నేను చేసే పాత్రలో ఎమోషన్ టచ్ ఉండాలి. అది చూసి నా కుటుంబం ఒకింత ఆందోళన చెందాలి. అవన్నీ లేకపోతే ఇక ఆ పాత్ర చేయడం ఎందుకు అని నాకు అనిపిస్తుందని అదా శర్మ చెప్పారు.






## ఫైట్స్ చేస్తున్న మన శంకర వర ప్రసాద్‌గారు

చిరంజీవి టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం మన శంకర వర ప్రసాద్‌గారు 'పండగకు వస్తున్నారు' అనే ట్యాగ్‌లైన్‌తో వస్తోన్న ఈ మూవీని అనిల్ రావిపూడి డైరెక్ట్ చేస్తున్నాడు. లేడీ సూపర్ స్టార్ నయనతార ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుంది. తాజాగా ఈ మూవీకి సంబంధించిన ఆసక్తిక వార్త ఒకటి బయటకు వచ్చింది.దప్రస్తుతం అనిల్ రావిపూడి టీం చిరంజీవిపై వచ్చే ఫైట్ సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తున్నట్టు సమాచారం. ఈ సీక్వెన్స్ ఫిలింనగర్ గోల్ఫ్ కోర్ట్ వల్ల షురూ కాగా.. మరో రెండు రోజుల పాటు షూటింగ్ కొనసాగనుందట. ఈ షెడ్యూల్‌తో చిరంజీవికి సంబంధించిన టాకీ పార్ట్ పూర్తి కానుందని ఇన్‌సైడ్ టాక్. ఇప్పటికే విడుదల చేసిన మీసాల పిల్ల సాంగ్ నెట్టింట మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది. ఈ చిత్రాన్ని సాహు గారపాటి, సుస్మిత కొణిదెల–విష్ణు ప్రసాద్ హోం బ్యానర్ గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో ఈ చిత్రానికి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఈ మూవీని 2026 సంక్రాంతి కానుకగా విడుదల చేయనుండగా.. రిలీజ్ డేట్‌పై మేకర్స్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.

## దర్శకత్వం చేస్తానంటున్న రానా

నటుడు రానా తన చిరకాల కోరికను తీర్చుకోబోతున్నాడు. చిన్న వయసు నుండే రానా దర్శకత్వం మీద దృష్టి పెట్టాడు. కొన్ని డాక్యుమెంటరీలనూ తీశాడు. దాంతో ఎప్పటికైనా రానా మంచి దర్శకుడు అవుతాడని రామానాయుడు భావించారు. కానీ చిత్రంగా 'లీడర్' మూవీతో రానా హీరో అయిపోయాడు. ఆ తర్వాత నిర్మాతగా మారాడు. తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ తనకు నచ్చిన పనిని చేస్తూ ముందుకు సాగుతున్నాడు. అలానే రానా తమ్ముడు అభిరామ్ 'అహింస' మూవీతో హీరో అయ్యాడు. తాజాగా దుల్కర్ సల్మాన్ తో కలిసి రానా 'కాంత' సినిమాలో నటించాడు. అంతే కాదు దుల్కర్ తో పాటు దీనిని నిర్మించాడు. ఇందులో రానా నటుడిగా కొన్ని సినిమాలను వదులు కున్నాడు కూడా. ఈ నెల 14న 'కాంత' తెలుగు, తమిళ భాషల్లో విడుదల అవుతోంది. ఈ సందర్భంగా రానా దర్శకుడు కావాలనే తన కోరిక గురించి అభిప్రయాలు పంచుకున్నాడు. వచ్చే నెల 14న తాను దర్శకత్వం వహించే సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలను తెలియచేస్తానని చెప్పాడు. నటుడిగా, నిర్మాతగా, పంపిణీదారుడిగా సినిమా రంగం గురించి పూర్తి అవగాహన ఉన్న రానా మెగాఫోన్ పడితే చిరకాల కోరికను నెరవేర్చుకున్నవాడు అవుతాడు. రానా దర్శకత్వం వహించే సినిమాను ఓన్ బ్యానర్ లో చేస్తాడా? బయటి నిర్మాణ సంస్థలో చేస్తాడా అనేది తెలియాల్సి ఉంది. అలానే తాను డైరెక్ట్ చేసే సినిమాలో రానా నటిస్తాడా? లేకపోతే కేవలం దర్శకత్వానికే పరిమితం అవుతాడా? అన్నది చూడాలి.



## ధర్మేంద్ర ఇంటిముందు మీడియా

### ఆగ్రహం వ్యక్తం చేసిన తనయుడు సన్నీ




బాలీవుడ్ నటుడు సన్నీ డియోల్ మీడియాపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఆయన తన సహనాన్ని కోల్పోయి .. నోటి మాట జారారు. ముంబైలోని ఇంటి ముందు వేచి చూస్తున్న మీడియా, ఫోటోగ్రాఫర్లపై అసహనాన్ని వ్యక్తం చేశారు. సీనియర్ నటుడు ధర్మేంద్ర ప్రస్తుతం ఇంట్లోనే చికిత్స పొందుతున్నారు. బ్రీచ్ క్యాండీ ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన ధర్మేంద్రకు ఇంటి వైద్యం అందిస్తున్నారు. అయితే కవరేజీకి వెళ్లిన మీడియా.. సన్నీ డియోల్ ఇంటి ముందే పడిగాపులు కాచింది. ఆ సమయంలో మీడియాను ఉద్దేశిస్తూ సన్నీ కాస్త ఆగ్రహానికి లోనయ్యాడు. చేతులు జోడించి మరీ సన్నీ డియోల్ మీడియాను తిట్టేశాడు. మీకు సిగ్గుగా అనిపించడం లేదా, మీకూ తల్లితండ్రులు, పిల్లలు లేరా, సిగ్గుగా ఎందుకు లేదని సన్నీ అన్నారు. ధర్మేంద్ర గురించి న్యూస్‌ను ప్రచురించే ఉద్దేశంతో కొన్ని రోజుల నుంచి ఫ్యామిలీ ఇంటి ముందే మీడియా ఎదురుచూస్తున్నది. దీంతో తీవ్ర ఫ్రస్టేషన్‌కు గురైన సన్నీ డియోల్ తనదైన స్టయిల్‌లో తన కోపాన్ని వ్యక్తం చేశ్వాడు. ప్రైవసీ ఇవ్వాలంటూ కోరాడు. సన్నీ ఆగ్రహానికి చెందిన వీడియో ఒకటి వైరల్ అవుతున్నది. సోషల్ మీడియాలో చాలా మంది యూజర్లు సన్నీకి మద్దతు తెలిపారు. డియోల్ ఫ్యామిలీ ప్రైవసీని మీడియా గౌరవించడం లేదని కొందరు యూజర్లు అన్నారు. ధర్మేంద్ర ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు ఆయన కూతురు ఈషా డియోల్ పేర్కొన్నారు.

## నాని, రామ్‌చరణ్‌లతో దుల్కర్ పోటీ

### ముగ్గురు సినిమాలు వచ్చే ఏడాదికి విడుదల

ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలోని వివిధ భాషల్లో తమకంటూ సెఫరేటు ఫ్యాన్ బేస్ సంపాదించుకున్న స్టార్ యాక్టర్లలో టాప్‌లో ఉంటారు టాలీవుడ్ యాక్టర్లు రాంచరణ్, నాని, మాలీవుడ్ యాక్టర్ దుల్కర్ సల్మాన్. యాక్టింగ్‌కు సంబంధించి ఈ ముగ్గురిలో ఎవరి స్టైల్ వారిదే.. ఈ స్టార్ హీరోల సినిమాలు ఒకేసారి బరిలోకి దిగితే ఎలా ఉంటుంది. అవును ఇప్పుడు ఆ వార్తే ఒకటి ఫిలింనగర్ సర్కిల్ లో రౌండప్ చేస్తోంది.దుల్కర్ సల్మాన్ నటించిన కాంత 14న ప్రేక్షకుల ముందుకు రానుందని తెలిసిందే. దుల్కర్ సల్మాన్ మరోవైపు పవన్ సాదినేని డైరెక్షన్‌లో ఆకాశంలో ఒక తార సినిమాలో నటిస్తున్నాడు. అయితే ఈ సినిమా రాంచరణ్, నాని ప్రాజెక్టులతో కలిసి 2026లో విడుదల కానుందంటూ వార్త మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచేస్తుంది. నాని నటిస్తోన్న చిత్రం ది ప్యారడైజ్. ఈ మూవీ శ్రీరామ నవమి కానుకగా 2026 మార్చి 26న థియేటర్లలోకి రానుంది.

రాంచరణ్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం పెద్ది. ఈ మూవీ 2026 మార్చి 27న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. తాజా టాక్ ప్రకారం దుల్కర్ సల్మాన్ నటిస్తోన్న ఆకాశంలో ఒక తార కూడా ఇదే సీజన్‌లో విడుదలకు రెడీ అవుతుందట. ఒకవేళ ఇదే నిజమైతే రాంచరణ్, నాని నుంచి దుల్కర్ సల్మాన్‌కు గట్టి పోటీ ఉండబోతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఆకాశంలో ఒక తార చిత్రంలో సాత్విక వీరవల్లి హీరోయిన్‌గా నటిస్తుండగా.. శృతిహాసన్ కీలక పాత్రలో నటిస్తోంది. లైట్ బాక్స్, స్వప్నా సినిమాస్, వైజయంతీ మూవీస్, గీతా ఆర్ట్స్ లాంటి లీడింగ్ బ్యానర్లపై తెరకెక్కిస్తున్న ఈ సినిమాపై అంచనాలు భారీగానే ఉన్నాయి.




## ప్రమోషన్లు షురూ... "అఖండ 2" నుంచి కీలక అప్డేట్

బాలకృష్ణ, మాస్ డైరెక్టర్ బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వస్తున్న తాజా చిత్రం "అఖండ 2". ఈ సినిమాపై ఇప్పటికే అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొనగా, ఆ ఉత్సాహాన్ని రెట్టింపు చేసేందుకు చిత్ర బృందం సిద్ధమైంది. సినిమా నుంచి మొదటి పాటను విడుదల చేసేందుకు ముహూర్తం ఖరారు చేసింది. రేపు ముంబైలోని జుహూ పీవీఆర్‌లో ఈ పాట విడుదల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ఈ పాటకు సంబంధించిన ఓ ఆసక్తికర విషయాన్ని సంగీత దర్శకుడు ఎస్.ఎస్. తమన్ సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. ఈ పాటను ప్రముఖ గాయకులు శంకర్ మహదేవన్, కైలాశ్ ఖేర్ కలిసి ఆలపించారని తెలిపారు. "ఈ పాట వింటే మీకు నిద్రపట్టదు. ఆ ఎనర్జీ మనలో తాండవం చేస్తుంది. ఇది కేవలం పాట కాదు, శివుడి శక్తి" అంటూ తమన్ చేసిన పోస్ట్ అభిమానుల్లో అంచనాలను ఆకాశానికి చేర్చింది. ఈ ఒక్క అప్‌డేట్‌తో సినిమా మ్యూజికల్ ప్రమోషన్లకు అదిరిపోయే ఆరంభం లభించినట్లయింది. సినిమా విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో చిత్ర యూనిట్ ప్రమోషన్ల వేగాన్ని పెంచింది. తెలుగుతో పాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో విడుదలవుతున్న ఈ సినిమాకు అన్ని మార్కెట్లలోనూ గట్టిగా ప్రచారం కల్పించాలని భావిస్తున్నారు. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం, "అఖండ 2" అవుట్‌పుట్ అద్భుతంగా వచ్చిందని తెలుస్తోంది. ఈ హైప్‌ను ప్రేక్షకులకు చేరవేయాలంటే సరైన సమయంలో టీజర్, ట్రైలర్‌తో పాటు ఆల్బమ్‌ను విడుదల చేయడం చాలా కీలకం.

# ఎర్రకోట వద్ద ఎగరిపడ్డ చేయి గుర్తింపు

**- దాదాపు 300 మీటర్ల దూరంలో లభ్యం**

**- ఛిద్రమైన దేహాల గుర్తింపులో ఫోరెన్సిక్ విభాగం**

**న్యూఢిల్లీ,నవంబర్13( వెలుతురు):**
దేశ రాజధాని దిల్లీలోని ఎర్రకోట వద్ద పేలుడు ఘటన పలు కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపింది. ఘటనాస్థలంలో భయానక దృశ్యాలు ప్రతి ఒక్కరినీ కలచివేస్తున్నాయి. ఆ పేలుడు తీవ్రతకు మృతదేహాలు ఛిద్రమై మాంసపు ముద్దలు కొన్ని వందల మీటర్ల దూరంలో ఎగిరిపడ్డాయి. తాజాగా లజపతిరాయ్ మార్కెట్‌లోని ఓ దుకాణంపై తెగిపడిన చేయిని దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఎర్రకోట కారిడార్‌కు ఎదురుగా ఉన్న ఈ దుకాణం.. పేలుడు జరిగిన ప్రాంతానికి దాదాపు 300 మీటర్ల దూరంలో ఉంది. ఈ దుకాణం పైకప్పుపై మోచేతి కింది భాగం వరకు ఉన్న చేయిని ఫోరెన్సిక్ అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. డీఎన్ఏ పరీక్షలతో ఈ శరీర భాగం మృతుల్లో ఎవరిదో గుర్తించనున్నారు. ఇక, ఈ పేలుడులో మృతిచెందిన వారి



శరీరాలకు పోస్ట్‌మార్టం నిర్వహించారు. చాలా మృతదేహాలపై బలంగా దెబ్బలు తగిలిన గాయాలున్నట్లు గుర్తించారు. పేలుడు తీవ్రతకు వారు ఎగిరి సమీపంలోని గోడకు లేదా నేలపై బలంగా పడిపోయి ఉంటారని ఫోరెన్సిక్ అధికారులు అనుమానిస్తున్నారు. ఇక, మృతుల్లో చాలామందికి ఊపిరితిత్తులు, చెవులు, ఉదరభాగం తీవ్రంగా దెబ్బతిన్నట్లు ఫోరెన్సిక్ నివేదిక వెల్లడించింది. ఈ ఘటనకు హైగ్రేడ్ పేలుడు పదార్థాలను వినియోగించినట్లు ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ అధికారులు వెల్లడించారు. ఘటనాస్థలం నుంచి దాదాపు 40 నమూనాలను సేకరించారు. వీటిల్లో బు÷-లలెట్లు, రెండు వేర్వేరు రకాల పేలుడు పదార్థాలు ఉన్నట్లు గుర్తించారు. అందులో ఒకటి అమ్మోనియం నైట్రేట్‌ను పోలినట్లుగా ఉందన్నారు. రెండోది దీనికంటే శక్తిమంతమైనది అయి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. సోమవారం సాయంత్రం 6.50 గంటల ప్రాంతంలో ఈ పేలుడు ఘటన చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఇందులో మృతుల సంఖ్య 13కు పెరిగినట్లు పోలీసులు తాజాగా వెల్లడించారు.

# పెరుగుతున్న చలి తీవ్రత

**- సిర్పూర్‌లో అత్యంత కనిష్టంగా 7.1 డిగ్రీలు**

**- అప్రమత్తంగా ఉండాలని వైద్యుల హెచ్చరిక**

**హైదరాబాద్/ఆదిలాబాద్,నవంబర్13( వెలుతురు):**
రాష్ట్రంలో చలి తీవ్రత రోజురోజుకు పెరిగిపోతున్నది. రాత్రి వేళల్లో ఉష్ణోగ్రతలు పడిపోతుండటంతో చలిలో ప్రజలు వణికిపోతున్నారు. ఏజెన్సీ గ్రామాల్లో సింగిల్ డిజిట్‌కు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. గురువారం ఉదయం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్‌లో రాష్ట్రంలోనే అత్యంత కనిష్ఠంగా 7.1 డిగ్రీలుగా నమోదయింది. ఇక తిర్యాణిలో 8.2 డిగ్రీలు నమోదయింది. దీంతో ప్రజలు ఇండ్ల నుంచి బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. ఉదయం 8 గంటలు దాటినప్పటికీ చలి తీవ్రత తగ్గకపోవడంతో స్కూళ్లు, కార్యాలయాలు, రోజువారీ పనుల నిమిత్తం బయటకు వెళ్లేవారు ఇబ్బంది పడుతున్నారు. ఇక హైదరాబాద్‌లో అతితక్కువగా హెచ్‌సీయూలో 11.8 డిగ్రీలు రికార్డయింది. రాజేంద్రనగర్‌లో 12.9, మారేడుపల్లిలో 13.6 డిగ్రీల రికార్డయింది. ఉదయం 6 గంటల సమయంలో నగర శివార్లలోని ఇబ్రహీంపట్నంలో 11.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాగా, మరో నాలుగు ఐదు రోజుల్లో చలి తీవ్రత మరింత పరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాష్ట్రంలో ఎన్నడూ లేనట్టుగా చలి తీవ్రత బాగా పెరిగింది. ఒక్కసారిగా కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోయాయి. మరికొన్ని రోజులూ ఇదే పరిస్థితి



ఉంటుందని, చలి మరింత పెరుగుతుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. తెలంగాణ రాష్ట్రం తీవ్ర చలి ప్రభావిత జోన్‌లో ఉందని ఈసారి కూడా అదే పరిస్థితి ఉంటుందని వాతావరణ నిపుణులు తెలిపారు. కనిష్ట ఉష్ణోగ్రతలు 8.5 డిగ్రీల వరకు పడిపోయే అవకాశం ఉందని హెచ్చరించారు. ఇక చలి వాతావరణంలో జాగ్రత్తగా ఉండాలని, లేకుంటే ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మూడు, నాలుగు రోజులుగా శ్వాసకోశ సమస్యలు, జలుబు, దగ్గు, జ్వరాలతో ఆస్పత్రులకు వస్తున్న రోగుల సంఖ్య పెరుగుతోందని చెబుతున్నారు.రాష్ట్రంలో మరో మూడు నాలుగు రోజుల పాటు చలి తీవ్రత మరింతగా పెరుగుతుందని వాతావరణ కేంద్రం ప్రకటించింది. రాత్రిపూట కనిష్ట ఉష్ణోగ్రతలు 8.5 డిగ్రీల నుంచి 12.5 డిగ్రీల మధ్య నమోదవుతాయని పేర్కొంది. చలి తీవ్రతకు సంబంధించి మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల లోపునకు పడిపోవచ్చని హెచ్చరించింది. మిగతా అన్ని జిల్లాల్లో 10-12.5 డిగ్రీల మధ్య కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతాయంటూ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. కాగా, చలి తీవ్రతతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఏజెన్సీ గ్రామాలు వణికిపోతున్నాయి. ఉదయం 9 గంటల వరకు కూడా పొగ మంచు కమ్ముకుంటోంది. ÷ూష్ట్రంలో చలి తీవ్రత పెరిగే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్యశాఖ హెచ్చరించింది. రెస్పిరేటరీ ఇన్‌ఫెక్షన్లు, సీజనల్ ఫ్లూ పెరిగే అవకాశం ఉండటంతో అలర్ట్‌గా ఉండాలని సూచించారు. జ్వరం, దగ్గు, గొంతు తడి ఆరిపోవడం, నొప్పులు ఉంటే నిర్లక్ష్యం చేయవద్దని తెలిపారు. గర్భిణులు, ఐదేండ్లలోపు చిన్నారులు, వృద్ధుల్లో సీజనల్ ఫ్లూ లక్షణాలు ఉంటే వెంటనే సమీపంలోని దవాఖానలను సందర్శించాలని కోరారు. అధిక జ్వరం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఉంటే తక్షణమే దగ్గరలోని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందాలని సూచించారు.

# పేలుడు ఘటనలో 13కు చేరిన మృతుల సంఖ్య

**- చికిత్స పొందుతూ మరొకరు మృతి**

**న్యూఢిల్లీ,నవంబర్13( వెలుతురు):**
దేశ రాజధాని ఢిల్లీలో పేలుడు ఘటనలో మృతుల సంఖ్య పెరిగింది. లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరో వ్యక్తి మరణించారు. దీంతో పేలుడు ఘటనలో మరణించిన వారి సంఖ్య 13కి పెరిగింది. సోమవారం సాయంత్రం ఢిల్లీలోని చారిత్రక కట్టడం ఎర్రకోట సమీపంలో భారీ పేలుడు సంభవించిన విషయం తెలిసిందే. సాయంత్రం 7 గంటల సమయంలో భారీ శబ్దంతో పేలుడు జరిగింది. ఈ ఘటనలో అక్కడికక్కడే తొమ్మిది మంది మరణించారు. మరో 20 మంది క్షతగాత్రులను చికిత్స నిమిత్తం లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరుసటి రోజు ముగ్గురు ప్రాణాలు కోల్పోగా.. ఇప్పుడు మరో వ్యక్తి మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. మిగతావారికి ఆసుపత్రిలో చికిత్స కొనసాగుతోంది.

# ఢిల్లీలో మరోమారు పేలుడు శబ్దం

**- ఉలిక్కిపడ్డ మహిపాల్‌పూర్ ప్రాంత ప్రజలు**

**- బస్సు టైర్ పేలినట్లు అధికారుల గుర్తింపు**



**న్యూఢిల్లీ,నవంబర్13( వెలుతురు):**
ఢిల్లీలో పేలుడు ఘటనతో దేశం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఈ ఘటనతో ఢిల్లీ వాసులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. భారీ కుట్రకు ఉగ్రవాదులు ప్లాన్ చేశారని తేలడంతో నగర వాసులు భయంతో వణికిపోతున్నారు. ఈ క్రమంలో ఎలాంటి పేలుడు శబ్దం వినిపించినా ఉలిక్కి పడుతున్నారు. తాజాగా ఢిల్లీలో తాజాగా భారీ శబ్దం కలకలం రేపింది. గురువారం ఉదయం ఢిల్లీలోని మహిపాల్‌పూర్ ప్రాంతంలో రాడిసన్ హోటల్ సమీపంలో పెద్ద శబ్దం రావడంతో స్థానికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. మరోసారి పేలుడు జరిగిందని ఆందోళన చెందారు. అయితే, అది పేలుడు కాదని అధికారులు తేల్చారు. ఆ శబ్దం బస్సు టైర్ పేలడం వల్ల వచ్చిందిగా తేల్చారు. ఢిల్లీ అగ్నిమాపక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. 'మహిపాల్‌పూర్ ప్రాంతంలో రాడిసన్ హోటల్ సమీపంలో భారీ శబ్దం వచ్చిందంటూ అగ్నిమాపక శాఖకు ఉదయం 9:18 గంటలకు ఫోన్ కాల్ వచ్చింది. అప్రమత్తమైన అధికారులు, సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. అయితే, ఆ శబ్దం టైరు పేలడం వల్ల వచ్చింది. పేలుడు కాదు' అని తెలిపారు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

# ఐదు రాష్ట్రాల్లో ఎన్ఐఎ సోదాలు

**- అల్‌ఖైదాతో సంబంధం ఉన్న బంగ్లాదేశీయుల గుర్తింపు**




**న్యూఢిల్లీ,నవంబర్13( వెలుతురు):**
జాతీయ దర్యాప్తు సంస్థ గురువారం ఐదు రాష్ట్రాల్లో దాడులు నిర్వహించింది. అల్ ఖైదా గుజరాత్ ఉగ్రవాద కుట్రలో అక్రమ బంగ్లాదేశ్ వలసదారుల ప్రమేయం ఉన్నట్లుగా అనుమానిస్తున్నారు. ఐదురాష్ట్రాల్లోని దాదాపు పది చోట్ల ఎన్ఐఏ తనిఖీలు నిర్వహించింది. పశ్చిమ బెంగాల్, త్రిపుర, మేఘాలయ, హర్యానా, గుజరాత్‌లలో అనుమానితులు, వారి సహచరులకు సంబంధించిన స్థలాల్లో ఎన్ఐఏ బృందాలు సోదాలు చేసినట్లుగా ఎన్ఐఏ ప్రతినిధి ఒకరు తెలిపారు. ఈ కేసు 2023లో నమోదైంది. నలుగురు బంగ్లాదేశ్ జాతీయులు మొహమ్మద్ సోజిబ్ మియాన్, మున్నా ఖలీద్ అన్సారీ, అజ్రుల్ ఇస్లాం, అబ్దుల్ లతీఫ్ పేర్లు ఇందులో ఉన్నాయి. నిందితులు ఫేక్ ఐడీలను ఉపయోగించి బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా భారత్‌లోకి ప్రవేశించారు. వారికి నిషేధిత అల్ ఖైదా ఉగ్రవాద సంస్థతో సంబంధం కలిగి ఉన్నట్లుగా గుర్తించారు. బంగ్లాదేశ్‌లోని అల్-ఖైదా కార్యకర్తలకు నిధులు సేకరించడం, బదిలీ చేసినట్లుగా తేలింది. ముస్లిం యువతను ఉగ్రవాదం వైపు ప్రోత్సహిస్తున్నట్లు గుర్తించారు. ఎన్ఐఏ నవంబర్ 10, 2023న అహ్మదాబాద్‌లోని ప్రత్యేక కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసింది. గతంలో మహారాష్ట్ర యాంటీ-టెర్రరిజం స్క్వాడ్ నిషేధిత ఉగ్రవాద సంస్థలు అల్-ఖైదా, భారత ఉపఖండంలోని అల్-ఖైదాతో సంబంధాలున్నాయని ఆరోపిస్తూ పుణెళికు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను అరెస్టు చేసింది. ఏటీఎస్ థానేకు చెందిన ఓ ఉపాధ్యాయుడిని ప్రశ్నించింది. అక్టోబర్ 27న ఏటీఎస్ 37 ఏళ్ల జుబైర్ హంగర్గేకర్‌ను అరెస్టు చేసింది. అతను నిషేధిత సంస్థలతో సంబంధం కలిగి ఉన్నాడని, రాడికలైజేషన్ కార్యకలాపాల్లో పాల్గొన్నాడని ఆరోపణలున్నాయి. దర్యాప్తులో ఏటీఎస్ అతని పాత్రతో పాటు పాకిస్తానీ కాంటాక్ట్ నంబర్‌ను గుర్తించారు.

# మూడో కారు కోసం దర్యాప్తు ముమ్మరం

**- ఎరుపు రంగు ఫోర్డ్ ఎకోస్పోర్ట్ కారు స్వాధీనం**

**- కారు నడిపిన వ్యక్తి ఫహీమ్ అరెస్ట్**

**న్యూఢిల్లీ,నవంబర్13( వెలుతురు):**
ఢిల్లీ పేలుడు కేసులో తాజాగా మరో అరెస్ట్ చోటు చేసుకుంది. పేలుడు కేసులో ప్రధాన అనుమానితుడైన డాక్టర్ ఉమర్ ఉన్ నబీకి సంబంధం ఉన్నట్లు అనుమానిస్తున్న డీఎల్10సీకే0458 అనే ఎరుపు రంగు ఫోర్డ్ ఎకోస్పోర్ట్ కారును పోలీసులు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. హర్యానాలోని ఖండవలి గ్రామంలో బుధవారం కనుగొన్నారు. అయితే, ఆ కారును అక్కడ పార్క్ చేసిన వ్యక్తిని ఫరీదాబాద్ పోలీసులు తాజాగా అరెస్ట్ చేశారు. అతడిని ఫహీమ్‌గా గుర్తించారు. ఈ మేరకు అతడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు నిఘా వర్గాల ద్వారా తెలిసింది. మరోవైపు ఎర్రకోట వద్ద పేలుడుతో సంబంధం ఉన్న మూడో కారు కోసం దర్యాప్తు సంస్థలు వేట కొనసాగిస్తున్నాయి. సోమవారం సాయంత్రం తెలుపు రంగు హుందయ్ ఐ20 కారుతో డాక్టర్ ఉమర్ నబీ ఆత్మాహుతి దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. ఉగ్రకుట్ర కోసం మూడు కార్లు వాడినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు ఎరుపు రంగు ఫోర్డ్ ఎకోస్పోర్ట్ కారును ఫరీదాబాద్‌లో గుర్తించిన విషయం తెలిసిందే. ఇప్పుడు మూడో కారు మారుతీ బ్రీజా కోసం పోలీసులు అన్వేషిస్తున్నారు. ఆ కారు ఆచూకీ చిక్కడం లేదు. నిందితులు ఆ మూడో కారును తప్పించుకోవడం కోసం వాడాలని భావించి ఉంటారని అధికారులు అనుమానిస్తున్నారు. దర్యాప్తు సంస్థలకు చెందిన బృందాలు ఆ కారు కోసం వేట కొనసాగిస్తున్నాయి. మారుతీ బ్రీజా కారును గుర్తించేందుకు ఢిల్లీ, ఎన్సీఆర్ ప్రాంతంతో పాటు సమీప రాష్ట్రాల్లోనూ పోలీసులు వెతుకుతున్నారు.







Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com